*Issued on 19-6-'59*

Volume. XXII

No. 6

20th December, 1958.
(Saturday)

# Andhra Pradesh Legislative Assembly Debates

## OFFICIAL REPORT

### Part II—Proceedings other than Questions and Answers

CONTENTS

| | Pages |
|---|---|
| Business of the House ... | 363–364 |
| Message from the Council | |
| The Andhra Pradesh Appropriation (Bill, 1958 No. 3) ... | 364 |
| Adjournment motion re: | |
| Raid of the house of President of the Village Panchayat Committee, Thopuran ... | 365 |
| Calling attention to matters of urgent public importance re: | |
| Payment of Ad-hoc Dearness Allowance to certain workers in the Highways department ... | 365–367 |
| Rickshaw strike in Vijayawada ... | 367–368 |
| Business of the House ... | 369–371 |
| Government Bills | |
| The Andhra Essential Articles Control and Requisitioning (Temporary Powers) (Andhra Pradesh Extension and Amendment) Bill, 1958—Passed ... | 372–374 |
| The Andhra Irrigation (Levy of Betterment Contribution) (Andhra Pradesh Extension and Amendment) Bill, 1958—Referred to Select Committee ... | 374–376 |
| Discussion on Food Situation in the State ... | 376–428 |
| Messages from the Council | |
| The Andhra Pradesh State Legislature (Vacation of Seat on simultaneous Membership) Bill, 1958 | |
| The Andhra Essential Articles Control and Requisitioning (Temporay Powers) (Andhra Pradesh Extension and Amendment) Bill, 1958 ... | 428–429 |
| The Indian Stamp (Andhra Pradesh Extension and Amendment) Bill, 1958 ... | 429 |

NOTE: * at the commencement of the speech denotes confirmation from the Member not received in time.

Printed by Ajanta Printers, Secunderabad,
for the Director, Government Printing Press, Hyderabad-A. P.

# THE ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

[*Part II – Proceedings other than Questions and Answers*]

OFFICIAL REPORT

---

*Twenty fourth day of the Eighth Session of the Andhra Pradesh Legislative Assembly*

---

## ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY

*Saturday, the 20th December, 1958*

The House met at Nine of the Clock

[MR. SPEAKER IN THE CHAIR]

## QUESTIONS AND ANSWERS

( SEE PART I )

### BUSINESS OF THE HOUSE

*శ్రీ యస్. సి. శేషాద్రి (రాయదుర్గ్) : పే కమిటీ రిపోర్టు మేము వెళ్ళిపోయే లోపల మాకుఅందజేస్తారా, లేక మా ఊళ్ళకు పంపిస్తారా ?

*ముఖ్యమంత్రి (శ్రీ యన్. సంజీవరెడ్డి) : నిన్న వేయిప్రతులు అచ్చువేయించమని press కి యిచ్చాము. Evidently, they are not ready. If they are not ready before the Hon. Members leave, they will be sent to their addresses. I hope the Hon. Speaker will make arrangements to send them to their addresses.

*శ్రీ జి. నరసింహమూర్తి (అమలాపురం - జనరల్) : ఈ రోజు మిగిలిపోయిన ప్రశ్నలకు జవాబులు లైబ్రరీలో పెట్టిస్తాంఅన్నారు సభ్యులకు ఒక్కొక్క ప్రతి యింటికి పంపించే యేర్పాటు చేస్తారా ?

*Mr. Speaker:* I do not think it is possible. The remaining questions will be given to the Press, because

they are laid on the table of the House. Six copies will be put in the Library. నెమ్మదిగా చదువుకోండి.

శ్రీ జి నరసింహామూర్తి : ఫిబ్రవరి నెలలో పబ్లికు సర్వీసు కమిషను పరీక్షలు పెడుతున్నారని విన్నాను. యూనివర్శిటీ పరీక్షలకు హాజరయేవారి కది యిబ్బందిగా వుంటుంది. అందుచేత యూనివర్శిటీ పరీక్షలయిన తరువాత సర్వీసుకమీషను పరీక్షలను పెట్టే యేర్పాటు చేయాలి.

మిస్టర్ స్పీకర్ : ఆ రెండు విషయాలూ గవర్నమెంటుకు సంబంధించినవికావు.

శ్రీ యన్. సంజీవరెడ్డి : అభ్యర్థులకు యిబ్బందిగా వుంటే మరుసటి సంవత్సరం పరీక్షకు వెళ్లవచ్చు. కొన్ని ఉద్యోగాలు ఖాళీగావుంటే సర్వీసు కమీషనువారిని అడుగుతాము. వారు పరీక్షలను పెడతారు. It is a continueous process. అభ్యర్థులు యేదో ఒకటి మానేయాలి.

మిస్టర్ స్పీకర్ : యూనివర్సిటీ పరీక్షలుగాని పబ్లికుసర్వీసు కమిషన్ పరీక్షలుగాని ప్రభుత్వవశంలోలేవు. అందుచేత వారు యేమిచేయడానికి వీలులేదు.

## MESSAGE FROM THE COUNCIL

### *The Andhra Pradesh Appropriation (Bill No. 3) (L. A. Bill No. 48 of 1958.)*

మిస్టర్ స్పీకర్ : కౌన్సిల్‌నుంచి వచ్చిన ఒక మెసేజ్ ఇది :

In accordance with Rule 111 of the Andhra Pradesh Legislative Council Rules as adopted under clause 2 of Article 208 of the Constitution of India, I return herewith a copy of the Andhra Pradesh Appropriation (Bill No. 3)(L.A. Bill 48 of 1958) which was passed by the Legislative Assembly at its sitting held on the 18th December 1958 and transmitted to the Legislative Council for its recommendations, duly signed by me, and state that this House has no recommendations to make to the Legislative Assembly in regard to the said Bill.

## ADJOURNMENT MOTION

### *Re : Raid of the House of President of the Village Panchayat Committee, Thopuran.*

*Mr. Speaker :* There is a notice of adjournment motion :

To discuss a matter of urgent public importance viz., serious situation arising out of the raid of the house of R. Satyanarayana, President of the Village Panchayat Committee, Thopuran, Taluk Gajwel.

తూపురాన్‌లో జరిగిన అల్లరులనుగురించి రూలు 74 క్రింద శ్రీ పి. వి. రాజేశ్వరరావుగారిచ్చిన ప్రతిపాదనవున్నది.

*శ్రీ యన్. సంజీవరెడ్డి: అధ్యక్షా, తూపురాన్‌గురించి రెండు వాయిదా తీర్మానాలు వచ్చినవి అవతలవైపునుంచి శ్రీ యల్లారెడ్డిగారు, యివతలవైపు నుంచి శ్రీ పి. వి. రాజేశ్వరరావుగారు యిచ్చినారు. అక్కడ బహిరంగసభలో అల్లరి జరిగినమాట నిజము. ఎన్నిక జరిగిన తరువాతనో, ఎన్నిక జరుగకముందో 15 మంది కాంగ్రెసువారిని తన్నారనీ, కాంగ్రెసువారి బహిరంగసభలో అల్లరి చేశారనీ, వారికీ వీరికీ దెబ్బలుతగిలాయనీ, పోలీసువారు రెండుపక్షాలవారినీ సర్దడానికి ప్రయత్నం చేశారనీ తెలిసినది. కాని tension కొంచెం పెరిగేఉన్నది. ప్రమాదకరమైన దెబ్బలు ఎవరికీ తగులలేదు. కొంచెం scuffle మాత్రం జరిగిన మాట నిజం. I can only appeal to both sides in that area to maintain peace. ఎన్నికలు అయిపోయి రెండునెలలు అయింది. మరల ఎన్నికలు రావడానికి మూడుసంవత్సరాల వ్యవధి ఉన్నది. ఇప్పటినుంచీ tension maintain చేస్తే చాలాకష్టం. కాబట్టి రెండుపక్షాలవారు యికమీదట అక్కడ శాంతి నెలకొల్పడానికి ప్రయత్నించాలని ప్రార్థిస్తున్నాను. ఈవాయిదా తీర్మానాలను press చేయవద్దనికూడా ప్రార్థిస్తున్నాను.

*Mr. Speaker :* The issue is closed.

## CALLING ATTENTION TO MATTERS OF URGENT PUBLIC IMPORTANCE

### *Payment of Ad hoc dearness allowance to certain workers in the Highways Department.*

మిస్టర్ స్పీకర్ : తరువాత శ్రీ వి. విశ్వేశ్వరరావుగారు Rule 74 క్రింద Highways workers కి adhoc Dearness Allowance గురించి యిచ్చిన ప్రతిపాదన తీసుకొందాము.

* శ్రీ వి. విశ్వేశ్వరరావు (మైలవరం): అధ్యక్షా, హైవేస్ కార్మికులు సమ్మె నోటీసు యిచ్చినప్పుడు ఆగస్టులో సంభాషణలు జరిపారు. హనుమంత రావు కమిటీ రిపోర్టులో లేకపోతే దానిని కూడా Pay Commission కి refer చేస్తామన్నారు. ఇంతవరకు Adhoc D. A. యిచ్చేవారినుండి తిరిగి వసూలు చేయకుండా చేస్తామని oral గా చెప్పారు. Highway T. M. & S. Yard పని వారలకు 11 మాసాలుగా Adhoc D. A. యివ్వడం జరుగుతున్నది. Workshops లో పనిచేసేవారందరినుండీ కూడా తిరిగి వసూలు చేయాలని ప్రభుత్వం ఒక order జారీచేసినదని, అక్కడ వున్న ఇంజనీరు వసూలుచేస్తున్నారని కూడా తెలుస్తున్నది. అంతేకాకుండా గత 11 మాసాలుగా వారికి service conditions, rules లేవు. వాటిని పరిశీలించమని అనేక పర్యాయములు ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చాము.

* శ్రీ యన్. సంజీవరెడ్డి: ముఖ్యమైన విషయాలపై వాయిదా తీర్మానాలు తేవడం మంచిది. కాని ప్రతి చిన్న విషయంపై వాయిదా తీర్మానాల వల్ల కాలం వృథా అయిపోతుంది. Rule 74 క్రింద కూడా అతి ముఖ్యమైన విషయాలపైననే ప్రతిపాదనలువస్తే బాగుంటుంది. ప్రతిరోజూ routine matters పై కూడా తీర్మానాలు రానివ్వకూడదని ప్రార్థిస్తున్నాను.

*Mr. Speaker :* I shall use my discretion.

శ్రీ వి విశ్వేశ్వరరావు: Pay Committee కి refer చేస్తామని మంత్రి గారు వాగ్దానం చేశారు. ఇంతవరకు జరుగలేదు. అందుచేత యీ ప్రతిపాదన అవసరమైనది.

**Minister for Buildings (Sri M. Narsing Rao):* The scheme for payment of Rs. 6/- as D.A. has been sponsored by the Government of India and two-thirds of the expenditure is borne by them. According to their instructions, certain categories including the members of work-charged establishments are not eligible for the benefit. This Government, are, however, examining the question. It is not correct to say that this Government have not referred the case of Highways workers to the Pay Committee. The matter has been referred to the Pay Committee. Sri Hanumantha Rao purporting to be the General Secretary of the Highways Employees Union sent a representation to the Chairman of

the Pay Committee and was informed that the matter would be considered by the Government and the Pay Committee.

మిస్టర్ స్పీకర్ : కాలంవృథా అయిపోతుందనుకోకూడదు. మన శాసన సభ సమావేశంలో ముఖ్యమైన అంశాలు చర్చకు రావలసినదే.

శ్రీ యన్. సంజీవరెడ్డి : దానికి ఒక ప్రత్యేకమైన కాలం యేర్పాటు చేయండి, యిప్పటి పద్ధతిలో Government Business suffer అవుతున్నది.

మిస్టర్ స్పీకర్ : ఇది కూడా ప్రభుత్వానికి సంబంధించినదే.

శ్రీ యన్. సంజీవరెడ్డి : నిజమే. కాని ఒక time నిర్ణయించండి.

మిస్టర్ స్పీకర్ : ఆలోచించి యేర్పాటుచేద్దాము.

శ్రీ యన్. సంజీవరెడ్డి : రెండు గంటలసేపు ప్రశ్నలకి, రెండు గంటల సేపు Rule 74 క్రింద ప్రతిపాదనలకి పెట్టుకుని కొన్ని రోజులు పూర్తిగా దీనికే allot చేస్తే తరువాత యేమైనా బిల్లులు వుంటే, వాటికి time కొంచెం తీసుకుందాము.

మిస్టర్ స్పీకర్ : ఇంకా రెండు రోజులు యెక్కువ అయితే అవుతుంది. కాలం వృథా అనుకోకూడదు.

*Sri N. Sanjiva Reddy :* Sir, You have the inherent right to decide which is important and which is not. It is not that every member can ask. You have the right to decide which is important and which is not.

## *Rickshaw Strike in Vijayawada.*

*Mr. Speaker :* What has the hon. Home Minister to say about this matter ?

***హోం శాఖామాత్యులు (శ్రీ కె. వి. రంగారెడ్డి)** : అధ్యక్షా, ఈ విషయము గురించి యింతకుముందు starred questionకు సమాధానమిస్తూ రెండుమూడు సార్లు చెప్పినాను. విజయవాడ సైకిలురిక్షా యూనియన్‌వారు ఈ క్రింద వివరించబడిన కోర్కెల నిమిత్తము 15-12-1958 వ తేదీ నుంచి సమ్మె ప్రారంభించినారు. సైకిలు రిక్షాకు 24 గంటలకు యివ్వవలసిన అద్దె రు. 2 లుకు తగ్గించవలెనని, రిక్షాలో యిద్దరిని తీసికొనిపోవుటకు అనుమతి నివ్వవలెనని, నగరములోవున్న 1800 రిక్షాలకు 3 వేల లైసెన్సులు మంజూరు చేయవలెనని సంవత్సరమునకు నూటికి 10 వంతున రిక్షాలను తగ్గించుటకై జారీచేసిన ఉత్తరు

వును రద్దుచేయాలనీ కోరుతూ సమ్మె చేసినారు. ఈ విషయములు బాగా పరిశీలించబడినవి. రిక్షా అద్దె 2 రూపాయలకు తగ్గించాలనే విషయము ప్రభుత్వమునకు సంబంధించినది కాదు. అది రిక్షా కార్మికులకు, యజమానులకు సంబంధించిన విషయము. రెండవ విషయము కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం రిక్షాలాగే వారి ఆరోగ్యం దృష్ట్యా ఒకరినికంటె ఎక్కువగా రిక్షాలో ఎక్కించకూడదనే నియమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేసింది. ప్రభుత్వ నిర్ణయమును అమలుజరుప వలసినదిగా పోలీసు ఇనస్పెక్టర్ జనరలుకు ఉత్తర్వులు ఇవ్వబడినవి. రిక్షా లాగుటను పూర్తిగా నిషేధించాలనే ఉద్దేశ్యముతో కేంద్ర ప్రభుత్వము కొన్ని నిర్ణయములనుచేసి వాటిని అమలుజరిపే చర్యలు తీసుకొనవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించినది. ఆ ఆదేశములో క్రొత్త బండ్లకు, డ్రైవర్లకు లైసెన్సులు మంజూరు చేయవద్దని సూచించినారు. ఈ సూచనను రాష్ట్ర ప్రభుత్వము ఆమోదించుటవలన రాష్ట్రములో యెక్కడా క్రొత్త లైసెన్సులు యివ్వడములేదు. కేంద్ర ప్రభుత్వమువారు ప్రతి రిక్షాకు జీవితకాల పరిమితిని నిర్ణయించి, ఆ పరిమితి దాటగానే ఆ రిక్షాను వాడుటకై లైసెన్సు మంజూరు చేయరాదని ఆదేశించినారు. పది సంవత్సరములు కాలముకంటె పూర్వము నుండి వాడుకలోనున్న రిక్షాలకు లైసెన్సులు యివ్వకూడదని, రిక్షాల సంఖ్యలో 10% తగ్గించవలెనని ప్రభుత్వ ఆదేశానుసారము నిర్ణయించబడినది. ఈ విధముగా ఒకక్రమపద్ధతిలో మొత్తము రిక్షాబండ్లను నిర్మూలించుటకు కేంద్ర ప్రభుత్వం వారు నిర్ణయం చేసియున్నారు. కేంద్రప్రభుత్వంచేసిన సూచనలు అమలుపరచే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం యీ క్రింది చర్యలు తీసుకొనుటకు నిశ్చయించినది

1. రిక్షా మొదటిసారిగా రిజిస్ట్రేషన్ చేయబడిన తేదీనుంచి 10 సంవత్సరములు వాడుకలో నుండవలెను.

2. ప్రతి సంవత్సరము రిజిస్ట్రేషన్ చేయవలసిన రిక్షాల సంఖ్యలో నూటికి 10 వంతున తగ్గించవలెను. కాని ఆ తగ్గింపు 10 సంవత్సరములకంటె ఎక్కువ జీవితకాలమున్న రిక్షాలనుంచే చేయవలయును. ఈ పరిస్థితులలో రిక్షా డ్రైవర్ లైసెన్సులు ఎక్కువగా మంజూరు చేయుటగాని, రిక్షా రిజిస్ట్రేషన్స్ ప్రతిసంవత్సరము 10% తగ్గించవలెననే ప్రభుత్వ ఉత్తర్వులను రద్దుచేయుటగాని ప్రభుత్వం అనుసరిస్తున్న policy కి వ్యతిరేకము,

మిస్టర్ స్పీకర్ : ఇప్పుడు strike జరుగుచున్నదా, ఆగిపోయిందా ?

శ్రీ కె. వి. రంగారెడ్డి : ఆగిపోయినది.

## BUSINESS OF THE HOUSE

మిస్టర్ స్పీకర్ : ఒరిస్సారాష్ట్ర సరిహద్దులలో irrigation sources వుండుటవలన ఆంధ్రలో వుండే ఆయకట్టుకు ఇబ్బందిగావుందని నోటీసులు యిచ్చారు. ఈ విషయంలో urgency ఏమీలేదు. అందుచేత నేను దీనిని Rule 74 క్రింద allow చేయలేదు. మంత్రిగారి దగ్గర కాగితాలు ఉన్నాయి. వారిదగ్గరకు గౌ॥ సభ్యులు పోయి చెప్పవచ్చును.

*నీటిపారుదల, విద్యుచ్ఛక్తి శాఖామాత్యులు (శ్రీ జె. వి. నరసింగరావు) : ఒరిస్సాకు ఆంధ్రకు మధ్య ఎన్నోమైళ్ళ బోర్డరు వుంది ఎక్కడ ఏమి కష్టము వస్తున్నదో స్పష్టముగా చెప్పనిదే చర్య తీసుకొనడానికి వీలులేదు.

మిస్టర్ స్పీకర్ : I am not allowing it under Rule 74. Food situation ను గురించి చర్చించే time లో discuss చేయవచ్చు. ఇది యీ వేళ క్రొత్తగా arise అయిన సమస్యకాదు. దీనిలో urgency ఏమీలేదు.

* శ్రీ పి. నరసింగరావు (హుజూరాబాద్ - జనరల్) : అధ్యక్షా, బీడీ factory లో Lady Workers మీద పోలీసువారు Latty Charge చేసినారని వారి బంగారం పోయిందని Rule 74 క్రింద నోటీసు ఇచ్చినాను. అది దయ చేసి ఆలోచిస్తారా ?

మిస్టర్ స్పీకర్ : నేనేమీ చేయలేదు.

* శ్రీ యన్. సంజీవరెడ్డి : నేను నిన్ననే కౌన్సిలులో ఈ విషయమును గురించి చెప్పినాను. తమరు అనుమతి యిస్తే కొంత information యిస్తాను. బీడీ వర్కర్ల సమ్మె జరుగుతూ వున్నది కొంతమంది సమ్మె చేయకుండా పనికి పోతున్నవారిని గేటు దగ్గర పట్టుకొని కొందరు కొట్టడము ప్రారంభించి నారు. ఆడవారి దగ్గర నుంచి గంపలు తీసుకోవడము మొదలగునవి చేశారు. సమ్మె శాంతియుతముగా జరిగితే ప్రభుత్వము జోక్యము కలిగించుకొన వలసిన అవసరము వుండేదికాదు. Workers లోనే రెండు పార్టీలు వున్నాయి. వారిలో వారు తగాదా పడడము, కొట్టుకోవడము జరుగుతూ వుంటే ప్రభుత్వము శాంతి భద్రతలు రక్షించే నిమిత్తము జోక్యము కలిగించుకొనవలసి వచ్చినది. కొంతమంది workers ను arest చేసి Court లో కేసు పెట్టినారు. కోర్టులో ఆ కేసు 'Sub - judice' గా వుంది కాబట్టి యీ విషయము పై సభలో చర్చించడానికి అవకాశము లేదు.

*Mr. Speaker* : Not more than one matter under Rule - 74 shall be raised in the sitting అని rule వున్నది. అయినప్పటికి 74 క్రింద చాలా allow చేశాను.

*శ్రీ బసవమానయ్య (అంథోల్) : అధ్యక్షా, నేను 74 క్రింద యిచ్చిన ఒక ముఖ్యమయిన నోటీసును allow చేశామని తమరు అన్నారు.

మిస్టర్ స్పీకర్ : నేను allow చేయలేదు ఈ సభకు సంబంధించినవి అన్నీ Rule No. 74 క్రింద యిచ్చిన తీర్మానాలు disallow చేస్తున్నాను.

శ్రీ యమ్. లక్ష్మణదాసు (పాతపట్నం - జనరల్) : On a point of order, Sir. నేను యిచ్చిన subject పై ఏదీ నిర్ణయించి, disallow చేసినారా?

మిస్టర్ స్పీకర్ : నేను Rule No. 74 క్రింద allow చేయలేదు.

It will not come under Rule (74). I have posted it for consideration. As the matter is not of urgent nature I am not allowing it under Rule (74).

శ్రీ బసవమానయ్య : పాయింట్ ఆఫ్ ఆర్డరు అధ్యక్షా, నిన్న తమరు, లక్ష్మివెంకటేశ్వర ఆలయము తాలుకు 35 ఎకరములు భూమి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నారని నోటీసు పంపితే, allow చేసినట్లు చెప్పినారు. సెక్రెటరీ గారుకూడ చెప్పినారు. Record లో కూడ వున్నది.

మిస్టర్ స్పీకర్ : It is not allowed. Rule 74 క్రింద యీ subject అసలు రాదు. questions విషయములో నేను నా opinion యివ్వదలచుకున్నాను. important point ఒకటి ఉన్నది. Centre కు మనకు సంబంధించిన

లోకసభ rules 41, 42, మన రూల్సు ఒకేవిధంగా వున్నవి. వారి రూలు 41 లో ఇట్లావుంది.

"A question shall not relate to a matter which is not primarily the concern of the Government of India."

మన రూలులో ఇట్లావుంది.

"A question shall not relate to a matter which is not primarily the concern of the State Government. It shall not relate to a matter with which the Minister is not officially connected."

దీనినిబట్టి చూస్తే మన రూల్‌ను వారుగాని, వారి రూల్‌ను మనంగాని ముట్టుకోటానికి వీలులేదని అర్థం అవుతున్నది. వారి రూల్ 42 లోను మన రూల్ 52 లోను ఒకేమాదిరిగావుంది.

"In matters which are or have been the subject of correspondence between the Government and the Government of a State, no question shall be asked

except as matters of fact and the answers are confined to a statement of fact."

మనదానిలోనూ అట్లాగేవుంది.

"So far as I understand, there is a Minister who carries on correspondence with the Centre about the Central subjects. Probably they also have somebody there. That Minister will look after the State subjects."

కాబట్టి correspondence జరుగుతున్నది. రైళ్ళు, పోస్టు, విమానములు, టెలిగ్రాములు- ఇవన్నీ సెంటర్‌కు సంబంధించిన subjects అయినప్పటికీ మెంబర్లు అడగటంతోనే వారికి వ్రాస్తున్నారు. వారినుండి వచ్చిన దానిని మెంబర్లకు చెబుతున్నారు. విశాఖపట్టణంలోవున్న డాక్‌యార్డుకు World Bank ఇవ్వని ప్రశ్న దీనిక్రిందకు వస్తుంది. ఏమి చెప్పారని మెంబర్స్ తొందర పెట్టకూడదు. వారు statement of fact మాత్రం వినాలి. మన 52 క్రింద మనకు ఏమి వ్రాసివుందో వారి 42 క్రింద వారికి ఆవిధంగా వుంది. We can request the Minister to write to them. Admissibility of questions గుఱించి తగాదా ఏమిలేదు. రైల్వేను గుఱించి ఎడ్మిజబుల్ అయి డాక్‌ను గుఱించి ఎడ్మిజబుల్ కాకపోలేదు. కన్వెన్షన్ ప్రకారం అన్నీ మనం వారికి వ్రాస్తున్నాము. వారికి తోచిన సమాధానం వారు వ్రాస్తున్నారు. If they say it is confidential, we are precluded. Policy గురించి అడగడానికి మనకు వీలులేదు. ఏమి జరిగింది ? ఎంతలో వుందని అడుగుతూ యింకా వివరాలు కావాలంటే వ్రాసుకోవచ్చు. It is not tabooed are debarred In the mode of questioning we have to remember this. That is all I want to say.

శ్రీ పి. సుందరయ్య (గన్నవరం): గట్టిగా వ్రాయమని మన మంత్రులను అడగవచ్చును.

మిస్టర్ స్పీకర్: మనవాళ్ళను మనం అడగవచ్చును. Information ఇమ్మనమని వ్రాయవచ్చును.

Those questions ars admissible but it is a delicate matter. We shall get the information and it will be placed before the House and the House may request the Minister to write and so on. Naturally, the Minister is interested in the House and in the people. It is all in order.

## GOVERNMENT BILLS

### *The Andhra Essential Articles Control and Reqiusitioning (Temporary Powers) (Andhra Pradesh Extension and Amendment) Bill, 1958.*

* *Sri J. V. Narasinga Rao* : Mr. Speaker Sir, I beg to move :

"That the Andhra Essential Articles Control and Requisitioning (Temporary Powers) (Andhra Pradesh Extension and Amendment) Bill, 1958 be read a first time.

*Mr. Speaker :* Motion moved.

శ్రీ జె. వి. నరసింగరావు : ఈ సందర్భములో ఎక్కువ విషయాలను గురించి మనవిచేయవలసిన అవసరంలేదు. 29-1-1959 తో కాలపరిమితి పూర్తిఅవుతుంది కనుక తెలంగాణా ప్రాంతానికి కూడా దీనిని వర్తింపచేయాలనే ఉద్దేశ్యంలోనుండి ప్రవేశపెట్టబడింది. ఎలక్ట్రిసిటి, చార్‌కోల్ వరకు ఈ కంట్రోలు ఉంది. ప్రైవేటు ఫారెస్టులను కట్టుకొని ఇష్టంవచ్చినట్లు అమ్మకో కుండా వుండటానికి కంట్రోలు వుంచాలనే పద్ధతిగా చార్‌కోల్‌ను వుంచాము. ఇప్పటి పరిస్థితులను బట్టి electricity మనకు అవసరమైనప్పటికి, ఎగ్రిమెంటుకు వ్యతిరేకమైనప్పటికి రేట్లు పెంచటం, సప్లయి పొజిషను బట్టి హెచ్చింపు తగ్గింపులు జరగటం, మొదలైన అధికారాలు ప్రభుత్వమునకువుండాలి. ఈ అవసరం తెలంగాణా ప్రాంతమునకు చాలావుంది. రామగుండంనుంచివచ్చే విద్యుచ్ఛక్తి దీనికి సరిపోదు. నిజాంసాగర్‌నుండి వచ్చే విద్యుచ్ఛక్తి ఒక్క సీజన్‌లోనే వస్తుంది. నీటిసదుపాయం సరిగాలేక తగ్గించాలంటే ఇదివరకువున్న ఎగ్రిమెంటు ప్రకారం వున్న ఆటంకాలనుండి బైటపడాలి. అది ప్రభుత్వ దృష్టిలో వుంది. ఎక్స్టెన్షన్‌వల్ల రెండు ప్రాంతాలకు లాభం కల్గుతుంది. రేట్లు ఆంధ్రాటారిఫ్‌ను తెలంగాణాలో apply చేయటానికి వీలుంటుంది కనుక దీనిని గౌరవసభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదిస్తారని ఆశిస్తున్నాను.

*Mr. Speaker :* The question is :

"That the Andhra Essential Articles Control and Requisitioning (Temporary Powers) (Andhra Pradesh Extesion and Amendment) Bill, 1958 be read a first time."

The motion was adopted.

*Sri J. V. Narasinga Rao :* I beg to move :

"That the Andhra Essential Articles Control and Requisitioning (Temporary Powers) (Andhra Pradesh Extension and Amendment) Bill, 1958 be read a second time."

*Mr. Speaker :* Motion moved

*(Pause)*

*Mr. Speaker :* The question is :

"That the Andhra Essential Articles Control and Requisitioning (Temporary Powers) (Andhra Pradesh Extension and Amendment) Bill, 1958 be read a second time."

The motion was adopted.

*Mr. Speaker :* The question is :

That Clause 2 do stand part of the Bill.

The motion was adopted.

Clause 2 was added to the Bill.

*Mr. Speaker :* The question is :

That Clause 3 do stand part of the Bill.

The motion was adopted.

Clause 3 was added to the Bill.

*Mr. Speaker:* The question is :

That Clause 4 do stand part of the Bill.

The motion was adopted.

Clause 4 was added to the Bill.

*Mr. Speaker :* The question is :

That Clause 1 do stand part of the Bill.

The motion was adopted.

Clause 1 was added to the Bill.

*Mr. Speaker :* The question is :

That the Preamble do stand part of the Bill.

The motion was adopted.

The preamble was added to the Bill.

*Sri J. V. Narasinga Rao :* I move Sir, that the Andhra Essential Articles Control and Requistioning (Temporary powers) (Andhra Pradesh Extension and Amendment) Bill. 1958 be read a third time and passed.

*Mr. Speaker :* The question is :

"That the Andhra Essential Articles Control and Requisitioning (temporary powers) (Andhra Pradesh Extension and Amendment) Bill, 1958 be read a third time and passed."

The motion was adopted.

## *The Andhra Irrigation (Levy of Betterment contribution) (Andhra Pradesh Extension and Amendment) Bill, 1958.*

* *Minister for Revenue (Sri K. Venkata Rao) :* Sir, I beg to move:

"That the Andhra Irrigation (Levy of Betterment Contribution) Andhra Pradesh Extension and Amendment) Bill, 1958 be read a first time and referred to a Select Committee."

*Mr. Speaker :* Motion moved.

శ్రీ కె. వెంకటరావు : అధ్యక్షా, ఈ బిల్లుపైన కొన్ని విషయాలు చెప్పవలసిఉన్నది. కాని దీనిని సెలక్ట్ కమిటీకి పంపే ఉద్దేశం ఉన్నందువలన, దీనిపైన ఎక్కువ విషయాలు నేను చెప్పనక్కరలేదని భావిస్తున్నాను. సెలక్ట్ కమిటీ వారు కూలంకషంగా చర్చించి ఇక్కడకు రిపోర్టు పంపినప్పుడు మనం సమగ్రంగా చర్చించవచ్చును. కాబట్టి ఇవాళ దీనిపైన జనరల్ డిస్కషన్ లేకుండా దీనిని సెలక్టుకమిటీకి రిఫర్ చేయుటకు అనుమతించవలసిందిగా సభ్యులను కోరుతున్నాను. సెలక్టు కమిటీ సభ్యుల పేర్ల జాబితా స్పీకరుగారికి అందజేస్తున్నాను

* శ్రీ పి. సుందరయ్య : అధ్యక్షా, ఈ బిల్లు బెటర్ మెంట్ లేవీకి సంబంధించింది. ఇప్పుడు మనం భూమిపైన అనేకపన్నులు వేస్తున్నాము. మొత్తం భూమిమీద ఉన్నటువంటి పన్నులకు సంబంధించి అనంతరామన్ కమిటీ త్వరలో రిపోర్టు ఇస్తుందని మంత్రిగారు ఒకవైపున చెబుతూనే, రెండోవైపున

యీ బిల్లును ప్రవేశపెడుతున్నారు. ఈ బిల్లును సెలక్టుకమిటీకి పంపుటకు మాకు అభ్యంతరములేదు. సెలక్టుకమిటీవారు తొందరపడకుండా, లోతుగా చర్చించి, యీ బిల్లును పరిశీలింపవలసిఉన్నది.

*శ్రీ పి. నరసింగరావు : అధ్యక్షా, ఈ బిల్లుద్వారా బెటర్ మెంట్ లెవీని తెలంగాణా ప్రాంతానికి ఎక్స్టెండ్ చేయటం జరుగుతున్నది. తెలంగాణాలో ఇదివరకే వెట్ఎసెస్ మెంట్ చాలా ఎక్కువగా ఉన్నదనేది గౌరవసభ్యులందరకు తెలిసినవిషయమే. మొత్తం భూమిశిస్తు విధానాన్ని పరిశీలించుటకు ప్రభుత్వం అనంతరామన్ కమిటీని ఏర్పాటుచేసింది. ఆ కమిటీ రిపోర్టు రాకముందే, ప్రభుత్వం ఇంతతొందరగా యీ బెటర్ మెంట్ లెవీని తెలంగాణా ప్రాంతానికి ఎక్స్టెండ్ చేయవలసిన అవసరం ఏమివచ్చిందో నాకు అర్థం కానటంలేదు సెలక్టుకమిటీ స్టేజిలో, తెలంగాణాలో ఉన్న వెట్ ఎసెస్ మెంట్ను దృష్టిలో పెట్టుకొని తెలంగాణా రైతులపై ఎక్కువ బర్డెన్ పడకుండా చూస్తారని ఆశిస్తున్నాను.

* శ్రీ పి. నరశింహప్పారావు : ఇప్పటికే ఆంధ్రలో భూమిపై పన్నులు ఎక్కువగా ఉన్నవి. సుందరయ్యగారు చెప్పినట్లు సెలక్టు కమిటీలో దీనిని లోతుగా చర్చించి, నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది. అందుకు వీలుగా యీ బిల్లును సెలక్టుకమిటీకి పంపించాలనేది మా పార్టీ ఉద్దేశము.

*శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య (సత్తెనపల్లి): అసలు భూమిపై టాక్సేషన్ పూర్తిగా మారాలనే అభిప్రాయం ఉన్న సమయంలో యీ బిల్లును తేకుండాఉంటే బాగుండేది. ఈ సందర్భంలో నేను ఒకవిషయం చెప్పదలచుకొన్నాను. ఇది అమలుజరిపేటప్పుడు, తక్కినచోట్ల, నీళ్లు ఏ సంవత్సరంనుండి ఇస్తున్నారో, అప్పటినుండి టాక్స్ వసూలుచేస్తున్నారు. ఆవిధంగా వసూలు చేయమని నోటిఫికేషన్సుకూడ వచ్చినవి. దానిమీద ఇపుడు అపీల్సుకూడ ఉన్నవి. నీళ్లు ఇచ్చినతర్వాత రెండు, మూడు సంవత్సరాలవరకు టాక్స్ వేయకూడదని Act లో ఉన్నది. కాని నోటిఫికేషన్ లో మాత్రం ఆరుసంవత్సరాలు అయినతర్వాత, ఆఆరు సంవత్సరాల పన్ను ఒకేసారి చెల్లించమని అంటున్నారు. అట్లాంటిది జరగకుండా చూడవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

*Mr. Speaker :* The question is :

"That the Andhra Irrigation (Levy of Betterment Contribution) (Andhra Pradesh Extension and Amendment) Bill, 1958 be read a first time and referred to a Select Committee consisting of the following:

1. Sri K. Venkata Rao, Minister for Revenue.
2. ,, Dawar Hussain.
3. Sri Naganna.
4. Srimati Jayalakshmi Devammma.
5. Sri H. Ramalinga Reddi.
6. ,, T. G. Gopalakrishna Gupta.
7. ,, T. Ramachandra Reddi.
8. ,, Alluri Bapineedu.
9. ,, P. Gunnayya.
10. ,, Kammili Appa Rao.
11. ,, Pllalamarri Venkateswarlu.
12. ,, K. Ramachandra Reddi.
13. ,, M. Satyanarayanaraju.
14. ,, N. Srinivasa Rao.
15. ,, P. Narasimhappa Rao.

The hon. Minister is not moving for a joint Select Committee because it is a money bill and hence there is no necessity to send it to a Joint Select Committee.

Sri K. Venkata Rao will be the Chairman.

The motion was adopted.

**DISCUSSION**

*Re: Food situation in the State.*

*Sri K. Venkata Rao:* I move Sir, that the food situation in the State be taken into consideration.

*Mr. Speaker:* Motion moved.

*శ్రీ జి. ఎల్లమందారెడ్డి (కనిగిరి): అధ్యక్షమహాశయా, మన రాష్ట్రంలో ఆహారసమస్య చాలా తీవ్రంగా ఉన్నట్లు అందరికీ తెలిసినదే. కాని గతవారంలో ఆహారశాఖా మంత్రిగారు ఇచ్చిన స్టేటుమెంటులో మన రాష్ట్రంలో ఆహార సమస్య తీవ్రంగాలేదని, ఆహారధాన్యాల ధరలు కొంతవరకు తగ్గుతున్నవని చెప్పటం జరిగింది. మంత్రిగారు చెప్పింది ఎంతమాత్రం వాస్తవముకాదు. గత సెప్టెంబరు మాసంలో కేంద్ర ప్రభుత్వంవారు మన రాష్ట్రంలో ఆహారధాన్యాలను సేకరించుటచేత, కొన్ని మిల్లులు మూసివేయబడటం, అందువల్ల రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో విపరీతంగా ధరలు పెరగటం అందరికీ

తెలిసినవిషయమే. కొన్ని ప్రాంతాలలో కొత్తపంట వస్తున్నప్పటికీ, ఇంకా ధరలు ఏమాత్రం తగ్గలేదు. ఉదాహరణకు నెల్లూరు ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వంవారు ఇస్తున్న ధరకంటే, మన రాష్ట్రి ప్రభుత్వంవారు కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతూన్న ధరకంటే చాలా జాస్తీగా వివిధ రకాలైన ధాన్యం అమ్మబడుతున్నవి. మంత్రిగారు "మన రాష్ట్రింలో ధాన్యం ధరలు తగ్గుముఖంగా ఉన్నాయ"ని చెప్పటం ఏమాత్రం సమంజసమైనదికాదు. నెల్లూరు ప్రాంతంలో ధాన్యం ధరలు విపరీతంగా వున్నట్లు "జమీన్ రైతు" మొదలగు పత్రికలు వ్రాసిన విషయాలు వాస్తవమైనవే. అక్కడ మొల కొలుకులు పుట్టి 400 రూ. 410 రూ. వరకు అమ్మబడుతున్నవి. అదేవిధంగా పాత కేసరిలు రూ 320 వరకు, తెల్ల కేసరిలు రూ. 375 వరకు అమ్మబడు తున్నవి కొత్తగావచ్చిన జి. బి. రూ. 330 అమ్మబడుతున్నాయి. బియ్యం మేలురకం 160 పౌ. బస్తా 50 రూ.లు అమ్ముతోంది. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి ధరతో పోల్చిచూస్తే, యీనాడు అక్కడ బజారులో ధరలు ఎంత జాస్తీగా ఉన్నవో అర్థం అవుతుంది. కొత్త పంటలు వచ్చేసమయంలో, డిశంబరు జనవరి మాసాలలో ధరలు తగ్గుముఖం పడతాయని ప్రభుత్వం వాదిస్తున్నది. కాని వాస్తవంగా జరిగేదేమిటి? మధ్యవర్తులు, మిల్లు యజమానులు, పేదరైతాంగం, మధ్యతరగతి రైతాంగం దగ్గర కళ్ళాలలోనే ధాన్యం కొనివేసి, నిల్వ చేసుకోవటం, తర్వాత బస్తాకు రు. 4.5 లు జాస్తీగావేసి మిల్లు వారు అమ్ముకోవటం జరుగుతున్నది. ఆహార ధాన్యాల ధరలవిషయంలో ప్రభుత్వంవారు, ఇటు కొనుగోలుదారులకు, అటు ఉత్పత్తిదారులకు పోటీ ఉండే పద్ధతిలో మాట్లాడుతుంటారు. ధాన్యం ధరలు తగ్గించమంటే, కష్టపడి పనిచేసే రైతుకు ధరలు గిట్టుబాటు కానక్కరలేదా అని ప్రభుత్వం వాదిస్తుంది. కాని పేద రైతాంగానికి, మధ్యతరగతి రైతాంగానికి, ఉత్పత్తిదారులకు న్యాయమైన ధర లభించుటకు గ్యారంటీ ఇవ్వటంలేదు. ప్రభుత్వంవారు ఆహారధాన్యాలకు స్పెక్యులేషన్‌ద్వారా ధరలు పెరిగే అవకాశంలేకుండా సరసమైన, న్యాయమైన ధర నిర్ణయించాలనేదే మా అభిప్రాయం— కొనుగోలు దారుకు సరసమైన ధరకు ధాన్యం లభించేపద్ధతి చూడ్డకపోతే, పట్టణాలలోని కార్మికులు, మధ్య తరగతి ప్రజలు చాలా ఇబ్బంది పడతారని మనవి చేస్తున్నాను. ధరలు రోజు రోజుకు పెరిగిపోతుండడటంవల్ల ఆహారసమస్య చాలా తీవ్రతరం అవుతున్నదని నేను మనవి చేస్తున్నాను. కేంద్రప్రభుత్వంవారు భారత దేశంలో ఆహారసమస్యను ఒక పెద్ద జాతీయసమస్యగా గుర్తించి, దాని పరిష్కారానికి అన్నిపార్టీల సహకారాన్ని కోరుతున్నారు. ఆహార సమస్యను పరిష్కరించుటకు అన్నిపార్టీలు కలిసి పనిచేయాలని పండిట్ నెహ్రూగారు కూడా చెబుతున్నారు. ఆహారసమస్యను పరిష్కరించుటకు

యీ ప్రభుత్వం అలాంటి వైఖరి అవలంబించడములేదు. ఈ ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలోని అందరియొక్క అభిప్రాయాలు తీసుకొని న్యాయమైన ధరలు నిర్ణయించాలి. ఉత్పత్తిదారులకు అవసరమైన ఎరువులు, వ్యవసాయ పరికరములు ఇచ్చి కావలసిన సదుపాయాలు కలుగజేయాలి. ఈనాడు ప్రభుత్వం చేస్తున్న సహాయం కొంతమంది భూస్వాములకే లభించటం, సామాన్య రైతులకు లభించకపోవటం జరుగుతువ్నది. ధాన్యంధరలు తక్కువ ఉన్న సమయంలో, సామాన్యరైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవటం భూస్వాములు తమధాన్యాన్ని నిలవచేసుకొని తర్వాత విపరీతమైన ధరలకు అమ్ముకోవటం జరుగుతున్నది. పెద్ద పెద్ద భూస్వాముల దగ్గరనుండి కేంద్ర ప్రభుత్వము ధాన్యం తీసుకొని నిల్వచేయాలనేది అంధ్రరూ హర్షించదగిన విషయము. ఆవిధంగా ప్రభుత్వమే ప్రొక్యూర్ చేయాలేగాని ఏకొద్దిమందికో లైసెన్సులిచ్చి ప్రొక్యూర్ చేసినంత మాత్రమున సమస్య పరిష్కారం కాదు. ధాన్యం ధరలు కొనుగోలుదారుకు అందుబాటులో ఉండేటట్లు పట్టణాలలో ప్రభుత్వం చౌకడిపోలు పెట్టి పేద ప్రజలకు ధాన్యం అందేటట్లు చూడాలి. ఉదాహరణకు నెల్లూరు టౌనులో ఆహార ధాన్యాల ధరలు రోజు రోజుకు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అక్కడ బియ్యం మద్రాసు శేరు 12 అణాలు మొదలుకొని 13 అణాల వరకు అమ్మబడుతున్నది. దీనిని బట్టి అక్కడ ధరలు ఎంత జాస్తీగా పెరిగిపోయాయో అర్థంఅవుతుంది. అక్కడ 10 వేల మంది జనం ఊరేగింపుచేసి, పెద్ద వోటింగ్ జరిపి, కలెక్టర్‌గారికి మెమోరాండములు సమర్పించుకొన్నారు. అక్కడ కొన్ని చౌక డిపోలు ఏర్పాటు చేయవలసిందిగా వారు ప్రభుత్వము వారిని కోరారు ఆహారధాన్యాల ధరలు పెరగటంతో ఏర్పడినటువంటి పరిస్థితిని మంత్రిగారు serious గా గుర్తించడం లేదు. "అంతా సక్రమంగానే నడుస్తున్నది." అని మంత్రిగారు చెప్పడం హాస్యాస్పదమైన విషయం. కార్మికులకు, మధ్యతరగతి ప్రజానీకానికి సరసమైన, సక్రమమైన ధరలకు ఆహార ధాన్యాలను అందించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవలసిన అవసరం వున్నదని మనవి చేస్తున్నాను. 'రైతు' అనే దానికి సరియైన అర్థం ప్రభుత్వం చెప్పటం లేదు. ప్రభుత్వం రైతుకు సక్రమమైన ధరలు రావాలని చెపుతున్నది. కాని ఈ రోజున పేద రైతాంగము, మధ్యతరగతి రైతాంగము అమ్ముకుంటున్న ధాన్యానికి సక్రమమైన ధరరావడం లేదు. ధాన్యం నిలవ చేసుకుంటున్న పెద్ద పెద్ద మిల్లర్స్‌కు భూస్వాములకు లాభం కలిగేవిధంగా ప్రభుత్వం ఆహారధాన్యాల ధరలు పెరగవలెనని చెబుతున్నది తప్పితే సాధారణమైన రైతాంగానికి కొనుగోలుదారుకు లాభకరమైన, ప్రయోజనకరమైన ధరలను నిర్ణయించుటకు పూనుకోవడం లేదు. పేద రైతాం

గానికి, మధ్యతరగతి రైతాంగానికి న్యాయమైన ధర లభించేందుకు ఆహార ధాన్యాల ధరలను నిలకడగా వుంచుటకు ప్రయత్నం చేయాలని, పట్టణాలలో వెంటనే చౌక డిపోలు ఏర్పాటు చేయాలనీ, సామాన్య ప్రజలకు, కార్మికులకు లాభదాయకంగా వుండే విధంగా ఆహారధాన్యాల ధరలను నిర్ణయించాలని ప్రభుత్వాన్ని కోరుతూ విరమిస్తున్నాను.

* శ్రీమతి టి. లక్ష్మీకాంతమ్మ (ఖమ్మం-జనరల్): అధ్యక్షా, ఆహార ధాన్యాల ధరలను control చేయుటకు ప్రభుత్వం వెంటనే effective measures తీసుకోవాలని అన్ని political parties ఆందోళన చేస్తున్నవి. Congress President "Only administrative action could help bring down artificial rise in prices" అని చెప్పారు. వ్యవసాయశాఖా మంత్రిగారు ప్రస్తుతము మన రాష్ట్రింలో ఆహారపరిస్థితిని క్లిష్టతరం చేస్తున్న సంగతిని గురించి యధార్థమైన పరిస్థితిని తమ statement లో తెలుపలేదు. వారి statement లో ఉత్పత్తిదారుల ఎడ ఉదారత్వం చూపించారు. అయితే నేను దాని spirit ను question చెయ్యడంలేదు. I welcome the spirit in which the statement is presented to us.

దేశానికి రైతే వెన్నెముక. రైతుకు సక్రమమైన ధర ముట్టవలసివుంది అంతవరకూ మంత్రిగారు చెప్పిన అభిప్రాయంతో ఏకీభవించవచ్చు. కాని వుత్పత్తిదారుల ఎడ వారు చూపించే వుదారత్వం consumers ఎడ కూడా కొంచెం చూపిస్తే బాగుండేది. ఆహారధాన్యాల ధరల పెరుగుదలవల్ల కేవలం పట్టణాలలో వుండే ప్రజలు industrial centres లో వుండే కార్మికులు మాత్రమే బాధపడటంలేదు. పల్లెటూర్లలో వుండే వ్యవసాయ కూలీలు, పేద ప్రజలు కూడా బాధపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేటు ఆహారధాన్యాల విషయంలో Surplus State అయినప్పటికీ చాలా districts లో ఆహార ధాన్యాల కొరత వున్నట్లు మనకు తెలుసు. మంత్రిగారు తమ statement లో ప్రజల ఇబ్బందులను సరిగా వివరించనందువల్ల వారి statement కొంతవరకు ఆశాభంగముగా వున్నదని చెప్పాలి. "Producer కి సరియైన ధర ముట్టడం లేదు, consumer కూడా ఎక్కువ ధర pay చేస్తున్నాడు. ఈ డబ్బంతా ఏమి అవుతుంది?" అని మన ముఖ్యమంత్రిగారు కూడ A.I.C.C. లో వుపన్యసిస్తూ అన్నారు. దీనినిబట్టి ఉత్పత్తిదారులకు సక్రమమైనధర అందకుండా comsumer ఎక్కువ ధర ఇవ్వడంవల్ల ఈ డబ్బంతా ఇతరుల చేతులలోనికి పోతున్నది అనేది మన ముఖ్యమంత్రిగారు చెప్పినదాని యొక్క అర్థం. ఉత్పత్తిదారులకు కొనుగోలుదారులకు మధ్య వున్న మధ్యశక్తి ఈ ధరలు పెరుగుటకు కారకుడని అర్థంఅవుతున్నది. ఈ ధరలు పెరగడంవల్ల "Middle man"

లాభం పొందుతున్నాడు కాని, producer కాని, consumer కాని లాభపడటం లేదు. Government of India వారు wholesale Trade in food grains, ను State Government తీసుకోవాలనే స్కీమును మనముందు వుంచారు. దానిని మనం welcome చెయ్యవలసి వుంటుంది. ధాన్యం ధరల పెరుగుదలతో వ్యవసాయ కూలీలు "మాజీవితం దుర్భరం ఔతోంది కాబట్టి మాకు ఎక్కువకూలీ ఇవ్వండి" అని అడుగుతారు. అప్పుడు వ్యవసాయ కూలీల కూలిని హెచ్చించవలసి వుంటుంది. అదేవిధంగా పట్టణాలలో పారిశ్రామిక కేంద్రాలలోని, కార్మికులు, కూలీలుకూడా తమ వేతనాలను హెచ్చుచేయాలని ఆందోళన చేస్తారు. ఈవిధంగా అన్నిరంగాలలోనివారిలో తమ వేతనాలను పెంచాలనే ఆందోళన ఎక్కువ అవుతుంది. మన ఆహార ధాన్యంధర పెరిగినప్పుడు మన Development Schemes ఖర్చులుకూడా పెరుగుతాయి. ఇది మన దేశాభివృద్ధికి పెద్దదెబ్బ. ఇదిఅంతా ఒక vicious circle గా తయారౌ ఔతుంది. Vicious circle ని break చెయ్యడమే మన అందరి కర్తవ్యం. మన వ్యవసాయశాఖా మంత్రిగారు తమ statement లో ఒక ఆశాభావాన్ని వెలి బుచ్చారు. మనరాష్ట్రంలో bumper crop రాబోతోందని ఒక rosy picture ను చూపించారు. ఈ bumper crop ఎంతవరకు వస్తుందో మనం ఇప్పుడే చెప్ప టానికి వీలులేదు. Union Food Deputy Minister గారు శుక్రవారం రాజ్య సభలో ప్రసంగిస్తూ "Central Government, State Government నుంచి 15-20 లక్షల టన్నుల బియ్యం State Trading Scheme క్రింద procure చెయ్య డానికి proposals వున్నవి" అని చెప్పారు. ఆంధ్రప్రాంతంనుండి ఎంత బియ్యాన్ని procure చేస్తారో మనకు తెలియదు.

మన రాష్ట్రంలోని మిగులు ధాన్యం విషయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలమధ్య విభిన్నాభిప్రాయాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మనవద్ద ఆరులక్షల టన్నులు మిగులు ధాన్యం ఉందంటే కేంద్రప్రభుత్వంవారు కాదు తొమ్మిదిలక్షల టన్నులు ఉంది అంటున్నారు. ఈలెక్క ప్రకారం వారు procure చేస్తే, మన ప్రజలకు కావలసినది deprive చేసి మన రాష్ట్రంనుంచి ధాన్యాన్ని ఇతర ప్రాంతాలకు drain చేసినట్లు అవుతుంది. ఈ విషయంలో మనం తగు శ్రద్ధ వహించవలసి ఉంటుంది. అప్పుడే కేరళ రాష్ట్రానికి 25 వేల టన్నుల బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి పంపడానికి నిర్ణయించినట్లు తెలుస్తోంది. కేంద్రం procure చేసిఇతర రాష్ట్రాలకు supply చేయడం చూస్తే మన requirements దెబ్బతింటాయేమోనన్న భయంకూడాలేకపోలేదు. ఈprocuring operations లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలమధ్య co-ordination ఉన్నట్లు కనుపించడంలేదు. ఈమధ్యనే rice millers తమ business ను suspend చేయడంవల్ల ఏదో పెద్ద

crisis వచ్చినంతవని జరిగింది. దానిద్వారా విపరీతంగా ధరలు పెరగడం కూడా సంభవించింది. కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక "లయజాన్" ఏర్పడితే బాగుంటుంది. దీనివల్ల ప్రజల అవసరాలనుకూడా సక్రమంగా తీర్చే అవకాశం వుంటుందని భావిస్తున్నాను. ప్రధాని నెహ్రూ గత బుధవారం అహమ్మదాబాదులో మాట్లాడుతూ "State trading in food grains would involve only in whole-sale trade" అన్నారు. దీని ప్రకారం normal trade channels అయిన retail trade unaffected గా ఉంటుంది. Middle-men చేతుల ద్వారా ఆహార ధాన్యాలుపోతుంటే law of demand and supply మీద ఆధార పడి ధరలు విపరీతంగా పెరగడానికికూడా అవకాశంఉంది. whole-sale trade ను ప్రభుత్వం తీసుకొన్నట్లయితే producers కు సక్రమమైన ధర ముడుతుంది. consumers కు పెద్ద relief ఏమీ ఉండటానికి అవకాశంలేదు. కేంద్రప్రభుత్వం whole-sale trade మాత్రం తీసుకొంటామని చెప్పడంలో అర్థంఉంది, retail trade కూడా కేంద్రప్రభుత్వం తీసుకొనేటట్లయితే పెద్ద machinery తయారవు తుంది. దీనితోపాటు corruption, యితర bottle - necks మొదలైన ఇబ్బందు లన్నీ కూడా ప్రారంభమౌతాయనే ఉద్దేశముతో, కేంద్రప్రభుత్వం Whole-sale trade లో మాత్రమే deal చేస్తామని చెప్పినట్లు ఉంది. ప్రభుత్వం తరపున Whole-salers కు food grains procure చేయడానికి licenses ఇచ్చే బదులు, ప్రభుత్వం ఉత్పత్తిదారుల నుంచి direct గా procure చేయడం మంచిదని భావిస్తున్నాను. This will be an effective safegaurd to producers. Distribution విషయంలో కో-ఆపరేటివ్ సంఘాలకు ప్రాధాన్యం యివ్వా లని కూడా కోరుతున్నాను. Industrial and urban areas లో కూడ Consumers commodity stores ను ప్రారంభించడానికి ప్రభుత్వం schemes తయారు చేయాలి. ఎక్కువ మంది కార్మికులు పనిచేస్తున్న పరిశ్రమలలో కూడ ఈ stores పెట్టాలని యజమానులకు ప్రభుత్వం ఆదేశించాలి. ఈ మధ్యనే సికింద్రాబాద్ మున్సిపాలిటీ వారు, relief shops పెట్టడానికి తమకు రాష్ట్ర ప్రభుత్వంవారు అవకాశం కలిపించాలని ఎన్నోసార్లు అడిగారు. కాని ప్రభుత్వం, వారి కోరికను ఇంతవరకూ మన్నించలేదు. State trading principle ను ఒప్పుకొన్నప్పుడు, ఈ Muncipality కి permission ఇవ్వడానికి ఇంతవరకు ఎందుకు అంగీకరించలేదో అర్థంకావడంలేదు. వారికి permission ఇచ్చినచో, వారు ప్రజలకు సేవచేయడానికి అవకాశం కల్పించినవారం అవు తాము. అందువల్ల మున్సిపాలిటీలు, పంచాయితీల విషయంలో ముందు ముందు, తగుశ్రద్ధ తీసుకోగలరని, తద్వారా ధరలు అదుపులో ఉండగలవని నేను భావిస్తున్నాను.

ప్రధాని నెహ్రూగారు "Food is above politics" అన్నారు. అన్ని పార్టీలవారు కూడా, ప్రజల జీవితావసర సమస్యల విషయంలో కలిసి పని చేయవలసి ఉంటుంది. ప్రధాని ఉద్దేశ్యప్రకారం అస్సాము, బొంబాయి, కేరళ, యు. పి., పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో అన్ని పార్టీలతోనూ food committees ఏర్పాటుచేశారు. మనరాష్ట్రంలోకూడా అలాంటి కమిటీలను ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. Retail trade ను కూడా controlచేయాలి. Retail Selling Prices ను fix చేసి notify చేసినట్లయితే, తాము ఎంతధర చెల్లించాలనే విషయం అందరికీ తెలియడంవల్ల; ఇంత ఎక్కువధర చెల్లించవలసిన అవసరం లేకుండా పోతుంది. ఈ retail trade ను inspect చేయడానికికూడా efficient system ను ఏర్పాటుచేయాలి. Consumers ను దోచుకోకుండా ఉండేలాగ చేయాలి. ఉత్పత్తిదార్లు వారుకొనే ఇతరవస్తువులకు ఎక్కువ ధరలు చెల్లించవలసి వస్తోందని మంత్రిగారు చెప్పారు. అది నిజమే. కాని మనం కో-ఆపరేటివ్ స్టోర్సుద్వారా వారికి ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు సక్రమమైన ధరలకు అందచేయగలిగితే, ఈఇబ్బందులు తొలగిపోగలవు. కాబట్టి ఈ Co-operatives కు ఎక్కువ prominence ఇచ్చిన తద్వారా producers, consumers కూడా లాభపడగలరని భావిస్తూ ఇంతటితో విరమిస్తున్నాను.

## (*Srimati T. Laxmikanthamma in the Chair*)

*శ్రీ ఎల్. లక్ష్మణదాస్ : అధ్యక్షా ! ఈనాడు ఆహారసమస్యపైన దేశంలో అనేక భేదాభిప్రాయాలు ఉన్నాయి. ధరలు పెరిగిపోతున్నాయని ఒకవంక, ధరలు సక్రమంగా గిట్టుబాటుగాలేవని మరొకవంక వివాదాలు జరుగుతున్నాయి. ఈవిషయంలో నేను కొన్నిసూచనలు చేయదలచాను. ఈనాటి ధరలు రైతుకు కిట్టుబాటుగా లేవని చెప్పకతప్పదు. Consumers కు ఈధరలు కష్టంగానే ఉన్నాయి. మన ముఖ్యమంత్రిగారు ఒకసారి ఉపన్యాసం ఇస్తూ "అటు producers కు కాని, ఇటు consumers కు కాని లాభసాటికాని ధరలు పెరిగిపోతున్నాయి; వాటిని అరికట్టడానికి తగు ప్రయత్నం చేస్తా"మని చెప్పారు. యథార్థమైన విషయాన్ని వారుగమనించినందుకు వారికి ధన్యవాదాలు సమర్పిస్తున్నాను. ముఖ్యంగా ఈనాడు ఆహారసమస్య విషయంలో అనేకమంది అనేకవిధాలుగా మాట్లాడుకొన్నా రైతుయొక్కపరిస్థితి గమనించి, దానిని పరిశీలనచేసి, అతని కష్టసుఖాలను తెలిసికోవడానికి ప్రయత్నం చేయడం చాలా తక్కువగా జరుగుతోందని మాత్రం నేను వాదించకతప్పదు. రైతు పండించే పంటకు ఎంతధర వస్తున్నది? అతనికి కావలసిన ఇతర పరికరాలకు ఏధర చెల్లిస్తున్నాడు? అనేవిషయంలో ప్రతిసభ్యుడు నాతో ఏకీభవిస్తాడని ఆశిస్తున్నాను. వారికి కావలసిన వస్తువులకు price control లేదు. దానివిషయంలో అడిగే

వారు ఎవ్వరూ లేరు. ఈవిషయంలో ప్రభుత్వంకూడా సరియైన శ్రద్ధ తీసుకోవటంలేదనే చెప్పాలి.

రైతు పండించే పంటకు సరైనధర ముట్టకుండా, మధ్యదళారీలు కొట్టేస్తున్నారనే విషయంలో అభిప్రాయభేదానికి ఆస్కారమేలేదు. సామాన్యంగా నూటికి 5,6 మంది తప్ప, యావత్ రైతాంగం పంట పండకముందే తమ అవసరాలకోసం పండబోయే పంటను ఎంతో తక్కువధరలకు అమ్మడం జరుగుతోంది. మధ్య దళారీలు ఎంతో సొమ్మును కాజేస్తున్నారు. ఈ విషయాన్ని రైతుకు ఉత్పత్తి ఖర్చులు ఎంత ఉంటాయనీ గమనించి; అతనికి కిట్టుబాటు ధరను నిర్ణయించాలి. పంటరైతుకు గిట్టుబాటు ధరలు ఉండాలని వాదిస్తూంటే; ధరలు పెంచడానికి ప్రయత్నం చేస్తున్నారని చాలామంది విమర్శించడం జరుగుతోంది, ఇది యథార్థంకాదు. రైతుకు అతని అవసరాలకు కావలసిన సహాయాన్ని ప్రభుత్వంకాని, ఇతరసంస్థలుకాని ఎంతవరకు అందజేస్తున్నాయి అనేది గమనించకుండా, వారు పండించే వస్తువులధరలు పెరిగిపోతున్నాయని వాదించడం చాలా పొరపాటు. ఇతర వర్గాలలో చేస్తున్నట్లు రైతులు కూడా తమ పంటలకు గిట్టుబాటుధరలు లేవని, సమ్మెలు ఆందోళనలు సాగిస్తే, దేశం ఏమౌతుందనే విషయాన్ని గమనించాలని నేను మనవిచేస్తున్నాను.

అందుచేత ఆహారం విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ ప్రభుత్వం వహించాలి. ఈనాడు రైతు పండించే పంటకు కావలసిన పరికరాలధరలు ఎలా పెరిగిపోయినవో ఒకసారి గమనించడం అవసరం. ఆ పరికరాలను ప్రభుత్వం రైతులకు అందిస్తున్నదా అంటే, అదీలేదు. అటువంటప్పుడు ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతి సరిగాలేదని చెప్పవలసివస్తున్నది. ఢిల్లీలో ఎవరో ఆఫీసరుకూర్చొని వ్యవసాయంతో సంబంధం లేనివారు ఏదో ఉపన్యాసాలు చేయవచ్చు. ఈనాడు ఉన్నటువంటి ధర గిట్టుబాటు అవుతున్నదీ, లేనిది, పొలాలలో పనిచేసి, పండించే రైతును అడిగి తెలుసుకోండి. లేకపోతే ఏ పక్షంనుంచి అయినాసరే ఒక కమిటీవేసి విచారణచేయించండి. ఈనాడు ఇతర రంగాలతో, వ్యవసాయాన్ని పోల్చిచూచినట్లయితే గిట్టుబాటుకాకుండా ఉన్నది. నూటికి 4 రూపాయలు వడ్డీయిస్తున్న బ్యాంకురేటుకూడ ఈ వ్యవసాయంలో రావడంలేదని, ఋజువైనది. మిల్లులు బందుఅయినవని అన్నారు. అలా మిల్లులు బందుచేసినవారు ఎవరు? దానివల్ల రైతులకు ఏమైనా మేలుజరుగుతుందా? ఈపన్నాత్రం అలా బందుచేయడంవల్ల రైతులకు మేలుజరుగదు. ఈఆందోళన అంతా మధ్యవర్తుల లాభాలకోసం జరిగే ఆందోళన అని మనవిచేస్తున్నాను. అందుచేత ప్రభుత్వం ఒకపోలసీని అవలంబించి, ఒకకనీసపు ధరను నిర్ణయించాలి. ఈనాడు ధరలు పెరిగిపోతున్నాయని చెబుతున్నారు. రేపు ధరలు పడిపోయి

గిట్టుబాటు కానప్పుడు ఎవరైనా హెచ్చుధరలు ప్రయత్నిస్తారా? అందుచేత ఒక కనీసపుధరను నిర్ణయంచేయడం ప్రభుత్వ ధర్మం. ఈనాటి ఆర్థికపరిస్థితిలో ఇంత కంటెతక్కువధర మనకురాదు. కొంతవరకైనా మనం నిలబడగలము, అనేధైర్యం రైతుకు కల్గించాలి. అట్టిధైర్యం ఒకకనీసపు ధరను నిర్ణయించినప్పుడే వస్తుంది. ప్రభుత్వమే రైతుదగ్గరనుంచి ధాన్యం కొనేటట్లు ఉండాలి. మధ్యవర్తులు లేకుండా అక్రమలాభాలను అరికట్టడానికి ఒక లైసెన్సింగ్ పద్ధతిని అమలుకు తీసుకొనిరావాలి. అలా కట్టుదిట్టమైన లైసెన్సింగు పద్ధతి పెట్టినప్పుడే, అక్రమ లాభాలను అరికట్టగలుగుతాము. ధానికి ప్రభుత్వం పూనుకోవాలి. ఇక రైతులకు కావలసిన ఎరువులగురించి ఢిల్లీ ప్రభుత్వం ఒకనిర్ణయం చేసినది. ప్రయివేటు వాళ్ళు ఎరువులు అమ్మకూడదని, కోపరేటివ్స్ అమ్మాలని నిర్ణయం చేశారు. దానిలోకూడ అవకతవకలు ఉన్నాయి. అందుచేత ప్రభుత్వం ఒకసంఘాన్ని నియమించి, కూలంకషంగా ఈవ్యవహారాన్ని చర్చించాలి. అలా చేసిననాడే ఈవ్యవహారంపై అభిప్రాయ భేదాలకు తావుఉండదు. కాని ఈనాడు మార్కెట్టులో ఉన్న ధరలను, ఎవరూ సమర్థించరు. కానిరైతు డిశంబరు, జనవరి నెలల్లో అమ్ముతున్నప్పుడు, ఎంత చౌకగా అమ్ముతున్నాడో ప్రభుత్వం ఒకసారి చూడాలి. అందుచేత licence holders ద్వారాపట్టణాలలో, జిల్లాలలో అమ్మటకు ప్రభుత్వం పూనుకొన్నట్లయితే తప్పకుండా ధరలు తగ్గడానికి అవకాశం ఉంటుంది. ఇలా ధరలు పెంచి, రైతు ధనంప్రోగుచేసు కొంటున్నాడు, అని అనుకోవడం పొరపాటు. ప్రభుత్వంయొక్క రిపోర్టు చూచి నట్లయితే, ఈనాడు ఆంధ్ర రైతాంగం 220 కోట్లరూపాయల అప్పు భారంతో మునిగిఉనట్లు తోస్తున్నది. నిజంగారైతులు లాభాలు సంపాదించు కొంటూ ఉన్నట్లయితే ఆ అప్పులు తీర్చుకోకుండా ఉంటారా? వడ్డీవ్యాపారస్థులకు యివ్వడానికి ఎవ్వడైనా యిష్టపడతాడా? అందుచేత ఏ ఏ ప్రాంతాలలో ఎంతెంత ధరలు ఉన్నవి? అక్కడ ఆ పంటకు అయిన ఖర్చు ఎంత? గిట్టుబాటు అవుతున్నదా లేదా? మొదలైన వివరాలు సేకరించడానికి ఒక కమిటీని వేయాలి. ఆసంఘ నియామకానికి ప్రభుత్వం పూనుకొని ప్రజలకు తెలియపరచినట్లయితే, రైతుకు గిట్టుబాటు అవుతున్నదీ, లేనిదీ ప్రజలు వెల్లడిస్తారు. రైతులకు గిట్టుబాటు ధర నిర్ణయించకుండా మార్కెట్టు సృష్టించకుండా, ధరలు పెరిగిపోతున్నవి అని అనడం సబబుకాదు. ఈ సందర్భంలో అయిదు సూత్రాలను గమనించాలి. ఒకటి ఇరిగేషన సౌకర్యాలు కల్గించాలి. రెండు క్రెడిట్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. మూడు మార్కెట్టు సౌకర్యం కల్పించాలి. నాలుగు క్రాప్ ఇన్స్యూరెన్సును ఏర్పాటు చేయాలి. ఐదు, కనీసపు ధరను నిర్ణయించాలి. ఈ 5 సూత్రాలను ప్రభుత్వం పాటించి ఇంతకంటె ధరను పెంచడానికి వీలులేదని అనండి, అప్పుడు

బాగుంటుంది. అందుచేత ఈ సూత్రాలను విధిగా అమలు చేయడానికి ఒక కమిటీని నియమించి, రైతుయొక్క బాగోగులు తెలుసుకొనడానికి పూనుకోవాలని మనవి చేస్తున్నాను. ఈసౌకర్యాలు రైతుకు కల్పించి, తద్వారా అధికాహారోత్పత్తికి శ్రద్ధవహించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

*శ్రీ యమ్. సత్యనారాయణరాజు (చీపురుపల్లి-జనరల్) : అధ్యక్షా, ధరవరలు పెరిగి పోతున్నాయి. వానిని అదుపులో పెట్టాలి అన్న ఆందోళన ఈనాటిదికాదు. రమారమి 2, 3 సంవత్సరాలనుంచి ఈ ఆందోళన జరుగుతోంది. అందరు కలసి ఏదోవిధంగా ఈ ధరలను అదుపులో పెట్టాలి. ప్రభుత్వం ఈ ధరలను అదుపులో పెట్టకపోవడానికికూడ ఒక కారణం కనుపిస్తున్నది. 1950-52 లో జరిగిన అనుభవం ప్రభుత్వం మరచిపోదు. అందుచేతనే ప్రొక్యూర్ మెంటుచేసి కంట్రోలు చేసినట్లయితే మరల Black market పెరిగిపోతుందని ప్రభుత్వానికి భయం. ఆ భయంచేతనే ఏమీ చేయలేకుండా ఉన్నది. పోనీ indirect గా ఒక పద్ధతినికూడ అవలంబించలేకుండా పోతోంది. ఇలాగే ఈ పరిస్థితులను విడిచిపెట్టినట్లయితే కొంతకాలానికి విషమిస్తవని మనవిచేస్తున్నాను. గౌరవ సభ్యులు లక్ష్మణదాసుగారు చెప్పినట్లుగా రైతుబాధను చూడకుండా ఎవరూ ఈనాడుఉండలేరు. రైతు శ్రేయస్సును దృష్టిలోఉంచుకొనే ఈనాడు ప్రతి సభ్యుడు మాట్లాడుతున్నారు. ప్రస్తుత ఈ ధరలలో అటు రైతుగాని ఇటు consumer గాని ఇద్దరిలో ఎవరికి లాభంలేకుండా ఉన్నది. మధ్యఉన్న దళారులు లాభం పొందుతున్నారు. దీనికి కారణం ఏమిటి అంటే కోతలకాలంలో ధరలు చాలా తక్కువగా ఉంటాయి. రైతుదగ్గర డబ్బు ఉండనందువల్ల ఏదో వచ్చిన రేటుకు అమ్ముకుంటారు. కొనుక్కొనేవాళ్ళు ఈ ధాన్యాన్నంతా కొనుక్కొని, వారిదగ్గర డబ్బు లేకపోతే బ్యాంకులలో అప్పులు తీసుకొని ధాన్యాన్నికొని, నిలవచేయడం జరుగుతున్నది. ఆ ధాన్యాన్ని నిలువచేసిన ఈ మధ్యదళారీలు వారి యిష్టం వచ్చినట్లు ధరలను పెంచడంవల్ల ఇలా పెరిగిపోతున్నాయి. రైతూ బాధపడుతున్నాడు. అటు consumer బాధపడుతున్నాడు. మధ్యవాళ్ళ లాభం మట్టుకు రెట్టింపు ఉంటుంది. దీనికిమాత్రం ప్రభుత్వం బాధ్యత తీసుకోవడంలేదు. దీనివల్ల సామాన్య ప్రజలు, కార్మికులు చాల బాధపడుతున్నారు. ప్రభుత్వం ఈ మధ్యవర్తులను అరికట్టాలి. దానికి తగిన బందోబస్తు చేయాలి. కొన్నాళ్ళు food grains మీద బ్యాంకులు అప్పు యివ్వకూడదని అన్నారు. చివరికి దానినికూడ అరికట్టలేకపోయారు. ఈ ప్రభుత్వ అసమర్థత వల్లనే ధరలు తగ్గకపోగా పెరిగిపోయి ఆందోళనకు ఆస్కారం ఏర్పడుతోంది.

దీనికి ఒక Planned Programme వేస్తే తప్ప ఈ పరిస్థితులలో మార్పు రాదు. మూడు సూత్రాలను ముఖ్యంగా అమలుజరుపాలి. ఒకటి, ప్రొడక్షన్

ఎక్కువ జేయాలి. రెండు, దానికి డిమాండు create చేయాలి. మూడు, దానిని సరిగా distribution చేయాలి. ఈ మూడింటిని ఒకదానికి ఒకటి Co-ordinative గా చూసుకొంటూ పోవాలి. అప్పుడే ఈ దళారీలను ప్రభుత్వం అదుపులో పెట్టగలుగుతుంది. ప్రొడక్షన్ విషయంలో 1955 నుంచి, కర్నూలులో ఉన్నప్పటినుంచి, మేము చెబుతూనేఉన్నాము పెద్ద ప్రాజెక్టుల మీద ఎక్కువ concentrate చేయడంకన్న మైనరు ఇరిగేషన్ మీద శ్రద్ధ వహించాలని చెప్పాము. పెద్ద ప్రాజక్టులలో సద్యః ఫలితం రాదు. అదీ ఉండవలసినదే! జమీందారీ ఏరియాలలో చెరువులు అన్నీ మరమ్మత్తు కాకుండా పాడైపోయి ఉన్నాయి. వాటినిగనక బాగుచేస్తే ఎంతో ఉపకరించేది. దీనివల్ల సన్నకారు రైతులకు ఉపయోగపడుతుంది. మైనరు ఇరిగేషన్‌వల్ల అధికోత్పత్తికి ఎక్కువ అవకాశం ఉంటుంది.

సరియైన నీటివసరులు లేకపోవడంవల్ల అధికాహారోత్పత్తి చేయడానికి వీలులేకుండాపోతున్నది. దీనికి తోడు ఎరువులను కూడా సకాలంలో సప్లయి చేయడంలేదు. మే, జూన్ నెలల్లో దరఖాస్తు పెట్టుకుంటే వరిచేలు వృథాఅయిపోయిన తరువాత ఎరువులువస్తాయి. సకాలంలో ఎరువులు ఇవ్వకపోవడంవల్ల పంట బాగా పండడంలేదు. ఉత్పత్తి తగ్గుతోంది. సహకారవ్యవసాయం ద్వారా ఉత్పత్తిని పెంచుదామని కూడా అనుకుంటున్నారు. మేరు ధనాన్ని కట్టడం, తరువాత రిజిష్టరు కాకపోవడం, రిజిష్టరు అయినతరువాత సకాలంలో అప్పులు ఇవ్వకపోవడంవల్ల తగిన ఉత్పత్తి చేయడానికి అవకాశం లేకపోతున్నది. నిన్ననే లక్ష్మణదాసుగారు ఒక తీర్మానాన్ని తీసుకువచ్చారు. రైతు అధిక వడ్డీలకు అప్పులు తీసుకురావలసివస్తున్నది. పంట ఏమైనా వస్తే అధిక వడ్డీలకు జమకట్టవలసివస్తున్నది, ఎప్పటికి రైతుకు ఆర్థికక్షేమతు ఉండడంలేదు. రైతు కుంటుపడుతూనే ఉన్నాడు, కానిబాగుపడడంలేదు. రైతుకు సరియైన ధర ముట్టకూడదని ఎవరికి లేదు. ఈ పరిస్థితులన్నీ చక్కబరుచుకుంటే తప్ప ఉత్పత్తి కుంటుపడుతుంది. ఉత్పత్తి హెచ్చితేనే కాని ధరలు తగ్గడానికి లేదు. దినదినం జనాభా పెరుగుతుండడంవల్ల డిమాండు హెచ్చుతున్నది. హెచ్చిన డిమాండుకు తగినట్లుగా ఉత్పత్తి పెరగడంలేదు. **Primary importance must be given to the minor irrigation works.**

**శ్రీ కె. వెంకటరావు :** రెండు రకాల ఉత్పత్తి వల్ల ఈ చిక్కు వస్తున్నదని అన్నారు. దేనిని తగ్గించాలంటారు ?

**శ్రీ యమ్. సత్యనారాయణరాజు :** జనాభా పెరుగుదలను కూడ తగ్గించడానికి వీలుంటుంది. అది కూడ చేయవచ్చును. జనాభా హెచ్చుగా పెరిగినా దేశానికి నష్టం ఉన్నది. దానికి కూడ ఒక ప్లాను ఉండాలి. అటువంటి దేమీ

వద్దని నేను అనడం లేదు. చేయలేనప్పుడు ఏమి చేస్తాము ? ఉన్నవారికి ఆహారం ఇవ్వవలసి ఉన్నది. రాష్ట్రంలో మైనర్ ఇరిగేషన్ చెరువులు చాల అధ్వాన్నంగా ఉన్నాయి. జమీందారిచెరువులు, గడ్డలు పీటినన్నింటిని బాగు చేయించాలి. వాటి అన్నింటి విషయమై ఒక war మాదిరి declare చేసి బాగు చేయిస్తే Within the next year you will get results- ఇక పంపకం సమస్య ఉన్నది. ధాన్య సేకరణకై వ్యక్తులకు లైసెన్సులు ఇవ్వడం మంచిది కాదు. ఈ విషయం ప్రభుత్వానికి కూడ అనుభవం ఉన్నది. 1950-52 సంవత్సరాలలో ధాన్యసేకరణ, రేషనింగుల వల్ల ప్రజలు ఎంత కష్టపడ్డారో, పరిస్థితులు ఎంత అధ్వాన్నమైనాయో అందరికీ తెలుసు ఆ పద్ధతిని తిరిగి పెట్టాలని మేముకోరడం లేదు. తాలూకాల స్థాయిలో మార్కెటింగ్ సంఘాలను పెట్టి వాటి ద్వారా పంటకాలంలో ధాన్యాన్ని కొని ధరను అదుపులో ఉంచినట్లయితే మధ్యవర్తుల బేరాలు తగ్గుతాయి. మధ్య వ్యాపారస్థులపై అదుపు ఉంచితేనేగాని ధరలను కంట్రోలు చేయడం సాధ్యం కాదు. తాలూకా మార్కెటింగ్ సంఘాల ద్వారానే పంపకం కూడ చేయించినట్లయితే అన్ని విధాల క్షేమంగా ఉంటుంది. లేకపోతే ధరలు పెరుగుతున్నాయని ఎంత ఆందోళన చేసినా లాభం లేదు. ఆ రకంగా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

* శ్రీ యన్. వెంకయ్య (అద్దంకి) : అధ్యక్షా, అధికోత్పత్తి కావాలనే అభిప్రాయం కేంద్రప్రభుత్వం మొదలు రాష్ట్రప్రభుత్వంవరకు ఉన్నది. ప్రజలలో కూడ ధాన్యోత్పత్తి పెంచడం అవసరం అన్న భావం ఉన్నది. కాని ఉత్పత్తి పెరగడానికి మార్గం, సుస్పష్టమైన విధానం ఇంతవరకు నిర్ణయింపబడలేదు. వ్యవసాయశాఖామాత్యులు తయారుచేసిన జాబితాప్రకారం చూస్తే, రైతుకు ధర గిట్టుబాటు అవుతున్నదా ? గిట్టుబాటుకాని సందర్భంలో ధాన్యఉత్పత్తిని ఎలా పెంచుతాడు ? ఎట్లా తగ్గించుకోగలుగుతాడనికూడ మీరు ప్రశ్నింపవచ్చును. తగ్గించడానికి అవకాశాలున్నవి. రైతుకు ధాన్యానికి తగిన ధర ఎప్పుడైతే రాదో అపుడు దానిని ఉత్పత్తిచేసి నష్టపడకుండా ఉండడానికి ఎరువులలో, పనులలో, దుక్కులలో రకరకాలుగా ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తాడు. దానివల్ల రైతుకు గిట్టుబాటుఅయిన ధరఉంటేనే ఉత్పత్తి పెరగడం, హెచ్చుఉత్పత్తి దేశంలో ఉంటేనే ధరలుకూడా వాలిపోవడం తప్పనిసరి అవుతుంది. రైతుకు గిట్టుబాటుగాఉన్న పంటనే ఉత్పత్తిచేస్తే అది సహజం. గిట్టుబాటుకానిది ఉత్పత్తిచేస్తే నష్టపడవలసి ఉంటుంది. నష్టపడడానికి ఎందరు అంగీకరిస్తారు ? విధిలేక ఎవరైనా పండిస్తే పండించవచ్చును. అయినా ఖర్చులను పరిమితం చేయడానికి ప్రయత్నం చేస్తారు. పరిమితం చేయడానికి వీలున్నది అని కూడ మనవి చేస్తున్నాను. మాగాణి రైతులు ప్రారంభంలో ఎరువువేయాలి

అంటే దున్నకముందు వేయాలి; దున్నినతరువాత నాటుసమయంలో వేయాలి. తరువాత పైరుపెరిగిన తరువాత వేయాలి. వెన్నుతీసినపుడు వేయాలి. నాలుగు సార్లు ఎరువువేస్తే చాల ఎక్కువగా ఉత్పత్తికావడానికి అవకాశం ఉన్నది. ఎరువులు లేనపుడు పెట్టిన పెట్టుబడి గిట్టుబాటు కానపుడు ఎరువులు తగ్గించుకోడానికి ప్రయత్నం చేస్తారు. ఉత్పత్తితగ్గక తప్పదు, ఖర్చులో కలిసివస్తున్నది కదా అని ఉత్పత్తితగ్గినా రైతు సంతృప్తిపడతాడు. అధికోత్పత్తిని సాధించాలంటే రైతుకు తప్పనిసరిగా గిట్టుబాటుఅయిన ధర వస్తేనే సాధ్యం అవుతుంది. అద్దంకి చెరువుక్రింద 900 ఎకరాలు సాగుకావలసిఉన్నది. 500 ఎకరాలు మాత్రం సాగుఅవుతూవచ్చింది, 10 సంవత్సరాలైన తరువాతకూడ అభివృద్ధి చెందలేదు. యుద్ధానంతరం గిట్టుబాటుఅయిన ధర రావడంవల్ల ఎరువులు మొదలైనవివేసి మిగిలిన 400 ఎకరాలను రెండుసంవత్సరాలలో సాగులోనికి తెచ్చారు. పంప్ సెట్సు పెట్టి రకరకాల సాధనాలద్వారా అధికంగా భూములను సాగుచేయాలంటే గిట్టుబాటైన ధరఉన్నపుడే వీలుంటుంది. అపుడే ఉత్పత్తి పెరుగుతుంది; ధరలు తగ్గుతాయి. మరొకవిధంగా ధరలు తగ్గాలంటే సాధ్యం కాదు. కంట్రోలుద్వారా ధరలను తగ్గించగలరా? లేదని స్పష్టంగా గతచరిత్ర నిరూపించింది. ధాన్యసేకరణ చేసినంతమాత్రాన ధరలు తగ్గించగలరా? లేరని స్పష్టంగా తెలుతూనేఉన్నది. చౌకగా అమ్మడానికి అవకాశాలు కల్పించకపోతే, కేవలం రైతులదగ్గర ధాన్యం తీసుకున్నంతమాత్రాన, ధరలు తగ్గుతాయా? తగ్గవు. మార్కెటులో రకరకాల ధరలు ఉంటూనే ఉంటాయి. ప్రభుత్వమే నేరుగా సేకరించి మార్కెటులోనికి తెచ్చి విడుదలచేసే అవకాశాలున్నాయా? ఉద్యోగులకు అంత నైతికబలం, నైతిక ప్రమాణాలున్నాయా అనేవిషయంకూడ అందరికి తెలిసినదే.

తప్పనిసరిగా ఉత్పత్తిని పెంచడానికి ప్రయత్నం చేయాలి. ఉత్పత్తి పెరగడానికి యింకోనిరోధంకూడ ఉన్నది. ఈరోజున ఒంగోలు మార్కెట్టులో అమ్మోనియా సల్ఫేటు మామూలుగా బస్తా 87 రూపాయలు ధర ఉండవలసినది 52 రూపాయలు మొదలుకొని 60 రూపాయలవరకు అమ్ముతున్నదనేది స్పష్టంగా తెలిసిన విషయమే. కావాలంటే నిరూపిస్తాముకూడ. ఆలాగే యితరఎరువుల ధరలుకూడ రైతుకు అందుబాటులోలేవు. విపరీతమైన ధరలకు కొనలేని రైతు ఎరువులను ఎలాగ వాడగలడు. ఎరువులను వాడలేనప్పుడు ఉత్పత్తి ఎలాగ పెరుగుతుంది? కాబట్టి ఉత్పత్తి పెరగడానికి రైతుకు కావలసిన ఎరువులు వగైరాలను విరివిగా సరఫరా చేయాలి. నీటి వసతులు కల్పించాలి. కల్పించిన నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలంటె- రైతుకు తగిన ధర యివ్వడం చాల అవసరం. ధానినుంచి దృష్టి యేమాత్రం

యితరవిషయాలకు మరల్చినా ఉత్పత్తి పెరుగదు; ధరలు తగ్గవని మనవి చేస్తున్నాను. ధాన్యోత్పత్తికి కొన్ని విధానాలలో చాల హెచ్చుగా ఖర్చవుతుందని తెలిసినవిషయమే Pumping sets కి ఎంత ఖర్చవుతుంది? బావుల క్రింద సేద్యానికి ఎంత ఖర్చవుతుంది? ఆ రెండింటినీ పోల్చిచూస్తే బావులక్రింద సేద్యమే కష్టతరమైనదని అర్థమవుతున్నది. అందువలన తప్పనిసరిగా మార్కెట్టులో ఎరువులు, విత్తనాలు తగిన ధరలకు అందుబాటయ్యేటట్లుచూచి, నీటివసతులను కల్పించడమేగాక ధాన్యం ధరలు కూడ రైతుకు గిట్టుబాటు అయేలాగ చూసుకోవాలి. ఆయితే కొనుగోలుదారుయొక్క సౌకర్యాన్ని గమనించవలసిన అవసరం లేదనడంలేదు. రైతులు ఒకప్పుడు (డిసెంబరు, జనవరి నెలలలో) తమకు గిట్టుబాటు అయినా కాకపోయినా ధాన్యాన్ని విడుదల చేస్తారు. అలాంటి తరుణంలో డిసెంబరు, జనవరి నెలలలో ధాన్యాన్ని తీసుకొని ప్రధానమైన ప్రదేశాలలో కొనుగోలు దారులకు చౌకగా యివ్వడానికి ప్రయత్నం చేయవచ్చు. ఆ సమయంలో గవర్నమెంటు కొనడానికి ప్రయత్నంచేస్తే రైతుకి నష్టం ఉండదు. ప్రభుత్వం పూర్తిగా ధాన్యం వ్యాపారంలో దిగడానికి మన ఉద్యోగుల నైతిక ప్రమాణం చాలదు దానికి ఒకటే నిదర్శనం, కంట్రోలు రోజులలో రైళ్లలో క్రిక్కిరిసి బియ్యం నలుమూలలకు పోయింది. దుకాణాలలో చాటు మాటుగా హెచ్చు ధరలకు అమ్మడం జరిగింది. అందుచేత ప్రభుత్వోద్యోగులలో నైతికప్రమాణం పెరగనిదే ప్రభుత్వం ధాన్యం వ్యాపారంలో దిగడానికి వీలులేదు. అధికాహారోత్పత్తిని ప్రచారం వల్లగాని, procurement వల్లగాని అధికారులు సాధించలేరు. దీనికి ఒకటే మార్గం కనిపిస్తున్నది. కొనలేని కొనుగోలు దారులకు rebate యిస్తే కొంతవరకు నయం. ప్రభుత్వం అధికాహారోత్పత్తికి అన్నివిధాలా సౌకర్యం కలిగించి, కొనుగోలు దారులకు ధాన్యం చౌకగా అందుబాటులో ఉండడానికిగానురebate యిచ్చే ప్రయత్నంచేస్తే మంచిదని మనవి చేస్తున్నాను.

* శ్రీ డి. నరసయ్య (ఎల్లందు - రిజర్వుడు) : అధ్యక్షా, ఆహార సమస్య చర్చకు వచ్చినప్పుడల్లా అనేక వాదనలు వింటూనే వుంటాము. ఇందాక మాట్లాడిన మిత్రులు చెప్పినట్లు ఆహారసమస్యపై చర్చలో ఉత్పత్తి దారులకు గిట్టుబాటు సమస్య, కొనుగోలుదారులకు అందుబాటు అనే రెండింటినీ ఒక దాని కొకటి పోటీపెట్టి చర్చించడం జరుగుతున్నది. దానివల్ల మనకు ఎక్కువ ప్రయోజనంలేదు. పైగా యిట్లా కాలంగడచినకొద్దీ తిండి తినవలసిన బీద ప్రజలు, కొనుక్కోలేక అనేక బాధలకు గురి అవుతారు. మధ్య దళారీలు ఎక్కువడబ్బు సంపాదిస్తారు. ఈ చర్చలవల్ల కాలయాపన మాత్రం జరుగుతున్నది. ఈ సందర్భంలో సిద్ధాంత చర్చలు యేమైనప్పటికీ అందరికీ యేకాభి

ప్రాయంగా వున్న సమస్యలు కొన్ని ఉన్నవి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే గ్రామాలలో వ్యవసాయ కూలీలు, చేతివృత్తులు గలవారు, గీతపనివారు గ్రామ జనాభాలో 60% తమకష్టంవల్ల వచ్చినజీతాలు పెట్టి బజారులో కొనుక్కుంటారు. వారికి అందుబాటులో ధరలు వుంచాలని పండిత నెహ్రూగారు, కేంద్రప్రభుత్వం అగ్రనాయకులందరూ యిది తక్షణ సమస్యగా గుర్తించారు. ఈ సమస్యా పరిష్కారానికి కొన్ని చర్యలు తీసుకోవాలని రోజూ వింటూనే వున్నాము. యింతకు ముందు మాట్లాడినవారు ఆ విషయాలు ఉదహరించారు. అందుకని అందులోకి నేను పోవడంలేదు, గిట్టుబాటు ధర అని అందరినీ ఒకే కొలబద్దతో కొలవడం సరియైన పద్ధతి కాదు. కష్టపడి ఒక ఎకరమో, రెండు ఎకరాలో సేద్యం చేసిన పంట తమ కుటుంబ పోషణకు చాలని చిన్న రైతాంగం వున్నారు. వందల యకరాలు గల పెద్ద రైతులున్నారు. వారందరినీ ఒకే లెక్కలో కడితే చిన్న రైతాంగం దెబ్బ తింటారు. పది లేక పన్నెండు ఎకరాల మాగాణి భూమి సాగు చేసే రైతులను మినహాయించి మిగిలిన వారి దగ్గరనుంచి గింజలను ప్రభుత్వం సేకరించి అవసరమైన ప్రదేశాలలో project ప్రాంతాలలో చౌక దుకాణాలు పెట్టాలి. ఉదాహరణకు నా నియోజక వర్గంలో వే ము లూ రి ద గ్గ ర 150 మంది పనిచేసే చిన్న ప్రాజెక్టు ప్రాంతంలో వారికి యిచ్చే కూలీల అందుబాటులో లేకుండా ధరలున్నాయి. ఆ డబ్బు పెట్టి బజారులో కొనుక్కోటానికి గింజ దొరకటంలేదు. వారు తిండిగింజలకోసం ఊరూరా తిరగడంవల్ల తగినంతమంది కూలీలు దొరకక ఆ ప్రాజెక్టుపని ముందుకు పోవడంలేదు. ఈ విధముగా Minor Irrigation projects కూడా దెబ్బతింటున్నాయి. పట్టణాలలో అంగళ్ళలో పనిచేసేవారు యితర కార్మికులకు యిది సమస్యగానే తయారైనది. అందుచేత ఉత్పత్తిదారుకు గిట్టుబాటు ధరకి కొనుగోలు దారుకు అందుబాటు ధరకి పోటీ పెట్టవద్దని మనవి చేస్తున్నాను, తరువాత ప్రభుత్వపక్ష సభ్యులు ఆహారశాఖ మంత్రిగారు పదేపదే రైతుకు గిట్టుబాటుధర లేదని పెద్ద సమస్యగా చెబుతున్నారు. రైతుకి ధరలు గిట్టుబాటు కాకపోవటానికి కారకులు ఎవరు ? ఆహార సమస్యపై చర్చ వచ్చినప్పుడల్లా బాధ్యతగల మంత్రుల దగ్గర నుంచీ రైతుకి ధర గిట్టుబాటు కాదని చెబుతున్నారు.

రైతుకు గిట్టుబాటు రేటు రాకుండా పోవడానికి కారకులు ఎవ్వరో తెలుసుకోవాలి. రైతులకు కావలసిన ఎరువులు, వ్యవసాయ పరికరాలు సరిగా అందుబాటులో వున్నవాలేవా అని పరిశీలించిచూస్తే, సరిగ్గా లభ్యముకాలేదని తెలుస్తుంది. ఉదాహరణకు బండిపట్టాలు బ్లాకుమార్కెటులో 120 రూపాయలకు అమ్ముతున్నారని మంత్రిగారు ఒక ప్రశ్నకు సమాధానముగా యీ శాసనసభ

లోనే చెప్పినారు. ఈ విషయాలన్నీ తెలిసికూడ మాటిమాటికి రైతుకు గిట్టుబాటు కాలేదని చెప్పడము సమస్యను దాటివేయడానికే ఉపయోగపడుతున్నది. తప్ప, సమస్యాపరిష్కారానికి ఏమాత్రము కూడ తోడ్పడదు. ముఖ్యముగా చిన్నకారు రైతాంగము మధ్య దళారీల చేతులలో పడి చాల నష్టపోతూ ఉన్నారు. ఈ పరిస్థితి ఎంత తొందరగా అరికట్టితే అంతమంచిదని ప్రభుత్వమునకు విజ్ఞప్తి చేస్తున్నాను. అయితే యీ సమస్యకు కొనుగోలుదారునకు మధ్య పోటీ పెట్టితే అత్యంత ప్రమాదకరమయిన పరిస్థితులు ఏర్పడగలవని తమద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. దేశములో అధికాహారోత్పత్తి చాల ముఖ్యమైనది. దానితోపాటు చవకదుకాణాలు తెరవడముకూడ దేశములో ఒక్క ముఖ్యమైన విషయము. ఈ రెండింటిని మనము తక్షణము పరిష్కరించవలసివున్నది. ఉదాహరణకు మా నల్లగొండజిల్లాలో షుమారు 2 లక్షల ఎకరముల మేరకు భూస్వాములు కౌలుదార్లకు బేదఖలుచేసి బీడుభూమిగా వుంచినారు. ఈభూములలో ఇంతకుపూర్వము సేద్యముచేస్తూ వుండేవారు. ఈవిధముగా 2 లక్షల ఎకరముల భూమి బీడుగా వుంచారంటే ఆహారోత్పత్తికి ఇది ఏ విధముగా తోడ్పడుతుందో గ్రహించాల్సివుంటుంది. అనేకగ్రామాలలో వేలాది ఎకరములు బంజరు, పోరంబోకు భూములు సేద్యములేకుండా బీళ్లుగావున్నవి. ఈవిషయము ప్రశ్నలసందర్భములో మంత్రిగారి దృష్టికితెస్తే, ఇది సమయము కాదని సమాధానము ఇచ్చారు. ఈవిధముగా సమాధానము యివ్వడము మరీ అన్యాయము. ఒకప్రక్కను అధికఆహారము ఉత్పత్తిచేయాలని అంటూ, చిన్న రైతాంగానికి సాగుచేసుకొనడానికి భూములులేకుండా చేయుచున్నారు. ఈ వైఖరి సమంజసముగాలేదు. ఇకమూడవ విషయమేమంటె అధికఆహారోత్పత్తికి Small Savings పోటీపెట్టిన సంఘటనలు మా మునగాలపరగణాలో వున్నవి. జమిందారీవర్గము యీప్రాంతమును చాలకాలము పరిపాలించినందున చెరువుల మరమ్మత్తులులేకుండా వున్నవి. దీనికోసము చాల ఆందోళన జరిగింది. ఈసంవత్సరమే కొన్నిచెరువుల మరమ్మత్తులకు sanction వచ్చింది. ఈసంవత్సరము హుజూరునగర్ తాలూకా మునగాలపరగణాలో అధికవర్షాలువల్ల పంటలు పోయినాయి. ఆతాలూకా రైతాంగము ఒకసదస్సును జరుపుకుని తీర్మానము ఒకటి pass చేసినారు. ఈతీర్మానాన్ని మంత్రిగారికి పంపుకున్నాము. గాని ఇంతవరకు ఏమీజరుగలేదు. మునగాలపరగణాలోని చెరువులలో ఈసంవత్సరము నింపుగా నీరువున్నది. అక్కడ తహాశ్శీల్దారుగారు small savings కు రైతులు డబ్బుకట్టితే వ్యవసాయానికి నీరు యివ్వబడుతుందని లేకపోతే చెరువులకు గండ్లు కొట్టిస్తానని బెదరిస్తున్నారు. ఎకరానికి 5 రూపాయలు చొప్పున Small Savings కట్టాలని నియమము ఒక్కటి పెట్టినారు. ఇటువంటి విధానాలు

అధికఆహారోత్పత్తికి ఏమాత్రముకూడ ఉపకరించవు. అందుచేత నేను చెప్పిన 2, 3 విషయములు దృష్టిలోపెట్టుకొని, చౌకదుకాణాలుకూడ తెరిపించి అధికఆహారోత్పత్తికి తోడ్పడవలెనని ప్రభుత్వమును కోరుతూ యింతటితో ముగిస్తున్నాను.

*శ్రీ కె. సుబ్బారావు (హిందూపూర్-జనరల్) : అధ్యక్షా, ఆహార సమస్య అత్యవసరముగా ఆలోచన చేయవలసిన సమస్య. ప్రభుత్వము, పరిపాలకులపదవి, ప్రతిష్ఠ, పరువు అంతాదానిపైన ఆధారపడివున్నది. అధికఉత్పత్తిచేస్తే ఆహార సమస్య తీరుతుందని అనేవారు కొందరు ఉన్నారు. అధిక ఆహార ఉత్పత్తి కొరకు కోట్లరూపాయలు ఖర్చుపెట్టినా మాకు అభ్యంతరములేదు. గాని ఈ ప్రభుత్వము వారు కూలీలు, ఉద్యోగస్తులు, స్వంతభూమి లేకుండాఉన్నవారిపై కూడా అధికారము వహిస్తున్నారన్నది జ్ఞాపకము చేసుకొనమని ప్రార్థిస్తూ వున్నాను. అనేకమంది కూలిచేసి జీవనము చేస్తున్నారు. ఈ ఆహారసమస్య కూలి నాలి చేసుకున్నవారికి ఎంతతీవ్రముగా పరిణమిస్తున్నదో ఒకసారి చూడవలసి వుంటుంది. ఆకలిసమస్య మానము, మర్యాదా ఎరుగదు. కూలివాని ఆకలి తీర్చడానికి మనము ఎంతకూలి యిస్తున్నాము, ఆ కూలితో ఎన్నిబియ్యం కొంటున్నాడు అన్నవిషయములు లెక్కచూచుకున్నప్పుడు కూలివాని ఆకలి తీరలేదనేది స్పష్టముగా తెలుస్తుంది. కాబట్టి ప్రభువులు ఆహార ధాన్యాలను సేకరించి కూలివానికి అందుబాటులో వుంచడానికి ఏమిచేస్తున్నారనేదే సమస్య గాని అధిక ఆహారోత్పత్తి సమస్యే మేము ఇప్పుడు ప్రస్తావించ దలచుకోలేదు. ఆంధ్రదేశము అన్నపూర్ణ. అందరకు అన్నముపెట్టుతుంది. ఇది దక్షిణభారతావనికి grannary అంటున్నారు కాని ఆంధ్రదేశములో ఈనాడు ఎంతమంది కూలీలు పస్తులుపడుతున్నారు? పల్లెలలో ఉపవాసాలుంటున్నారు అని ఒక సారి తమఎదపై చేయిపెట్టుకొని ఆలోచించేవారికి వాస్తవిక పరిస్థితులు గోచరించి ఇప్పుడేమి చేయవలెనన్న సమస్య ఉత్పన్నమౌతుందిగాని మరొకటి కాదని వారికి నేను మనవిచేస్తున్నాను. దేశములో రైతులు వున్నారు. వారికి పంటపండించడానికి అన్నివిధములయిన సౌకర్యములు చేయవలసినదే. రైతులు అంటే 'కాపులు' అని మనదేశచరిత్రలో నిర్వచనముంది. పిడికెడు గింజలువేసి పుట్టెడుగింజలు పండించి పిపీలికాది బ్రహ్మపర్యంతము వుండే కోటానుకోట్లు జీవరాసులను పెంచేవారు గనుక వారిని కాపువారని అన్నారు. అంతేగాని వారు ఒకకులముకాదు. గనుక రైతులకు కావలసిన సౌకర్యములు చేయవలసినదే. భూసంస్కరణలద్వారా భూమిని ముక్కలుచేసి పంచిపెట్టితే అధికఆహారోత్పత్తికి తోడ్పడుతుందనేది వేరే సమస్య. ప్రభుత్వము వసూలు చేస్తున్న

శిస్తులను ధాన్యరూపములోనయినా వసూలుచేసి పెద్దపెద్ద పట్టణాలలో కూలి నాలి అధికముగా వున్నచోట చౌకదుకాణాలు తెరిపించకమువల్ల ప్రభుత్వానికి ఒకకోటిరూపాయలు నష్టమువచ్చినాసరే 10 కోట్ల రూపాయలు విలువగల మానము మర్యాదా దక్కుతుంది. కాబట్టి రైతులనుంచి వచ్చే శిస్తులు ఆహార ధాన్యాల రూపములో రాబట్టుకొని కూలీనాలీ చేసుకొనేవారికి జీవనభృతి కలుగజేయడము మంచిది. ఇప్పుడు Pay Committee recommendations ఆవిధముగానే ఉన్నాయి అని చెప్పుకుంటున్నారు. మీరు ఎన్నికమిటీలు వేసి ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చుపెట్టినా వారికి అంతసంతోషము తృప్తివుండదు. వారికి కావలసినది తిండి, గుడ్డ. Dearness allowance cut చేయండి. వారికి కావల సిన ధాన్యము, పప్పు ధాన్యాలు, చక్కెర, కట్టెలు, కాఫీ విత్తనములు ఈ ఐదు దినుసులు పూర్వము రైల్వే cheap grain depots లో supply చేసినట్లు supply చేయడమువల్ల ప్రయోజనము కనబడుతుంది. వారికి కావలసినవి సౌకర్యములు గాని, వారికి డబ్బు యివ్వనవసరములేదు. "లక్షాధికారి అయిన లవణమన్నమె గాని మేలి బంగారంబు మ్రింగబోడు" అని అన్నారు. జీవనోపాధికి లోటు వచ్చినప్పుడు యింటిలో, ఇల్లాలు, పిల్లలు వస్తులుపడివున్నప్పుడు భార్య గర్భిణిగా వుంటె ఆమెకు కావలసిన పుష్టికరమయిన ఆహారము యిచ్చే శక్తి లేనప్పుడు వారికి ప్రభువులయందు భక్తిగాని ఆదరణ గాని వుండదు.

కూలినాలితో జీవనంచేసేవారి సమస్య వుంది. నౌకరితో జీవనంచేసేవారి సమస్య వుంది. వారికి ఆహారము సరైన ధరకు యిచ్చే ప్రయత్నముచేయాలి. కష్టపడి పండించే రైతు తాను తినకుండా ఎక్కడో అమ్ముకొంటాడు అనే దానిని కథలుగా చెప్పుకోవలసిందే. గాని తననుతాను బ్రతికించుకున్న తరు వాతనే అమ్మడానికి వీలుంటుంది. కోఆపరేటివ్ డిపార్టుమెంటుకు ఇచ్చి చౌకధర లను ఏర్పాటుచేస్తామని చెబుతున్నారు. ఈ కోపరేటివ్ వ్యవహారము కొంపలు దీసే వ్యవహారము. హోల్ సేల్ ఫ్రాడ్ పోయినసారి కో-ఆపరేటివ్ డిపార్టు మెంటులో జరిగింది. లెక్కవేస్తే 58 వేల మూటలు అనంతపురానికి వస్తే ప్రతి మూటకు 2 శేర్ల బియ్యమును black market లో అమ్ముకొన్న అధికారులు వున్నారు. ప్రభుత్వానికి ఒక కోటి రూపాయలు నష్టం వచ్చినా, N.G.O. లకు 4 కోట్లు ఇచ్చే దానిలో కాని లేదా బావులకు ఖర్చు పెట్టి దానిలోనైనా ఒక కోటి రూ. లు ఖర్చు చేసి ఆహారధాన్యాలు సరైన ధరకు లభించే ప్రయత్నములు చేయాలి. ఏనాడు కరెన్సీని గారడి చేసి నోట్లు అచ్చువేసి ప్రంచములోనికి తీసుకువచ్చామో ఆనాడే ధనికవాద తత్వం చిరస్థాయిగా నిలిచిపోయింది. రు. 1-0-0 కి శేరు బియ్యం అమ్మే వర్తకుడు తరువాత వారంలో 1-1-0 అమ్మి ధరలు పెరిగిపోయాయని

చెబుతాడు. దీనిలో కాంగ్రెసు కమ్యూనిస్టు సమస్య లేదు. ఒక కోటి నష్టము వచ్చినప్పటికి కూలీ ప్రజలను సంరక్షించాలి. ఈనాడుN. G. O. లకు 1-0-0 కి 2 శేర్ల బియ్యం లభించేటట్లు చూడాలి. బావులను ఎన్నడో కట్టి ఉద్ధరిస్తారనే మనుష్యులకు సబ్సిడీలను ఇచ్చినట్లే మానవ లోకంలో జీవించేవారిని సంరక్షించే దానికి సబ్సిడీలు ఇచ్చి చౌకడిపోలను అవసరమైన ప్రతిచోట పెట్టాలి. ఇది పంట పండించే రైతుకు అవసరంలేదు. పండటానికి అవకాశంలేక పండించటానికి వసతికల్పించకుండా కూలిపైన జీవించేవారికి గవర్నమెంటు ఉద్యోగాలపై జీవించేవారికి చేయవలసిన గారడి ఏమిటో ఆలోచించి ఆహార సమస్యను తీర్చటానికి ప్రభుత్వం ప్రయత్నించాలి. అది చేసేవరకు ప్రభుత్వ మాన మర్యాదలు దక్కేటట్టు లేవు రైతుకు ధర రావాలని చెబుతారు. అది నాకు తెలుసు. కష్టపడి పనిచేసే రైతులలో నేను ఒకడిని. అందులో అబద్ధమేమీలేదు. తగిన ధర రావాలంటే యిన్ని మంత్రాలు నేర్చినవారు దానికి ఏదో ఒక మంత్రం నేర్చుకోవాలి. ఎవరినో ఒప్పించటానికి, మెప్పించటానికి ధరగిట్టదని చెబుతున్నారు. ఈనాడు రైతుకు ధరగిట్టుతోందా అని నేను అడుగుతున్నాను. మధ్యరకంవారికి గిట్టేవిధంగా గారడిచేసి రైతులపేరు చెబుతున్నారు. ప్రభుత్వమే ధాన్యాన్ని కొని అవసరమని కోరినవారికి సరైన ధరకు ఇవ్వాలి. ప్రపంచంలో ఒక్క రైతే బ్రతకాలి, వాడే ప్రపంచాన్ని కాపాడుతాడు అని చెప్పటం సరైనదికాదు. కలుపుతీసే ఆడది లేకపోతే రైతు 'రహితు' అయిపోతాడు, కూలి చేసుకునే అమాయకులకు కావలసిన సౌకర్యములు ఎగ్రికల్చరల్ లేబర్ కు కొంత ఇచ్చినా తగిన సౌకర్యములు కలుగజేసి ప్రభుత్వానికి ఒక కోటి రూపాయలు నష్టం వచ్చినా చౌక డిపోలనుపెట్టి ఏర్పాటుచేసి నౌకరీ చేసేవారికి, కూలిపై బ్రతికేవారికి సరసమైన ధరలకు ఆహారధాన్యాలు లభించేటట్టు చేయాలని ప్రార్థిస్తున్నాను.

*శ్రీ జి. నరసింహమూర్తి : అధ్యక్షా! ఆహారసమస్య జయప్రదంకావటం బలహీనముకావటం అనేవి అధికోత్పత్తిపైన సక్రమమైన. సమర్థనీయమైన పంపిణీపైన ఆధారపడివుంటుంది. ఇప్పుడు దేశములో రెండువాదములున్నవి. పంటను పండించేరైతు తనకు గిట్టుబాటు అయ్యేవిధంగా, ప్రోత్సాహకరంగా వ్యవసాయం చేయటానికి అవకాశం కలిగేరీతిగా, తగుధర లభ్యంకావటం లేదనేది ఒకవాదం. ఆహార ధాన్యాలధరలు పెంపుకావాలనేది అతనికోర్కె. వినియోగదార్లు తమకువచ్చే ఆదాయంవల్ల ఆహారధాన్యాలను అధిక ధరలకు కొనుక్కొని కాలక్షేపంచేయటం చాలాకష్టం కనుక ధరలు తగ్గాలని చేసే వాదం రెండవది. ఈరెండు వాదాలలోను నిజంవుందికాని ఇవి అస్తవ్యస్తమైన

వాదములుకావు. సవ్యమైన, సరసమైనధరకు కన్స్యూమర్ కు లభ్యం కావా లంటే ప్రభుత్వం ప్రత్యేకంగా ఆహారధాన్యాల పంపిణీని నిర్వహించాలి. వర్త కుడు మధ్యవున్నంతవరకు పండించిన రైతుకు ధర రాకపోవటం, వినియోగ దారుడు హెచ్చుధరపెట్టి కొనుక్కోవటం జరుగుతున్నది. ప్రతిరోజు వాదానికి ఒకరంగంకాకుండా, సమర్థులు, నిపుణులుఅయిన ఆర్థికవేత్తలతోను, వ్యవసాయ రంగంలో నిపుణులైనవారితోను, విశేషానుభవంగల రైతులతోను ఒక కమి టీనివేసి ఇటు వినియోగదారుకు, అటు రైతుకు, ఉభయులకు ప్రోత్సాహ కరంగావుండే పద్ధతిగా నివేదిక తయారుచేసేవిధంగా ప్రయత్నించాలి. అప్పుడు అధికోత్పత్తి జయప్రదమై ధరలబాధ వుండదని నేను భావిస్తున్నాను. అధిక ధరలబాధ పట్టణాలలోవుండే ఉద్యోగస్థులకు, కూలీలకు ఎక్కువగావుంది. పల్లెవారికి ఈబాధ అంతగావుండదు. రైతులవద్దనే నెలజీతముగా పాలేర్లుగా వుంటారు. రైతు తనస్థోమతునుబట్టి 10, 3, 2, 15 మందిని పెట్టుకొంటాడు. వారికి తానుపండించిన ధాన్యమునే కూలీ ఇవ్వటంగా వారు దానితోనే కాలక్షేపంచేయటం జరుగుతోంది. పల్లెటూర్లలోని కూలీలకు, వర్తకుల ధరల ఇబ్బంది అంతగా వుండకపోయినా, పట్టణాలలోనివారికి ఇబ్బందిలేకుండా, రైతుకు ప్రోత్సాహమిచ్చేవిధంగా ప్రభుత్వము ప్రయత్నములుచేస్తే వ్యవ సాయసమస్య solve అవుతుంది. పట్టణాలకు సంబంధించినంతవరకు గౌ. సభ్యులు సుబ్బారావుగారు చెప్పినట్లు కొంత నష్టమైనా భరించి పట్టణాల్లోని జనాభాకు చౌకడిపోలు పెట్టించవలసి యున్నది. ప్రభుత్వం ధాన్యంకొని అవసరమైతే రిబేటుయిచ్చి చౌకడిపోల ద్వారా పట్టణవాసులకు సప్లైచేస్తే బాగుంటుంది. ఉద్యోగుల జీతములకు 4 కోట్ల వరకు అదనంగా ఖర్చు పెట్టు టకు పూనికొనినట్లే, ఆహారధాన్యాల విషయంలోకూడ అవసరమైతే ఇంకొక 4 కోట్లు రిబేటుగా ఖర్చు భరించి సప్లై చేయవలెనని మనవి చేయుచున్నాను. అటు వినియోగ దారునకు, ఇటు రైతుకు గిట్టుబాటు అయ్యే పద్ధతిలో చేయుట అవసరం. ముఖ్యంగా మన రాష్ట్రములో ఆహారమునకు హాహాకారాలు ఉండే అవసరంలేదు. ఉభయులకు అనుకూలమైన పద్ధతిని అన్వేషించుటకు వ్యవసాయ మంత్రిగారు చేస్తున్న కృషిహర్షనీయమైనది. వారు ప్రజా శ్రేయస్సుకొరకు ఎటువంటి సాహాస కార్యక్రమమునకై పూనుకొంటారు, ఈ అవకాశంయిచ్చి నందులకు అధ్యక్షులకు ధన్యవాదములు అర్పిస్తున్నాను.

* శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య : అధ్యక్షా, ఈ ఆహార విధానాన్ని కేంద్ర ప్రభుత్వంవారు non-party వ్యవహారంగా, పార్టీ విభేదాలకు అతీతంగా ఉంచి, అందరూ జాతీయ సమస్యగా భావించి పరిష్కరించవలెనని ఆలోచిస్తు న్నారు. కాని మన ప్రభుత్వమునకు అదృష్టి ఉన్నట్లు కనపడదు. అది మన

ప్రభుత్వం మొత్తంమీద ఉన్నదేమోగాని, ఈ మంత్రిగారికి మాత్రం అసలు ఉన్నట్లులేదు. ధరలు పెంచినవారికి పెద్ద వ్యాపారస్థులకు రక్షణను యిచ్చి, మద్దతుగా ఈ మంత్రిగారు ఉంటుంన్నందువలననే పెద్ద వ్యాపారస్థులంతా strike చేస్తున్నారా అని అనిపిస్తుంది. అది వారు కాదంటే సంతోషమే. బహుశా వారు కాదనరు. కేంద్రస్థాయిలో పార్లమెంటులోని అన్ని పార్టీల సభ్యులతో ఒక కమిటీని వేస్తామని పండిట్ నెహ్రూగారు చెప్పారు. ఇందాక మన ఈ మంత్రిగారు అటువంటి కమిటీ యిక్కడ అవసరం లేదని అనుకున్నామని చెప్పారు. నిజమే, జరిగేదేదో తమ స్థాయిలోనే జరగాలని, తక్కిన స్థాయిలో జరగకూడదనే అభిప్రాయం మంత్రిగారికి ఉన్నది. ఈ సందర్భంలో ఒక అనుమానంకూడ లేకపోలేదు. అశోక మెహతా కమిటీవారు వచ్చినప్పుడు మంత్రివర్గం సమావేశం కాకుండానే ఈ మంత్రిగారు ఆ కమిటీవారికి ఒక రిపోర్టు యివ్వడం జరిగింది. మంత్రిగారు Cabinet తో ఆలోచించే ఆరిపోర్టు యిచ్చారా అని అడిగితే ముఖ్యమంత్రిగారు ఈ విధంగా చెప్పారు-"మంత్రులు ఒక్కొక్కసారి సమావేశమగుటకు అవకాశం లేకపోతుందని, మంత్రులందరితో సంప్రదించకుండా, దానికి సంబంధించిన మంత్రి ముందుగా రిపోర్టుయిస్తేఅది మంత్రివర్గం ఒప్పుకోకపోతే చిక్కు వస్తుంది. కాని, ఒప్పుకుంటే చిక్కురాదు, ఒప్పుకొన్నాము" అన్నారు. సాధారణంగా Cabinet లో మంత్రిని desert చేయడం అనేది ఉండదు. అందువల్ల ముందుగా మంత్రివర్గాన్ని సంప్రదించక పోయినా తరువాత అంతా ఒప్పుకొనడం జరుగుతుంది. అయితే ఎవరిని desert చేయడం జరుగుతుందంటే-సామాన్య కన్స్యూమర్సును, తిండికిభాధపడే జనాన్ని. ఆ దృక్పథం ఈనాడు కనబడుతోంది. రాష్ట్రస్థాయిలోను, జిల్లాస్థాయిలోను పార్టీప్రమేయంలేకుండ అన్నిపార్టీల వారితోను కమిటీలు వేస్తారా అంటే వేయము అన్నారు. నెహ్రూగారు చెప్పేమాటలు వింటాం అంటారు, గాని వారు చాలా చెబుతూఉంటారు, కొన్నే అమలు జరుపుతాం అంటారు. అంటే వీరికి అనుకూలంగా ఉన్నవి వింటారని అర్థము చేసుకోవలసి వస్తుంది. ఆహార విధానము భారతదేశానికంతకూ సంబంధించినటువంటిది. నెహ్రూగారి పాలసీని ఈ ప్రభుత్వం అనుసరింపకుండా ఉండటమువలన, ఇది నెహ్రూ ప్రభుత్వాన్ని బలపరచేది కాకుండ, సెంటరుకు దీనికి తగాదాలు ఉన్నాయేమోననిపిస్తుంది. ఇది చెబుతూంటే మంత్రిగారు తలకాయ ఊపుతున్నారు. ఈ విషయం మాత్రంకాదేమో. నెహ్రూగారి పేరు చెప్పకపోతే ఓట్లుకూడరావు. అందువల్ల దణ్ణంపెట్టి దేముడిని ఉపయోగించుకొన్నట్లుగా నెహ్రూగారిని ఉపయోగపరచుకొని; వీరికి అనుకూలమైన విధానాలు మాత్రం అమలు జరుపుతూంటారని తెలుస్తుంది.

ఆహారధాన్యాల ధరల గురించి ప్రభుత్వం లెక్కలు యిస్తూంటుంది. కాని బజారులోనికిపోయి విచారిస్తే వాటికి, వీటికి ఏమి సంబంధం ఉండదు. జిల్లా కమిటీలలో అడిగితే food discussion కొరకు, ఆహారధాన్యాల ధరలు యిచ్చారు. వారు యిచ్చిన ధరల ప్రకారం బజారులో ధాన్యం యిప్పిస్తే మాకు ఏమీ complaint అనేదేలేదు అని చెప్పాము. ఎందువల్లనంటే సత్తెనపల్లిలోగాని, గుంటూరులోగాని ప్రభుత్వోద్యోగులు చెప్పేధరలకు బజారులో actual గా అమ్మే ధరలకు రూపాయకు మూడు నాలుగు అణాలు తేడా ఉంటున్నది. కాని మంత్రిగారు ఒకటి చెప్పవచ్చు. ఈ ప్రభుత్వం యిచ్చే లెక్కల కంటె, బజారులోని ధరలు ఎక్కువ ఉన్నాయని అంటున్నారుగాని కేంద్రప్రభుత్వం చెప్పే ధరలు చూస్తే చాలా తక్కువగా ఉన్నాయని ఒక వాదం తీసుకురావచ్చు. దానికి ముందుగానే నేను జవాబు చెబుతాను. అయితే కేంద్రప్రభుత్వం అలా ఎందుకు చేస్తున్నది అందులో కొన్ని లోపాలు ఉన్నాయంటే మాకు అభ్యంతరంలేదు. ఇతర దేశాలనుంచి ధాన్యం ఎందుకు తెప్పించాలి ? దేశంలో ఉత్పత్తిని పెంచుటకు కావలసిన ఏర్పాట్లు ఏమి చేస్తున్నది? అయితే ఈ విషయంలో కేంద్రప్రభుత్వాన్ని అనడానికి వీలులేదు, రాష్ట్రప్రభుత్వం సంగతి చూస్తే allotments కనబడతాయి. ఖర్చు పెట్టడం కనబడదు. ఆఖరిరోజులలో పనిచేయమని అంటారు. మనము చాల దురదృష్టపరిస్థితులలో ఉన్నాము. ప్లానింగ్ కమిషన్ వారు పని appraisal తోబాటు progress of the States విషయమై రిపోర్టు యిచ్చారు. అందులో వారు వ్రాసినది చెబుతున్నాను. ఆంధ్రరాష్ట్రంలో అధికాహారోత్పత్తి చేయుటకు అవకాశం ఉన్నదిగాని తక్కువ ఉత్పత్తి జరగడానికి కారణం విచారించాలి, జరగవలసినంత ఉత్పత్తి జరగలేదని వారన్నారు. దీనికి కారణాలు ఏమిటి ? ప్రభుత్వం ఇస్తున్న డబ్బు ఎక్కడ ఖర్చుఅవుతోంది ? సక్రమంగా ఖర్చవుతున్నట్లు లేదు. అధికాహారోత్పత్తి స్కీములు అనేకం ఉన్నవి. గుంటూరు కెనాల్ ఉన్నది. చీఫ్ మినిస్టరుగారు గుంటూరు రైల్వేబ్రిడ్జికి పునాది వేసినరోజున చెప్పారు. కొన్నిచోట్ల ప్రభుత్వము డబ్బుయిచ్చిన మరుసటి సంవత్సరమే ఉత్పత్తి చూపించగలరని చెప్పారు. గుంటూరుకెనాల్ తీసుకువస్తే 25 వేల ఎకరాలు మరుసంవత్సరానికి సాగులోకి తెచ్చి 12 వేల టన్నుల ధాన్యం ఉత్పత్తిచేయుటకు అవకాశం ఉన్నది. అయితే యిది ఇంకొకవిధంగా ఆలోచిస్తామన్నారు, సంతోషం. కాని ఎంత ఆలస్యం జరిగితే అన్ని 12 వేల టన్నుల ధాన్యం ఉత్పత్తి తగ్గిపోతుందని చెబుతున్నాను.

(*Mr. Speaker in the Chair*)

భూసంస్కరణల విషయంలో సీలింగ్సు ఒకవిధంగా అమలుజరపాలని ప్లానింగ్ కమిషన్ వారు చెబుతున్నారు. మనప్రభుత్వం ఒకవిధంగా చెబుతున్నది. ఈసీలింగ్సు ఆంధ్రరాష్ట్రానికేకాదు, అందరికీ ప్రమాదంఅనే ధోరణిలోఉన్నారు. వ్యవసాయమంత్రిగారు సీలింగ్సు విషయములో బయటపడ్డారో లేదో తెలియదు. నాకు తెలుసు. వారు సీలింగ్సుకు వ్యతిరేకులు. కాని కేంద్రప్రభుత్వం అడుగుతున్నది కనుక వీరు చేస్తున్నామని అంటున్నారు. Joint responsibility గనుక, జరిగితే ఏమిచేస్తాము ?— అనే ధోరణిలో ఉన్నారు. అయినా ఈప్రభుత్వం నిర్ణయించిన సీలింగు అంతప్రమాదమయినది కాదుగనుక చూసిచూడకుండా ఊరుకుంటున్నారు.

మిస్టర్ స్పీకర్ : అయితే సెంట్రల్ గవర్నమెంటును disobey చేయమంటారా ?

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య : భూసంస్కరణలు త్వరగా అమలు జరపాలని నేను చెబుతున్నాను. ఇప్పుడున్న మంత్రివర్గంలో మంత్రులు పంచుకొనిన portfolios సరిగాలేవు. Co-operation, Animal-husbandry, Irrigation, Agriculture యివన్నీకలసి ఒకమంత్రిక్రింద ఉండవలెనని co-ordination ఉంటుందని చెప్పారు. ఆలోచిస్తున్నామని ముఖ్యమంత్రిగారు చెప్పారు. జిల్లాలలో Planning Committees ఉన్నవి. అన్నింటికి కమిటీలు ఉన్నవిగాని Agriculture and Food కు మాత్రం కమిటీలేదు. దీనినిగురించి నవాబ్‌సింగ్ గారు (ఇప్పుడు కేంద్ర కాబినెట్ సెక్రెటరీ అనుకుంటాను) గుంటూరు వచ్చినప్పుడు అడిగాము. అటువంటి కమిటీలు వేయాలని చెప్పారు. జిల్లాకమిటీ ఒకటివేస్తే వెంటనేవారు ఉత్తరం వ్రాశారు—ఆంధ్రప్రభుత్వం వద్దనిఅంటున్నది, రద్దుచేయండి- అని చెప్పారు.

ఫుడ్ కమిటీ ఉంటే, అది ఫుడ్ సిట్యుయేషన్ గురించి డిస్కస్ చేయవచ్చును అని అంటే, జనరల్ డిస్కషన్‌లోనే డిస్కస్ చేయమన్నారు. జనరల్ డిస్కషన్‌లో ఏమి జరుగుతున్నదో మనకు తెలుసు. అక్కడ నలుగురు చేరతారు. జనరల్ డిస్కషన్‌లో ఎక్కువ సబ్‌జక్ట్సు చర్చించటానికి వీలుండదు. భోజనం చేయకుండా ఆఫీసర్సు వస్తారు. మా మొహాలు చూస్తూ "మీరు త్వరగా ముగిస్తే మేము ఇంటికి వెడతామండి" అంటారు. రెండుగంటలు మీటింగు అయ్యేటప్పటికి వారిపైన జాలికలుగుతుంది. మేము త్వరగా మీటింగు ముగించవలసివస్తుంది. కాబట్టి ప్రత్యేకంగా ఫుడ్ కమిటీ సర్పాటుచేస్తే, అది ఫుడ్ సిట్యుయేషన్‌ను చర్చించే అవకాశం ఉంటుంది. ఇతర దేశాలనుండి

ఆహారధాన్యాలు దిగుమతి చేసుకోకుండా మన దేశంలో ఉత్పత్తి ఎక్కువ అగుటకు ప్రయత్నం చేయాలి.

కో-ఆపరేటివ్ ఫార్మింగ్ గురించి కొంత చెప్పదలచుకొన్నాను. ప్రజలలో చైతన్యం లేకపోవటంవల్ల కో-ఆపరేటివ్ ఫార్మింగ్ పద్ధతి దెబ్బతింటున్నది. అంతేకాకుండా, కో-ఆపరేటివ్ ఫార్మింగ్ సొసైటీలకు ప్రభుత్వం తగినంత సహాయం ఇవ్వటంలేదు. వాటికి డబ్బు ఇవ్వటంలేదు; భూములు ఇవ్వటంలేదు. కో-ఆపరేటివ్ ఫార్మింగ్ సొసైటీలకు భూములు ఇవ్వాలంటే ప్రభుత్వం ఎన్నో చిక్కులు తెచ్చిపెడుతుంది. ప్రభుత్వం ఎవరికైనా ఒక వ్యక్తికైతే త్వరగా భూమి ఇస్తుంది. కాని కో-ఆపరేటివ్ ఫార్మింగ్ సొసైటీకి భూములు రావాలంటే ప్రతి తడవా ఇబ్బంది అవుతున్నది. కో-ఆపరేటివ్ ఫార్మింగ్ విధానాన్ని అమలుజరిపి, దానిని జయప్రదం చేస్తే, కొందరు వ్యక్తులకు కలిగే ప్రయోజనాలకు నష్టంకలుగుతుందనే భయంతో ప్రభుత్వంవారు కో-ఆపరేటివ్ ఫార్మింగ్ విధానాన్ని నిరుత్సాహపరుస్తున్నారని చెబుతున్నాను. ప్రభుత్వం కన్జ్యూమర్స్ విషయం ఆలోచించటంలేదు. కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా ఆహారధాన్యములు అమ్మితే నష్టంవస్తుందని అంటున్నారు. న్యాయంగా, నిజాయితీగా ఆహారధాన్యములు అమ్మే కో-ఆపరేటివ్ స్టోర్సులను, కో-ఆపరేటివ్ సొసైటీలను కృంగదీయటానికి అక్కడి వ్యాపారస్థులు ప్రయత్నంచేస్తే, వారితో ప్రభుత్వం చేతులుకలిపి, ఆ సొసైటీలను, ఆ స్టోర్సును ఎన్ని ఇబ్బందులు పెట్టాలో అన్ని ఇబ్బందులు పెట్టటం జరుగుతోంది. వాటికి పర్మిట్స్ ఇవ్వకుండా, వేగన్సు సప్లయి చేయకుండా, అనేక విధములుగా ఇబ్బందులు, చిక్కులు కలుగజేయటానికి ప్రయత్నించటంవల్లనే అనేక కో-ఆపరేటివ్ స్టోర్సు దెబ్బతినటం జరిగింది. అసలు కో-ఆపరేటివ్ మూవ్ మెంట్ దెబ్బతినటానికి కారణమయింది.

కేవలం వరదలవలననే కాకుండా, అనావృష్టి, అతివృష్టి వలన కూడ పంటలు దెబ్బతిన్నాయి. ఉదాహరణకు గుంటూరు జిల్లాలో మెట్టప్రాంతమంతా, మొట్టమొదట వర్షం లేనందువలన దెబ్బతిన్నది. తరువాత విపరీతంగా వర్షాలు కురవటంవల్ల దెబ్బతిన్నది. అక్కడిప్రజలు ఎగ్రికల్చరల్ డిపార్టుమెంట్ వారు ఏదో ఉద్ధరిస్తారని ఆశపడ్డారు. ఇప్పుడు ఒక సస్యసంక్షేమలారీ అక్కడ నడుస్తోంది. అక్కడ జొన్నకు దోమకాటు జరిగింది. అంతా మూడురోజులలో నష్టమైపోయింది. ఈ ఏడు చాలా పంటపండిందని రైతులు సంతోషించారు. కాని, మహామారి వచ్చినట్లు మూడురోజులలో దోమకాటు వచ్చింది. మంచి పాలతో ఉన్నటువంటి కంకులమీద ఆ దోమ వాలింది. దోమ వాలిన వెంటనే ఆ కంకులన్నీ నల్లగా మాడి మశానమైనవి. దోమకాటును పోగొడతామని

సస్యసంరక్షేమలారీవారు వచ్చారు. వారు ఏదో మందు వేశారు. దానివల్ల జరిగిందేమిటంటే, ఆ పురుగు పోకపోగా ఆ గడ్డికూడ గొడ్లు తినటానికి వీల్లేకుండా పోయింది. ఆ ప్రాంతాల్లో ధాన్యంధరలు అన్యాయంగా ఉన్నవి. ఆ విధంగా డిస్ట్రిక్టు ప్లానింగు కమిటీ కూడ నిర్ణయించింది. అందువల్ల ప్రభుత్వం వెంటనే అక్కడ జొన్నలు సప్లయిచేయించటానికి ప్రయత్నం చేయాలి. బియ్యం కాదు, మేము అడిగేది. అక్కడ జొన్నలు సప్లయి చేయించాలి. అన్నిచోట్ల సరసమైన ధరలకు ధాన్యం సప్లయి చేయాలి. దీనికి (అందరితో కూడిన) ఒక కమిటీని వేయాలని కోరుతున్నాను.

* శ్రీ ఎ. చిదంబరరెడ్డి (పెనుకొండ): అధ్యక్షా, ఆహారపరిస్థితిగురించి ఇంతవరకు మాట్లాడిన సభ్యుల అభిప్రాయంతో నేను ఏకీభవిస్తున్నాను కాని, నేను ఒక రైతుగా కొన్ని విషయాలు యీ సభవారికి చెప్పదలచుకొన్నాను. రైతులు పండించే ధాన్యమునకు ధరలు ఎక్కువగా ఉన్నవని ప్రతి ఒక్కరు అంటున్నారు. దేశంలో ఇది ఒక స్లోగన్ అయిపోతున్నది. ఈ స్లోగన్ బస్తీలో ఉన్న పెద్దలే ఎక్కువగా చెబుతున్నారు. ఒకవైపున అధికాహారోత్పత్తి కావాలంటారు. మరొకవైపున రైతు పండించే పంటకు ఎక్కువ ధర ఉండకూడదంటారు. ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం ఆహారధాన్యాలకు ఒక ధర నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం దేనిని ఆధారంచేసుకొని యీ ధర నిర్ణయించిందో మాకు అర్థం కావడంలేదు. 1950-51 వ సంవత్సరంలో ఉన్న ధరవరలే యీనాడు కూడ ఉన్నవి. ఆనాడు దేశం మొత్తంమీద లోటు బడ్జెటు 600 కోట్ల రూపాయలవరకు ఉన్నది. ఈనాడు 1100 కోట్ల రూపాయలు లోటు బడ్జెటు ఉంది. కాని ఆనాడు ఉన్నటువంటి ధరలే యీనాడు కూడ ఉన్నవి. ఈ డెఫిసిట్ ఫైనాన్సింగ్ యొక్క ప్రభావము మిగిలిన వస్తువులపై కూడ లేకపోలేదు. రైతులు కొనేటటువంటి వస్తువుల ధరలుకూడ చాలా హెచ్చుగా ఉన్నవి. 1951 సంవత్సరంకన్నా, 1958 వ సంవత్సరంలో రైతులపైన వేసే పన్నులు చాలా ఎక్కువ ఉన్నవి. ఈనాడు ఉన్నటువంటి మొత్తం పన్నులలో నాలుగింట మూడు వంతులు రైతు భరిస్తున్నాడు. కాని రైతు కొంటున్నటువంటి వస్తువుల ధరలు మాత్రం తగ్గలేదు. మన రాష్ట్రానికి ఇతర రాష్ట్రాలనుండి దిగుమతి చేసుకొంటున్న వస్తువుల ధరలుకూడ పెరిగిపోయాయి. మనం కేరళనుండి మిరియాలు దిగుమతి చేసుకొంటాము, కొబ్బరినూనె దిగుమతి చేసుకొంటాము, కొబ్బరి దిగుమతి చేసుకొంటాము. వాటి ధర తక్కువగా ఏమీలేదు. మనం ఏ ధరతో వారికి ఆహారధాన్యాలు ఇస్తున్నామో, అంతకన్నా ఎక్కువ ధరపెట్టి వారియొక్క వస్తువులను దిగుమతి చేసుకొంటున్నాము. మనం పండించే ధాన్యం ధర, మనం ఎక్స్‌పోర్టు చేసే వస్తువులధర

తగ్గించి, మనం కొనుక్కొనే వస్తువుల ధరలు ఎక్కువగా ఉంటే, మనకు కొనుగోలుశక్తి ఉంటుందా అని అడుగుతున్నాను. రైతు పండించే పంటకు తక్కువధర ఉండి, అతను కొనుక్కొనే వస్తువులకు ఎక్కువ ధర ఉంటే, అతనికి కొనుగోలుశక్తి ఉంటుందా అని ప్రశ్నిస్తున్నాను. రైతులు పండించే పంటకు ధర స్థిరీకరణ చేయుటకు యీ ప్రభుత్వంకాని, కేంద్ర ప్రభుత్వంకాని ప్రయత్నం చేయటంలేదు. ముఖ్యంగా వాణిజ్యపంటల విషయంలో యీ ప్రభుత్వము, కేంద్రప్రభుత్వము అనుసరిస్తున్న పద్ధతివల్ల చిన్న రైతులు మొదలుకొని పెద్ద రైతులవరకు అందరు దెబ్బతింటున్నారు. పంట ఊడ్పుల కాలంలో కేంద్ర ప్రభుత్వంఎక్స్‌పోర్టు పాలసీ డిక్లేర్ చేయకుండా, జూన్ నెలలో ఎక్స్‌పోర్టు పాలసీ డిక్లేర్ చేయటంవల్ల మధ్య దళారీలవారికి లాభం వస్తున్నది. ఉదాహరణకు యీ సంవత్సరం వేరుసెనగ ఎక్స్‌పోర్టుకు పర్మిషన్ జూన్‌లో యిచ్చారు. రైతులంతా జనవరి ఫిబ్రవరి నెలలలో బారువా 130 రు. లకు అమ్ముకొన్నారు. వారిదగ్గర కొన్నటువంటి మిల్లర్స్ జూన్‌నెలలో బారువా 190 రు. లకు అమ్ముకొన్నారు. బారువాకు 60 రు. చొప్పున మిల్లర్స్‌కు ఆదాయం వచ్చిందిగాని, పండించిన రైతుకు మాత్రం లాభంరాలేదు. ఇందుకు ఎవరుబాధ్యులు? దీనికి బాధ్యతవహించేది కేంద్రప్రభుత్వమా, లేక, రాష్ట్రప్రభుత్వమా అని అడుగుతున్నాను. ఈ 60 రులు రైతుకేలాభంవచ్చేరీతిగాచేస్తే, రైతుకుకూడ కూలీలకు ఎక్కువకూలి ఇవ్వటానికి తాహతువుండేది. రైతు తనకు కావలసిన వస్తువులను ఎక్కువధరలకు కొనుక్కొంటూ, తాను పండించినపంటను తక్కువధరకు అమ్మవలెనని మనంఅనటం ఏమాత్రం సమంజసమైనదికాదని మనవిచేస్తున్నాను. దేశంలో ప్రజల కొనుగోలుశక్తి పెరిగినపుడే, పరిశ్రమలు అభివృద్ధిపొందే అవకాశం ఏర్పడుతుంది. రైతుల కొనుగోలుశక్తి పెరిగినపుడే, కాటేజ్ ఇండస్ట్రీస్ అభివృద్ధి పొందటానికి అవకాశంఉన్నది. రైతులోకం కాటేజ్ఇండస్ట్రీస్‌లో ఉత్పత్తిఅయిన వస్తువులనే ఎక్కువగా కొంటుంది. రైతుపండించే పంటకు తక్కువధరఉండి, రైతు కొనుక్కొనే వస్తువులకు ఎక్కువధర ఉండాలనిచెప్పటం సమంజసమైనదికాదు. ఉత్పత్తిదారులకు కొనుగోలుదారులకు నష్టంలేనివిధంగా ధరలను స్థిరీకరించాలి. అప్పుడే దేశంలో యీ అలజడిలేకుండా పోతుందని మనవిచేస్తున్నాను.

ఆలాంటిరైతు తాను పండిస్తున్నదానికి తక్కువధరతీసుకొని; కొంటున్న వాటికి మాత్రం ఎక్కువధరచెల్లించే policy లేకుండాచేసి, ఆరెండింటికి సమాన ప్రతిపత్తిని కలిగించిననాడు, కొనుగోలుదార్లకుకాని, ఉత్పత్తిదార్లకుకాని ఏలాంటిభారమూ ఉండబోదని మరొకసారి మనవిచేస్తున్నాను. రైతు పండించే పంటకు గిట్టుబాటుఅంటే ఏమిటని అడుగుతున్నారు. నాఅనుభవంలో రైతు

ప్రతిసంవత్సరం కూలీలకు ఎక్కువ ఇవ్వవలసివస్తోంది. దానివల్ల అతనికి మిగిలేది తగ్గిపోతోంది. వీటినిగురించి పదిసంవత్సరాల లెక్కలు ఇవ్వమన్నా ఇవ్వగలను. రైతు తానుపండించేదానిలో 70% ఖర్చుపెట్టవలసివస్తోంది. ఈనిష్పత్తి ప్రకారంచూస్తే, ఈనాడు ఉన్నధరలు ఎంతమాత్రం ఎక్కువకాదని మనవి చేస్తూ ఇంతటితో శెలవు తీసుకొంటున్నాను.

* శ్రీ జి. నాగేశ్వరరావు (రాజోలు) : అధ్యక్షా ! ఆహారసమస్యపై అనేక సార్లు చర్చ జరుగుతున్నందువల్ల మన ప్రభుత్వం ఇంతవరకు ఒక నిర్దుష్టమైన విధానాన్ని అవలంబించలేదని తెలుస్తోంది మన ఆంధ్రప్రదేశ్ లో కొన్నికొన్ని సంవత్సరాలలో కొన్నిమాసాలు కరువుగాఉండే ప్రదేశాలు, శాశ్వతంగా కరువుగావుండే ప్రాంతాలు అనేకం ఉన్నాయి. మన ఆహారమంత్రిగారు ఎప్పుడుచూసినా రైతుకు కిట్టుబాటు ధరలేదని, ఇప్పటిధరలు ఇంకా పెరగాలని చెబుతూఉంటారు. మంత్రిగారి దృష్టిలో రైతంటే 10—15 ఎకరాలకు పైబడిన పెద్దభూస్వాములు, వందలకొలది, వేలకొలది బస్తాలు నిలవచేసి ఎటామొటి రోజులలో ఎక్కువ ధరలకు అమ్మే మధ్య దళారీలూను. 5—7 ఎకరాలకు లోబడిన భూమిఉన్న చిన్నరైతులు తమ పంటలను కళ్ళాలలోనే అమ్ముకోవలసిన స్థితిలోనున్నారు. వీరు మళ్ళీ పంటలు వచ్చేముందు హెచ్చుధరలుపెట్టి కొనుక్కోవలసి వస్తోంది. మంత్రిగారి దృష్టిలో వీరుమాత్రం రైతులుకాదు. రోజుకు 4—5 అణాల కూలిమీద పనిచేసే వ్యవసాయకూలీలు మనరాష్ట్రంలో అనేకగ్రామాలలో ఉన్నారు. నెలకు రూ. 10—11 లకు రోజుకు 24 గంటలు పనిచేసే కార్మికులు ఉన్నారు. తక్కువజీతం తెచ్చుకొనే ఉద్యోగస్తులు, పేద ప్రజానీకం అనేకమంది ఉన్నారు. వీరినిగురించి మంత్రిగారు ఏనాడూ ఒక్క మాటయినా చెప్పిన పాపానపోలేదు. ఈనాటి ధరలుపెట్టి ఆహార ధాన్యాలు కొనుక్కోలేక, ఒకపూట పస్తువుండి జీవితాలను వెళ్ళబోస్తున్న పేదప్రజానీకాన్ని దృష్టిలో పెట్టుకొనేనా, ఈనాటి ధరలను ఇంకా పెంచాలని మంత్రిగారు చెబుతున్నది ? రైతుకు గిట్టుబాటుధర ఉండాలనే ఆలోచిస్తున్నారు కాని, అతను కొనుక్కొనే వస్తువులు సక్రమమైన ధరలకు లభించేటట్లు ఎందుకు చేయరు ? రైతు వాటిని Black Market లో కొనుక్కోవలసి వస్తోంది. ఈనాటి ధరలను ఇంకా పెంచదలచుకొంటే ప్రభుత్వానికి నేను ఒక్క విషయం మనవిచేయ దలచుకొన్నాను. ధరలను పెంచేముందు; సామాన్య ప్రజానీకం యొక్క ఆర్థిక స్థాయిని పెంపొందించండి. తక్కువకూలి, తక్కువ జీతాలు తెచ్చుకొనే వ్యవసాయ కూలీల, కార్మికులయొక్క కూలిరేటు వేతనాలు హెచ్చించండి. వీటిని చేయకుండా ఆహార ధాన్యాల ధరలను పెంచినచో చాలా అన్యాయం చేసినవారు అవుతారు.

ఈనాడు మన రాష్ట్రంలో ధరలు ఎక్కువగా ఉండటానికి ఒక కారణం ఉంది. మన రాష్ట్ర అవసరాలుపోను ఎంతధాన్యం మిగులు ఉంటుందో తేల్చుకో కుండా ఇతర రాష్ట్రాలకు వేలకొలదీ టన్నులు export చేయడంవల్ల ఈపరిస్థితి ఏర్పడుతోంది. ఈ హెచ్చుధరలను అరికట్టటానికి ప్రభుత్వం పంటరోజుల్లో ధాన్యాన్ని సేకరించి ప్రతి జిల్లాలోను "గోడౌన్సు"లో నిలవచేసి, సరుకు ఎటాముటీగాఉండి ధరలు పెరుగుతున్న రోజులలోను, కరువు సంభవించే ప్రాంతాలలోను చౌక డిపోలద్వారా ఆ సరుకును supply చేసి ప్రజానీకాన్ని ఆదుకోవాలి.

*ఈ ఆహార సమస్య విషయంలో ఒక నిర్దుష్టమైన policyని అవలంబించ టానికి మంత్రిగారు ఇప్పటికైనా సరైనకృషి చేస్తారని ఆశిస్తున్నాను.

శ్రీ పి. కోదండరామయ్య (పోలవరం): అధ్యక్షా! ఆహారసమస్య విషయంలో ముఖ్యంగా మనదేశంలోను, ప్రపంచంలోను అనేకసమస్యలు ఉత్పన్నమై తీవ్రమైనాయి. 1942 వ సంవత్సరం వరకు ఆహార సమస్య ప్రపంచంలో ఎక్కడాలేదు. 1942 లో కలకత్తాలోని చావులతో ఈసమస్య మనదేశంలో ప్రారంభమైంది. దీనివిషయంలో ఇదివరకటి ప్రభుత్వం శ్రద్ధతీసు కొని పనిచేసింది. ఈనాడు మన ప్రజాప్రభుత్వం ఈసమస్యా పరిష్కారానికి ఇతోధిక కృషిచేస్తోంది. ఈవిషయంపై నెహ్రూగారు ఈమధ్య U. P. లో కొన్ని సూచనలు చేశారు. ఆసూచనలపై 'Hindu' ఒక editorial ను కూడా వ్రాసింది. ఆసూచనలను మనప్రభుత్వం ముఖ్యంగాగమనిస్తుందని ఆశిస్తున్నాను. ఈసమస్యకు రెండు విషయాలున్నాయి. జనాభానుబట్టి మనంఆహారాన్ని ఉత్పత్తి చేయాలనే ఒకనూతన సిద్ధాంతాన్ని ప్రపంచంలోని పెద్దలుకొందరు చెబుతున్నారు. ఇది ఒక పెద్ద థీరీ. ఈ థీరీలో మనం ఎలాగ ఎక్కువ ఉత్పత్తిచేయడం? అయితే పంటలు ఎక్కువ పండించడానికి అవకాశంఉన్న ప్రాంతం, మేము నివసించే గోదావరి ప్రాంతం కాబట్టి అక్కడ ప్రభుత్వం కనక పూనుకొన్నట్లయితే పండించవచ్చు. ఆ గోదావరి ప్రాంతంలో, ఎక్కువ భూమి సాగులోనికి తీసికొనివచ్చి, ఎక్కువ ధాన్యాలు పండించాలంటే జలాధారలను ఎక్కువ చేయాలి. దక్షిణదేశంలో గోదావరికి మించిన నది యింకొకటి లేదు. అందుచేత ఈ గోదావరికి విప్పూరు దగ్గర ఒక ఆనకట్ట, పోలవరం దగ్గర ఒకబారేజి కట్టినట్లయితే కొన్ని లక్షల ఎకరాలను సాగులోనికి తీసుకొని రావచ్చు. ఈ రెండు కనక కట్టినట్లయితే ప్రస్తుత ఆంధ్రదేశజనాభాకు సరిపోయినంత ధాన్యాలు సులభంగా పండించవచ్చు. ప్రస్తుతం దీనిని, నిర్మించడానికి డబ్బులేదని అంటున్నారు. ప్రతిసంవత్సరం

డాలరు ఎక్చేంజికి, కట్టే దానిలో సగం, ఈ రెండు ప్రోజక్టులకు వెచ్చించి నట్లయితే, ఈ రెండుపూర్తి అయిపోతవి. వీటి నిర్మాణంవల్ల, ప్రభుత్వానికి, ధాన్యాలను దిగుమతి చేసుకోవడంవల్ల అయ్యేఖర్చు ఆదా అవుతుంది ఏజన్సీ ప్రాంతంలో ఎంతో భూమి, వ్యవసాయములోనికి రానటువంటిది ఉన్నది. ఆ ప్రాంతంలో చిన్నచిన్న నీటివనరులను ఏర్పాటు చేయడంవల్ల, మాగాణి ఇరిగేషన్‌ను కూడ ఇంకా అభివృద్ధి చేయవచ్చు. మదరాసు ప్రభుత్వంలో నాగన్న గౌడుగారు రివర్ వేలీ పంపింగు స్కీమ్సు అని పెట్టినారు. అదేవిధంగా కొండచెరువుల స్కీములు, గోదావరి పంపింగ్ స్కీము, కొవ్వాడ కాలువ లాంటి చిన్న చిన్న స్కీములను అభివృద్ధి పరచినట్లయితే, తప్పకుండా అధికాహారోత్పత్తి సాగించవచ్చు. ముఖ్యంగా ధాన్యం ఎక్కువ పండించే ప్రాంతం గాబట్టి ఈ స్కీములను అమలుపరచాలని కోరుతున్నాను. Long range Plans కూడ అవసరమే. కాని వాటి కంటె వెంటనే ఫలితాలు కనిపించేవి, మైనరు ఇరిగేషన్ స్కీములు కాబట్టి ముందు వాటికి ప్రాధాన్యం యివ్వాలని కోరుతున్నాను. ఇప్పుడు ఆహారమంత్రిగారు ప్రవేశపెట్టిన చర్చమీద నా అభిప్రాయం ఏమిటని అడగవచ్చు. ఆహారశాఖవారు అంటున్నట్లుగా పండించిన రైతుకు ధరకావలసినదే! కాని ఈ రోజున రైతుపక్షం మాట్లాడేవారు కనపడు తున్నారు. కూలీల పక్షం మాట్లాడేవారు ఉన్నారు. కాని మధ్య తరగతి ప్రజలను గురించి మాట్లాడేవారు ఎవ్వరూ లేకుండా ఉన్నారు. నిన్ననే నాకు మా ప్రాంతం నుంచి ఉత్తరం వచ్చింది. రోజుకు మూడు రూపాయలు కోతలకు కూలీ తీసుకొంటున్నారట. రు. 20 మొదలు 24 రూ॥ల వరకు బస్తా ధాన్యం అమ్ముతోంది. మా చిన్నతనంలో బీదవాళ్లకు అమెరికా వెళ్ళి చదువు కోవాలనే ఉద్దేశ్యం ఉంటే "ఏదైనా పని చేస్తే రోజుకు మూడురూపాయలు యిస్తారు, దానితో చదువుకోవచ్చు" అనేవారు. ఇప్పుడు అటువంటి కూలీ రేటులే మన ప్రాంతాలలోకూడ వచ్చాయి. ఈ ధరల పెరుగుదలతో, ఈ కూలి రేట్లుకూడ పెరిగిపోతున్నాయి. ఈ ధరవరలను వాస్తవంగా పెరిగినవి కావు. పెద్ద పెద్ద షాహుకార్లు గేంబ్లింగులో పెంచినవి తప్ప మరొకటి కాదు. ముఖ్యంగా ఈ ధరలు పెరగడంవల్ల మా ఏజన్సీ ప్రాంతంలో ఉన్న కోయలు, గిరిజనులు పడేబాధ చెప్పలేనంతగా ఉన్నది. పోలవరంలో ఒక చౌకధర డిపో పెట్టాలని మేమంతా ప్రయత్నం చేశాము దానివల్ల బీదప్రజలకు సరఫరా జరగ డం కంటె ఉన్నవాళ్లకే జరిగింది. చివరకు వాళ్ళు దానిని సాగనీయలేదు. బీదలకు క్షేమమైన ఉపకారంకలిగే పనులు చేద్దామనుకొంటే వాటిని సరిగా సాగనీయక పోవడమో లేక ఏదో అడ్డంకులు కల్గించడమో జరుగుతున్నది. అధ్యక్షా! ఈగిరి

జనుల ఆహారబాధ చాలఎక్కువగాఉన్నది. ఆవిషయమై ఇదివరలో ఒక అడ్జర్న్మెంటు మోషన్‌కూడ యిచ్చిఉన్నాను. ఎప్పుడూ మా ప్రాంతంలో అతివృష్టో, అనావృష్టోఉంటుంది. దానివల్లనే ధరవరలు పెరిగిపోవడం జరుగుతుంది. అసలు మా ప్రాంతానికి వచ్చిచూచే ప్రభువులులేరు. చేసిన, చేయకపోయిన, ఒకసారి వచ్చి చూచి ఆ బీదప్రజల కష్టసుఖాలను తెలుసుకొంటే, వారు బ్రహ్మానందపడిపోతారు. ముఖ్యంగా మా ప్రాంతానికి నేనుచెప్పిన మైనరు ఇరిగేషన్ ప్రాజక్టులను ఏర్పాటుచేసి, అక్కడపండిన ధాన్యాలను ఇతరచోట్లకు పోకుండ, తగు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నాను. ఇక ఈ ధరవరలు పెరిగిపోవడం గురించి చెప్పడానికి నేను పెద్ద వణిక్ప్రముఖుడను కాను, రైతును కాను, ఒక కాంగ్రెస్ సేవకుడుగా మా గిరిజనప్రాంతాల సమస్యలను మనవిచేశాను. ఇక ఈ భూసంస్కరణలలో మిగిలిన భూమిని, బీదలకు పంచిపెట్టేకంటె, కోపరేటివ్ పద్ధతులమీద వ్యవసాయంచేస్తేనే బాగుంటుందని నా ఉద్దేశం. అసలు డబ్బు యిచ్చేకంటె కూలీలకు, ధాన్యం, పప్పులు యిస్తే బాగుంటుందని మనవిచేస్తున్నాను. అధ్యక్షా, మాకుకూడ, జీతాలుయిచ్చే బదులు, జైయిలో యిచ్చినట్లుగా రేషన్లుయిచ్చి, రేషనింగు పెట్టిఅయిన, ఈ ఆహారసమస్యను పరిష్కరించాలని కోరుతున్నాను.

*శ్రీ బి. రత్నసభాపతి (బద్వేల్): అధ్యక్షా! ఈ ఆహారసమస్య అన్ని రాష్ట్రాలను ఒకరకంగా ఎదుర్కొంటూంటే, మనరాష్ట్రాన్ని ఇంకోవిధంగా ఎదుర్కొంటూ ఉన్నది. సామాన్యంగా అన్నిరాష్ట్రాలలోను, ఉత్పత్తిమీద సమస్య ఆధారపడి ఉన్నది. ఆరాష్ట్రాలు, ఇతర రాష్ట్రాలనుంచి, దేశాలనుంచి తెప్పించుకోవడంవల్ల అక్కడ ధరలు అధికంగా ఉండడం న్యాయమే! ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు ప్రభుత్వం యిచ్చిన లెక్కలనుబట్టి చూస్తే అధికంగా పంటలు పండడంవల్లనే ఈరేట్లు ఈవిధంగా ఉన్నట్లు తెలుస్తోంది. మనకు ఇచ్చినటువంటి స్టేటుమెంటులో రైతులకు సంబంధించినంతవరకు ధరలు తక్కువగా ఉన్నాయని పేర్కొనడం జరిగినది. ఆస్టేటుమెంటు చదివినతరువాత కూడ ప్రభుత్వం ఏమిచేయదలచుకొన్నది అనేది ఆలోచనాంశముగానే ఉండిపోయినది. మంత్రిగారు తమ ఉపన్యాసంలో మాత్రం "ఆహారసమస్యను ఎదుర్కోవడానికి, అధిక ఉత్పత్తులు చేయడానికి ప్రయత్నిస్తున్నాం" అని అన్నారు. అధికాహారోత్పత్తికి ధరలుకూడ ముఖ్యకారణమని చాలమంది పేర్కొన్నారు అసలు ఒకనిర్ణీతమైన ధరను ఏపద్ధతిమీద నిర్ణయించాలనేది ఎవరూ చెప్పలేదు, ప్రభుత్వముకూడ వివరించలేదు. ప్రభుత్వం స్టేటుమెంటులో వివరించి ఉండవలసినది ఎక్కడ clear గా లేదు. కొన్ని agitations జరగడంవల్ల, ఎవరో కొంతమంది ఆందోళనలు చేయడంవల్ల ప్రభుత్వం ఈనిర్ణయాలు చేసినట్లు

తెలుస్తోంది. ఈ ఆందోళనలను అనుసరించి, మనప్రభుత్వం కేంద్రానికి కొన్ని సిఫారసులు చేస్తున్నట్లు తెలిపారు. మిల్లర్సు, భూకామందుల ఆందోళనలవల్లనే ఈనిర్ణయాలు జరిగినట్లు తెలుస్తున్నది. అసలు ఈధరలను నిర్ణయించేటప్పుడు cost of cultivation, మిగత వ్యవహారాలు అన్నీ దృష్టిలో పెట్టుకొని, నిర్ణయించాలి.

ఈ ధరలవిషయమై ఇండియా ప్రభుత్వంవారికి కూడ ఒక ఆలోచన ఉన్నది. ఇతర రాష్ట్రాలలో ధరలు పెరిగినపుడు వినియోగదారులనుంచి ఎక్కువ ఆందోళన వస్తున్నది. ధరలు నిర్ణయం కాకపోతే సప్లై కాకపోవడం, ఇతర దేశాలనుంచి తెప్పించుకొనడం, Foreign exchange దానితో తగ్గిపోవడం, దీనితో ప్రణాళిక దెబ్బతింటుంది అనే భయం కలిగి కొన్ని నిర్ణయాలు చేస్తున్నారు. ఈ నిర్ణయాలు చేస్తున్నపుడు కొన్ని sections గురించి మంత్రిగారి statement లో కాని ఇండియాప్రభుత్వం వారి ప్రకటనలలో కాని ఏవిధమైన ప్రసక్తి లేకపోవడం చాల విచారకరమైన విషయం. కొన్ని అంకెలను ఇచ్చారు. వీటినిచూస్తే ఒకటి కనిపిస్తున్నది. ధాన్యంధర కొన్ని మాసాలలో చాల తక్కువగా ఉంటున్నది: కొన్ని మాసాలలోను చాల ఎక్కువగా ఉంటున్నది. Harvest సమయంలో ధరలు చాల తక్కువగా ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. తరువాత ప్రతినెలకు పెరుగుతుంది. సెప్టెంబరు నెలలో peak level కు చేరుతున్నది. దీనికికారణం ఏమిటో ఆలోచించాలని మంత్రి గారిని కోరుతున్నాను. ధాన్యం కటామణి కాగానే రైతుకు డబ్బుతో చాల అవసరం ఉంటుంది. పన్నులు, అప్పులబాధలు అన్నీ ఉంటాయి. ఏదో రేటుకు పండిన పంటను అమ్మడం, ప్రభుత్వానికి ఇతరులకు ఇవ్వవలసినది ఇవ్వడం, జరుగుతుంది. ఆ సమయంలో ధరలు తక్కువగా ఉంటున్నాయి. సెప్టెంబరునెల వచ్చేసరికి peak level చేరుకుంటున్నాయి. 1958 వ సంవత్సరంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో ధరకు రాబీపంట వచ్చిన తరువాత ధరకు, సెప్టెంబరు నెలలో ధరకు, చాల తేడాఉన్నది. కష్టపడి పండించే రైతుకు ధరలుపెరిగినా ఒకేమాదిరిగా ఉన్నది. తక్కువధర మాత్రమే అతనికి ముట్టుతోంది. ఉత్పత్తిదారునకు అవసరమైనపుడు ధనసహాయం సక్రమంగా జరుగకపోతే ఏ ధరలు నిర్ణయించినా అతని గతి ఒకటిగానే ఉంటుంది. ఈ సమస్యను పరిష్కారం చేయడానికి మంత్రిగారు ఏ సూచనా చేయలేదు. ధరలు మొత్తంగా తీసుకుని ధరలు తక్కువగా ఉన్నాయని ఆందోళనచేశారు. ధరలు తక్కువగా ఉంటే మిల్లర్లు ఆందోళన చేస్తారు. ఇండియా ప్రభుత్వం ఒక నిర్ణయానికి వస్తే మిల్లర్లు ఆందోళన చేస్తారు. మిల్లర్ల ఆందోళన అనే విషయం తీసివేయండి. వినియోగదారు విషయం అలా ఉంచండి. వ్యవసాయం

చేసి ఆహారధాన్యాన్ని ఉత్పత్తిచేసేవానిని గురించి ఏమి ఆలోచన చేశారని అడుగుతున్నాను. 1956 వ సంవత్సరంలో రిజర్వుబాంక్ వారు 33 కోట్ల రూపాయిలను ధాన్యం, బియ్యం వ్యాపారం చేయడానికి అప్పులు ఇచ్చారు. ఆ విధంగా వారు సౌకర్యం కలిగించడంవల్ల traders ధరలు తక్కువగా ఉన్నపుడు కొనుగోలు చేసి hoard చేసి ఆంధ్రదేశంలో ఎక్కువగా ఉత్పత్తి అయినప్పటికిని (artificial scarcity)— కృత్రిమమైన లోటును కలుగజేసి oxygen doses మాదిరి కొద్దికొద్దిగా మార్కెటులోనికి పంపి ధరలను హెచ్చు స్థాయిలో ఆపారు. మనకు ఇచ్చిన లెక్కల ప్రకారమే అర్థం అవుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ధరలు పెంచాలంటున్నారంటే ఆ హెచ్చు ధర రైతులకు ఉపయోగిస్తుందనుకుంటే పొరపాటు. అది లెక్కలను బట్టే తెలుస్తున్నది. Cost of cultivation విషయం నాకు తెలియదు. ఇండియా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటె cost of cultivation ఎక్కువ అని చెప్పారు. ఇది ఒక కారణం. నిజంగా ఇదే కారణమైతే ఖచ్చితంగా తెలుసుకుని ఇంతకంటె ఎక్కువ ధర వచ్చేటట్లు చూడడమే కాకుండా నిర్ణయించిన ధర సక్రమంగా ఉత్పత్తిచేసిన రైతుకు అందజేస్తారనే సూచన అందులో ఎక్కడాలేదు. ఇది మిల్లర్లకు సంబంధించిన స్టేటుమెంటు కాని రైతులకు సంబంధించిన స్టేటుమెంటు కాదు. మరొకచోట చెప్పారు. ఈ సంవత్సరం పంటలు అధికంగా వస్తాయని అంచనా కాబట్టి ధరలు పడిపోయే అవకాశం ఉన్నది, అందుచేత ఆందోళన కూడ ఉండదు అన్నారు. ఇదికూడ ఆలోచించవలసిన విషయమే. గత సంవత్సరంకంటె ఈ సంవత్సరం ఎక్కువగా ఉత్పత్తి అయినప్పటికినీ, ఇదివరకు లెక్కలనుబట్టి చూస్తే, అంతమాత్రంచేతనే ధరలు పడిపోతాయని అనుకోడానికి వీలులేదు. ఒకవేళ అటువంటి పరిస్థితి ఏర్పడినట్లైతే, రైతు దెబ్బతినకుండ ఉండడానికి ఏమిచేస్తున్నారు? ధరలు పెరుగకుండా కంట్రోలు చేస్తున్నారు; ధరలుపడిపోతే ఏమిచేస్తుంది రాష్ట్రప్రభుత్వం? ఈవిషయమై ఇండియాప్రభుత్వం వారికి ఏమైనా సిఫార్సులుచేశారా? దీనినిగురించి ఏమీ ఇందులో లేదు. Cost of cultivation ఎక్కువ అవుతున్నది కాబట్టి మిల్లర్లు సమ్మెచేస్తున్నారు కాబట్టి ధరను పెంచవలసిందని ఇండియాప్రభుత్వం వారిని కోరుతామని అన్నారు. Cost of cultivation అట్లాగేఉండి, అధికోత్పత్తి అవుతూ, ధరలుతగ్గిపోతే రైతుకు ఏవిధమైనసౌకర్యాలు చూపించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు? రైతులకు సంబంధించి మాట్లాడడమేకాదు, తరువాత వినియోగదారుల విషయమైకూడా ఆలోచించవలసియున్నది. ప్రభుత్వమైనా ఏరాజకీయ పక్షమైనా వినియోగదారుల గురించికూడ ఆలోచించాలి. మంత్రి గారి స్టేటుమెంటులోకాని ఉపన్యాసంలోకాని integarted గా comprehen-

sive గా ఆలోచించి ప్రభుత్వం ఒకమార్గం అనుసరిస్తున్నసూచన ఎక్కడాలేదు "వినియోగదారులు ఏమైనా మాకుఅవసరంలేదు; రైతులకు cost of cultivation ఎట్లా ఉన్నా అవసరంలేదు; పంటకాలంలో ధరలు ఎట్లా ఉన్నా అవసరం లేదు; ఉత్పత్తి తరిగినా పెరిగినా మాకు బాధలేదు" అని ఆలోచిస్తే మిల్లర్ల వ్యవహారం చూసుకోవడం ఒకటేనాపని అని అడుగుతున్నాను. నేను కొన్ని సలహాలు ఇస్తున్నాను. Vague గా ఉపన్యాసాలు చెప్పినంత మాత్రాన ఈపక్షంవారిని విమర్శచేసినంతమాత్రాన మంత్రిగారు తమ objective ను సాధించుకోలేరు. ధరలవిషయమై ఒకనిశితమైన విధానం ఉండాలి. రైతులకు వినియోగదారులకు లభ్యమయేధరలు ఎలాఉండాలో ఆలోచించాలి, నిర్ణయించినధరలు కష్టపడి పనిచేసేరైతుకు ముట్టాలి; వినియోగదారుకు నిర్ణయించినధరకు పంపకం జరగాలి. మరొకవిషయం, ఆంధ్రదేశంలో ఉత్పత్తిపెరిగినా తరిగినా ఎంతపంట పండుతున్నది సూచించేలెక్కలు ఈ స్టేటుమెంటులో లేవు, సంవత్సరం సంవత్సరం ఉత్పత్తిపెరుగుతున్నదా; తరుగుతున్నదా, అందువల్లధరలు తగ్గుతున్నాయా, పెరుగుతున్నాయా-ఈ విషయాలను తయారుచేసే statistical organization ఒకటి మనకు అవసరం. అది లేకపోవడంవల్ల, మనకున్న prejudices, pre-conceived ideas బట్టి మాట్లాడుతున్నామేగాని ఖచ్చితమైన statistical information తో మాట్లాడడంలేదు. ఇటువంటి statistics ను సమకూర్చుకుంటేనేకాని పాలసీ నిర్ణయించుకునే అవకాశం లేదు. ఇటువంటి incomprehensive policy statement వల్ల ప్రయోజనంలేదు. కాబట్టి ఒకప్రవీణులసంఘాన్ని నియమించి, వారు వ్యవసాయం, ఉత్పత్తిదారు, వినియోగదారు, ధరలు, ప్రణాళిక, పంపకం—వీటన్నింటిగురించి విచారించి ఒకవిధానాన్ని తయారు చేసుకొనడానికి వీలైన సమాచారాన్ని సేకరిస్తే బాగుంటుంది అని అటువంటికృషి నిమిత్తం ఏర్పాట్లుచేయాలని కోరుతున్నాను.

*శ్రీ పి. నరసింహప్పారావు (పాలకొండ): అధ్యక్షా, ఆహారం విషయమై యింతకుముందు తోటి సోదరులంతా మాట్లాడారు. మనకువచ్చే ఆహారమంతా ఎవరివల్ల వస్తుంది ? ప్రభుత్వం, అంతా ఎవరిమీద నిలబడుతున్నారు ? అన్నిటికీ ఆధారం రైతేనని మనవిచేస్తున్నాను. సంవత్సరంలో ప్రతిదినమూ, పంద్రెండు గంటలసేపు భార్యాబిడ్డలతో బురదలో కష్టపడి పనిచేసి పంటపండించేవాడు రైతు. ప్రభుత్వానికి అప్పుకావలసివస్తే యిచ్చేవాడు రైతు, శిస్తు కట్టేవాడు రైతు. 1940 వ సంవత్సరానికీ, యిప్పటికి రైతు చెల్లించే శిస్తులో తేడా పరిశీలించండి. ఈ 17 సంవత్సరాలలో శిస్తు మూడురెట్లు పెరిగింది. ఆ రోజులలో కూలీరేటు పావలా, అయిదణాలు ఉండేది. ఇప్పుడది మూడురూపాయల వరకు పెరిగింది. కూలీరేట్లను స్థిరత్వం చేయండి. పంటలు కోతకు వచ్చినపుడు

మూడురూపాయలైనా, నాలుగురూపాయలైనా కూలిరేటిచ్చి కోయిస్తాడు. లేకపోతే పంటలు నాశనం అవుతాయి. వరదలవల్ల నష్టపడేదికూడ రైతే. ఎంత కష్టపడి పంటపండించినా రైతుకు యేమీ లాభంవుండదు. వరదలో పొలాలు దిబ్బలువేసినా, పశువులుపోయినా రైతుకు ఇన్ష్యూరెన్సు సదుపాయం. ఏర్పాటుచేయాలని కోరుతున్నాను. ధాన్యంధరలు నిర్ణయంచేయడం మంచిదే. కాని రైతులకు కావలసిన సదుపాయాలుకూడ కల్పించండి. కమ్ములు ఏ రేటుకి యిస్తున్నారు? రైతుకు కావలసిన ఎరువులు 35 రూపాయలకు ఇస్తున్న దానిని పదిరూపాయలు తగ్గించి 25 రూపాయలకు యిప్పించండి. హెచ్చుధర లకు ఎరువులుకొని పండించిన పంటకు తక్కువధర నిర్ణయించడం న్యాయం కాదు. రైతుకు కావలసిన సదుపాయాలు చేయండి విత్తనాలు చౌకగా యిప్పించండి. అప్పులు తక్కువ వడ్డీరేటుమీద యివ్వండి. తరువాత Food Committees వేస్తామని చెప్పారు. 1950 వ సంవత్సరంలో వేసిన కమిటీల సంగతి గుర్తుకు తెస్తున్నాను. Food Committees వేసినా Sugar Committees వేసినా లంచగొండితనం హెచ్చుఅయిపోతుందేగాని ప్రజలకు చౌకగా ధాన్యం రాదు. ప్రభుత్వ తాబేదారులు లాభాలు గడించడమే జరుగుతుంది. ప్రజలకు వేళప్రొద్దున యింటిదగ్గర తిండిదొరకదు. పాతచరిత్ర జ్ఞాపకం చేసుకోవాలి అన్నిపార్టీలతో కూడిన కమిటీలు వేయాలనుకోవచ్చు, కమిటీలు ఎంతమాత్రం వేయడానికి వీలులేదు. ఆహారం procurement చేయడానికి వీలులేదు. ధర లను స్థిరంచేయండి; స్థిరంచేసి అమ్మించండి; గ్రామంనుంచి గ్రామానికీ తాలూకా నుండి బయటికీ వెళ్ళడానికి వీలులేకుండా చేయండి. అంతేకాని procurement చేసేపద్ధతి అయితే ప్రభుత్వంలో అరాచకం ప్రబలి, లంచగొండితనం హెచ్చయి దొంగతనాలు జాస్తి అవుతాయని మనవిచేస్తున్నాను.

*శ్రీ కె. అప్పారావు (కైకలూరు): అధ్యక్షా, ఆహారోత్పత్తి అధికముగా చేయడం విషయంలో మన ప్రభుత్వం గణనీయమైన, ప్రశంసాపాత్రమైన కృషి చేస్తున్నదనడానికి యెట్టి సందేహము లేదు. అందులో మన ముఖ్యమంత్రిగారు యిదివరకు P. W. D. మంత్రిగావుండి అనుభవం గడించిరి. ఆ కారణంచేత నదీజలాలను వృథాగా సముద్రములోకి పోనీయకుండా ఎక్కడికక్కడే దానిని అరికట్టి, సాగులోకి భూములన్నీ తీసుకొచ్చి అధికంగా నీరు సరఫరాచేసి ఉత్పత్తిని పెంచడానికి చేస్తున్న కృషి చాల ప్రశంసనీయమైనది. నాకు సంబం ధించిన జిల్లాలో బుడమేరు వరదలవల్ల బ్రహ్మాండమైన నష్టం యెన్నో సంవత్స రాలనుండి అనుభవిస్తున్నారు. అట్టి బుడమేరు వరదలను అరికట్టడానికి కృష్ణలో నీరు వృథాకాకుండా రెగ్యులేటరును కట్టడం విషయంలోగాని, నా ప్రాంతంలో ఉప్పుటేరును widen చేయడానికి స్కీము మంజూరుచేసి పని ప్రారంభించడంలో

గాని, కొల్లేరు స్కీమును అమలుపరచడంలోగాని గణనీయమైన కృషి చేస్తూనే వున్నారు. అది నగ్నసత్యం. దానిని కాదనడానికి వీలులేదు. మన ఆహారశాఖామంత్రి శ్రీ తిమ్మారెడ్డిగారు రైతుపక్షపాతి అని అందరికీ తెలిసిన విషయమే. అయితే కొంతమంది యేదో పెద్దరైతుల పక్షపాతి అనీ, చిన్న రైతుల పక్షపాతి కాదనీ, విమర్శ లేవదీస్తున్నారు. దానిలో అర్థం యేమీలేదు. వారు చిన్న రైతుల పక్షపాతి కాదని కాని పెద్ద రైతుల పక్షపాతి అనికాని వారి ఉపన్యాసములలో కనపడడంలేదు. ఆహారఉత్పత్తిని అధికముగా సాధించడానికి నీటిపారుదల సౌకర్యములతోపాటు drainage సౌకర్యాలుకూడ కలుగజేయడం చాల అవసరమని అనేక పర్యాయములు చెప్పివున్నాను. మా ప్రాంతంలో పుల్లవ drain పూడి 30-40 సంవత్సరాలనుంచి remission యిస్తున్నారని ముఖ్య మంత్రిగారికి విజ్ఞప్తిచేస్తే క్రిందటి సంవత్సరం ఆ drain త్రవ్వించారు. ఈనాడు ఒక ఎకరానికికూడ remission యివ్వనక్కర లేకుండ పుష్కలమైన పంట పండింది. ఈ సంవత్సరం వరదలు వచ్చినప్పటికి రెండవపంట ఊడ్చడానికి వీలైనది అలాగే ఇతరప్రాంతాలలోకూడ నీటిపారుదల సౌకర్యములతోపాటు drainage సౌకర్యములు కలుగజేస్తే ఆహారోత్పత్తి అధికంగా ఉండడంలో ఎట్టి సందేహమూ లేదు. ఇది అనుభవంలోనుండి చెప్పినసత్యము. రైతుల గోడును గురించి శ్రీ తిమ్మారెడ్డిగారు యెప్పుడూ చెబుతున్నంతమాత్రాన కూలీలను విస్మరించారనడానికి వీలులేదు. వ్యవసాయ కూలీకి గిట్టే వేతనాలు యీనాడు పది యెకరాలున్న రైతుకు గిట్టడంలేదు. కూలీ కుటుంబంలో ప్రతివారు సంపాదిస్తున్న కూలీ అయినా రైతుకు గిట్టడంలేదు. ధరలవిషయం మన చేతిలో లేదు. కేంద్ర ప్రభుత్వం చేతిలోవున్నది. ఆహార ఉత్పత్తిని అధికం చేసినతరువాత మార్కెటింగ్ సౌకర్యాలు తక్కువగావున్నాయి. Consumers విషయమై అనేకమంది చెప్పారు. వాస్తవమే. Consumers గురించి ఆలోచించవలసినదే. అయితే ఉత్పత్తిచేసే రైతు, దేశానికి వెన్నెముక అనబడే రైతు గోడు విని వానికి సరియైన ఏర్పాటు చేయాలి. మంత్రిగారు దానికి ఎంతకృషిచేస్తున్నారో, దానిగురించి విమర్శలకుకూడా ఎట్లు గురి అవుతున్నారో నాకు తెలుసును. అది నిర్వివాదాంశము. రైతు కొనవలసిన పనిముట్ల ధరలు చాల హెచ్చుగా వున్నాయి. విత్తనాల ధరలు కూడ అధికంగావున్నాయి. రైతుకు కావలసిన ఎరువుల ధరలు జాస్తీగా వున్నాయి. రైతు ఏది కొనవలసి వచ్చినా విపరీతమైన ధరలు పెట్టవలసివస్తున్నది. ఈ పరిస్థితులలో అతని గోడు పరిగణించి, పంటధాన్యానికి హెచ్చు ధరలు యిప్పించాలని కేంద్రప్రభుత్వానికి శాయశక్తులా చెప్పిన మంత్రిగారి కృషిలో యేమీ లోపంలేదని సోదర సభ్యులకు మనవిచేస్తున్నాను.

ముఖ్యముగా మా జిల్లాలో కాంబెల్ కెనాల్ అభివృద్ధికి 12 లక్షల రూపాయిల పథకమొకటి ప్రభుత్వమువారు తయారుచేసినారు. దానిని వెంటనే అమలుజరుపుకుంటే పుష్కలముగా రెండవపంటకు ఎల్లకాలము నీరు లభ్యమవుతుంది. ఆ విధముగానే పండినపంటకు marketing సౌకర్యములు కలిగించడానికి మంత్రిగారు తగుశ్రద్ధ వహించవలసినదిగా కోరుతూ తమరు ఈ అవకాశము చాలకాలానికి ఒసగినందుకు మీకు కృతజ్ఞత తెలుపుకుంటూ ఇంతటితో విరమిస్తున్నాను.

* శ్రీ పి. సుందరయ్య : అధ్యక్షా, మనవ్యవసాయశాఖా మంత్రిగారు మనముందు పెట్టిన ఈ statement ఆహారసమస్య పరిష్కారానికి ఏమాత్రము తోడ్పడదు. ఇది కేవలము భూస్వాములు, పెద్దవ్యాపారస్థులయొక్క లాభాలను వీక్షించే manifesto తప్ప ఆహారసమస్యా పరిష్కారానికి ఏ మంత్రివర్గము తీసుకొనవలసిన చర్యకాదు. అందుచేత శ్రీ తిమ్మారెడ్డిగారిని ఆహార మంత్రి లేక వ్యవసాయశాఖామంత్రి అనడానికి బదులు భూస్వాములమంత్రి అంటే సార్థకముగా వుంటుందని చెప్పకతప్పదు.

* మిస్టర్ స్పీకర్ : సభలో titles యివ్వడానికి మీకు హక్కు వున్నదా?

శ్రీ పి. సుందరయ్య : హక్కువున్నది. ఇది title కాదు. అసెంబ్లీ అయితే ఓటింగు పెట్టాలి. గాని నేను వ్యక్తిగతముగా ఈ నామధేయము వారికి పెట్టుతున్నాను. వారు ఈ రోజున మనరాష్ట్రములో వున్న ఆహార సమస్యను ఏవిధముగా పరిష్కరించాలి అనే విషయమును ఆలోచించకుండా మిల్లు యజమానులు చేసిన సమ్మె సక్రమమైనదనీ, కేంద్రప్రభుత్వం నిర్ణయించి వారికి ఇచ్చినధర చాల తక్కువగా వుంది కాబట్టి సమ్మెచేయక తప్పిందికాదనీ చెప్పుతూ వున్నారు. అసలు రైతుకు ధర ఎందుచేత గిట్టుబాటు కాలేదో వారు లెక్కలు వేసి చూపినారు. నాకు కూడ వ్యవసాయమంటే కొత్తకాదు. కేంద్రప్రభుత్వము యిస్తున్న ధర, ఈ రోజున రైతుకు పంట పండించడానికి అయ్యే ఖర్చులు కంటె తక్కువగా వుందని లెక్కలు యిచ్చారు. మంత్రిగారు యిచ్చిన లెక్కలు కంటె పొరపాటు లెక్కలు ప్రపంచములో మరెక్కడా దొరకవు. భూస్వాముల ప్రతినిధిగా ఇంత బాహాటముగా లెక్కలు పెట్టారా అని నాకు అనుమానంగా వుంది. వారికి వ్యవసాయములో అనుభవము వుంది. నాకు కూడ వుంది. అందుచేత నేనుకూడ వ్యవసాయానికి అయ్యేఖర్చును లెక్క వేసేశాను. భూసంస్కరణల కమిటీ గ్రామగ్రామానికి తిరిగినప్పుడు కొంత వరకు నేను చెప్పే లెక్కతే ఋజువు అయింది. వారిచ్చిన లెక్కలకు నాలెక్కకు ఎంత భేదమున్నదో

మీరే తెలుసుకుంటారు. వారు భూస్వాముల ప్రతినిధి నేను కష్టపడి పనిచేసే మధ్య తరగతి ప్రజానీకము, రైతాంగము, రైతుల ప్రతినిధిగా చెబుతున్నాను. 5 ఎకరములు నుంచి 10 ఎకరములు వరకు మంచి మాగాణీ భూమివున్న రైతు, ధనిక రైతుక్రింద నిర్వచనము చెప్పుకొనవచ్చును. ఈ రైతు కుటుంబంలో ఎవ్వరయినా పొలమునకు వెళ్ళి పని చేస్తున్నారా అంటే సాధారణముగా లేదు అనే చెప్పుకోవలసి వుంటుంది. 10 ఎకరములు మాగాణీ ఉన్న కుటుంబములను భూస్వాములుగా పరిగణించి ఈ లోపున ఉన్నవారిని రైతు అని నిర్వచించుకుని, ఈ రైతుకు గిట్టుబాటు అవుతుందా లేదా అన్న విషయము ఆలోచించుదాము. వ్యవసాయము అంటే విత్తనము వేసిన దగ్గరనుంచి, పంట నూర్చి, యింటికి తెచ్చుకొనేవరకు ఖర్చులు వుంటాయి. సాధారణముగా ఎకరమునకు 3 దుక్కులు దున్నవలసివుంటుంది. ఆ విధముగా 10 ఎకరములు భూమిని ఒక వ్యక్తి 10 సంవత్సరములవరకు ఒక కాడి మంచి ఎద్దులు జతతోను, బండితోను వ్యవసాయము చేయడానికి సాధ్యపడుతుంది. ఒక కాడి ఎద్దులు మంచిరకమునకు చెందినవి ఒక రోజులో ఒక ఎకరము ఒకపర్యాయము చొప్పున దున్నగలవు. మూడు పర్యాయములు దున్నడానికి మూడు రోజులు పని వుంటుంది. ఈ మూడు రోజులకు 3 గురు కూలీలు కావాలి. గట్ల మరమ్మత్తు 2 రోజులు అవుతుంది. దానికి యిద్దరు కూలీలు కావాలి. ఈ అయిదుగురు కూలీలకు ఒక్కొక్కరికి రోజుకు 1-8-0 చొప్పున 10 ఎకరములు భూమికి రు. 75 లు అవుతుంది. అంటే ఎకరమునకు 7-8-0 లు కంటె ఎక్కువ కాదు. గాని వారి లెక్కలో ఎకరమునకు రు. 40-0-0 preparatory cultivation ఖర్చుక్రింద వేసినారు. కాని నా లెఖ్కకు రు. 7-8-0 లు మాత్రమే వచ్చింది. తరువాత విత్తనములు జల్లడానికి నాటు వేయడానికి వారు ఎకరమునకు 27 రూపాయలు లెక్క వేసినారు. నారుకు అయ్యే ఖర్చును లెక్కలోనికి తీసుకొనకుండా, నారు తీయడానికి, పొలములో నాటువేయడానికి ఎకరమునకు ఏడుగురు లేక 8 మంది కూలీలు కావాలి. ముగ్గురు కలుపుతీయడానికి కావాలి, మొత్తము పదిమంది కావాలి. సాధారణముగా కలుపుకు 1-0-0 లేక 0-12-0 కంటె ఒక మనిషికి కూలి యివ్వరు. ఊడ్పుకు ఒక్కొక్క మనిషికి 1-8-0 కంటె మించి యివ్వరు. ఈ లెక్కలో 10 మందికి ఒక ఎకరమునకు నాటువేసి కలుపుతీయడానికి రు. 12-8-0 లు చొ. పది ఎకరములకు 125 రూపాయలు కంటె ఎక్కువ ఖర్చు కాదు. కాని వారి లెక్కలో ఎకరమునకు 27 రూపాయలు వేసినారు. నా లెక్కలో 12-8-0 మాత్రము వచ్చింది. ఇక ఎరువు లకు వారు 67-8-0 ఎకరమునకు అవుతుంది అన్నారు. కొన్ని జిల్లాలలో

రు. 55 లు చొ. వేసినారు. నేనుకూడా 55 రూపాయలే వేసినాను. పైరుకు పశువుల ఎరువు కాకుండా రసాయనిక ఎరువులకే నేను 55 రూపాయలు కేటాయించాను. ఊడ్పులు అయిన తరువాత ఖర్చులక్రింద వారు ఎకరమునకు 17-8-0 చొ. వేసినారు. గాని నీరు పెట్టడానికి యింకా చిన్న చిన్న పనులు చేయడానికి ఎకరమునకు 2-8-0 కంటె ఎక్కువ కాదని నావాదన. ప్రభుత్వము వారి దయవల్ల పన్నులు (betterment levy కాకుండా) ఎకరమునకు 15 రూపాయలు వున్నవి. కొన్ని స్థలాలలో ఎక్కువ వుండవచ్చు Harvesting, thrashing, winnowing, carting మొదలగు వాటికి వారు ఎకరమునకు 40 రూపాయలు లెక్క వేసినారు. నా లెక్క ప్రకారము ఎకరమునకు 7 లేక 8 మంది కోతకోయగలరనీ, ముగ్గురు కట్టవేస్తారనీ, కుప్పనూర్చి, యింటికి చేర్చడానికి నలుగురు సరిపోతారనీ, వీరందరినీ మొత్తం చూచుకుంటే ఎకరమునకు 15 మంది కూలీలకు, ఒక్కొక్కరికి (మామూలుగా 1-4-0 లేక 1-8-0 కంటె ఎక్కువ యివ్వరు) రు. 2 లు చొ॥ లెక్క వేసుకున్నా రు. 30 లు కంటె అధికముకాదు. ఇక విత్తనములు జల్లినతరువాత నీరు పెట్టడానికి, (బావిక్రింద వ్యవసాయము మినహాయించి) మొత్తము ముగ్గురుకంటె ఎక్కువ అవసరము లేదు. ఒక్కొక్కరికి రు. 1-8-0 చొ॥న ఎకరమునకు రు. 5-0-0 కంటె అధికముకాదు. మొత్తం యీ ఖర్చులన్నీ కలిపి ఎకరమునకు సంవత్సరమునకు 55 రూపాయలకు మించి కాదు. పది ఎకరములు వ్యవసాయానికి బండి, యితర వ్యవసాయ పనిముట్లకు పది సంవత్సరములకు రు. 750 లు వేసినాను. అంటే పది ఎకరములకు 7.8.0 లేక 10 రూపాయలకంటె మించలేదు. ఈ లోపుగా అవిపోతే పిరాయించుకోవచ్చును. అవి లెక్కలోనికి తీసుకొనలేదు. బస్తాగింజలతో కలుపుకొని ఎకరమునకు 10 రూపాయలకంటె ఎక్కువ కాదు. అదేవిధంగా ఒక కాడి ఎడ్లు మంచివి 1,000 రూపాయలకు కొంటే, ఆ జత ఎడ్లు 10 సంవత్సరములవరకు 10 ఎకరముల వ్యవసాయము చేయడానికి పనికివస్తాయి. సంవత్సరమునకు 10 ఎకరములకు 100 రూపాయలు చొ॥న ఎకరమునకు 10 రూపాయలకంటె ఎక్కువకాదు. ఎరువులు ఎకరమునకు 55 రూపాయలని యిదివరకే చెప్పినాను ఇవన్నీ లెక్కవేస్తే మొత్తము 125 రూపాయలకు మించి ఎకరము వ్యవసాయము చేయడానికి ఎక్కువకాదు. గాని 10 ఎకరములు కంటె తక్కువ వున్న రైతు కుటుంబాలలో సాధారణముగా పురుషులు సంవత్సరము పొడుగునా దున్నడము, ఎరువులుతోలడము మొదలగునవి చేస్తారు. వారు సంవత్సరములో 365 రోజులలో 100 లేక 125 రోజులు మాత్రమే పనిచేసి మిగతారోజులు supervision క్రింద తీసుకున్నప్పుడు, ఆవాసి తగ్గించినట్లయితే

యింకా మామూలుగా నేను వేసిన లెక్కకంటె తక్కువ అవుతుందిగాని ఎక్కువ కానవసరములేదు. ఏవిధముగా అయినాసరే నా లెక్కలో ఎకరమునకు 125 రూపాయలకు మించి ఖర్చుకాదు.

మంచిమాగాణిలో ఎకరానికి 15 బస్తాలు పండినా బస్తా 20 రూపాయల చొప్పున 300 రూపాయలు వస్తుంది. పొలములో రెండుపంటలు వేసినా అది పై ఖర్చుక్రింద లెక్క వేసుకోవచ్చు. రెండు గేదెలువుంటే అవి 4 శేర్లు పాలు యిస్తే వాటిని బజారులో అమ్ముకొంటాడు. నెయ్యి తయారుచేసుకొంటాడు. దానివల్ల 75రు. వచ్చే అవకాశంవుంది. మొత్తం 375 రు॥ అవుతుంది. ఎంతఉదారంగా చేసుకొన్నా మూడోవంతుకన్నా ఎక్కువ ఖర్చుకాదు. ఖర్చు 125 రు॥లు అయినా అతనికి 250 గిట్టుబాటు అవుతుంది. ఆంధ్ర ప్రదేశ్‌లో 5–10 ఎకరాల మధ్యగల కుటుంబాలు 4 లక్షలు వున్నాయి. 10–20 ఎకరాలమధ్యగల కుటుంబాలు ఒకలక్షా 60 వేలువున్నాయి. 20 ఎకరాలు దాటినవారు 80 వేలమంది వున్నారు. ఖర్చులకు భోజనాలకు పోను మిగిలినధాన్యాన్ని బస్తా 20 రు॥ చొప్పున ఇచ్చి ప్రొక్యూర్ చేస్తే నష్టంరాదు. 1,27,00,000 స్టాండర్డ్ ఎకరాలువుంటే దానిలో 40%- 52 లక్షల ఎకరాలు 10 ఎకరాలు దాటినవారివద్ద వుంది. అంటే మొత్తం పండిన పంటలో 40 పాళ్ళు ప్రభుత్వము సేకరించి ఖర్చులు వేసుకొని అమ్మినా ఆహారసమస్యను పరిష్కరించటానికి వీలుంటుంది. అప్పుడు గ్రామసీమల లోని వ్యవసాయ కార్మికులకు, పేదరైతులకు పట్టణాలలోని అన్నిరకాల ప్రజానీకానికి న్యాయమైన ధరకు అమ్మటానికి వీలుంటుంది. భూమిపై పనిచేయకుండా, సోమరితనంగా పెత్తనంచేసే భూస్వాములనుండి ధాన్యం సేక రించి పట్టణాలకు పంపితే బీదప్రజానీకానికి కావలసినధాన్యం లభిస్తుంది. మామూలు బియ్యమును 15 రూ. చొప్పున ప్రొక్యూర్ చేసినా రూపాయికి కొలతలో 2 శేర్లు, తూకములో 2½ శేర్ల చొప్పున అమ్మటానికి వీలుంటుంది. కాని ప్రభుత్వం భూస్వాములనుండి మిల్లుయజమానులనుండి ధాన్యాన్ని సేక రించటానికి నిరాకరిస్తూ వారికి ధరగిట్టుబాటు కాదనిచెప్పటం జరుగుతోంది. కేరళప్రభుత్వం 18–0–0 కు అమ్ముతోంది. కనీసం ఆధరకైనా ప్రభుత్వం సేకరించటానికి పూనుకోవాలి. ఆంధ్రప్రదేశ్‌లో భూమిలేని వ్యవసాయ కార్మి కులు 27 లక్షల కుటుంబాలుగా వున్నారు. ఒకటి రెండు ఎకరాలుగల కుటుం బాలు 12 లక్షలు వున్నవి. పట్టణాలలో 12 లక్షలు కుటుంబాలు వున్నవి. 2½ లక్షల భూస్వామ్య కుటుంబాలకోసం 60 లక్షల కుటుంబాలను మన భూస్వామ్యమంత్రిగారు మలమల మాడుస్తున్నారు. అందుచేత ఆహారధాన్యా లను కంట్రోలుచేసి గిట్టుబాటు ధర ఇవ్వమని కోరుతున్నాను. మాసూళ్ళలో

ధరపడిపోకుండా గ్యారంటిఇవ్వటానికి ప్రభుత్వం సిద్ధంకావటంలేదు. సెప్టెంబరు, అక్టోబరు నెలలలో విపరీతంగా అమ్ముకొనే దానిని మాన్పించాలి. 10 ఎకరాల కంటే అదనంగా వున్నవారినుండి బస్తాను 10-0-0 చొప్పున కొని, అవసర మైనచోట్ల చౌకడిపోలనుపెట్టి తూకంఅయితే 1-0-0 కి 2½ శేర్లు, కొలతఅయితే 1-0-0 కి 2 శేర్ల చొప్పున అమ్మించాలి.

శ్రీ పి. ఎన్. అప్పారావుగారు మాట్లాడుతూ ప్రొక్యూర్ మెంట్‌చేస్తే అరాచకం వస్తుందని చెప్పారు. ఆ భయంతో వెనక్కువెళ్ళి 2½ లక్షల కుటుంబా లను ఎదుర్కోటానికి భయపడితే 60 లక్షల కుటుంబాలు మలమలమాడిపోవలసి వస్తుందనే సంగతి వారు గుర్తుంచుకొంటే బాగుంటుంది. ధరలను కంట్రోలు చేయాలంటే ఒక్క ధాన్యంధరలనేగాక ప్రజలకవసరమైన వస్తువులన్నీ ఎరు వులు, గుడ్డలు, ఇనుము అన్నిటికి ఇంటిగ్రేటెడ్ ధరలనుపెట్టి కంట్రోలు చేయాలి. ఒక్క భూస్వాములవద్దవున్న ధాన్యాన్నే కంట్రోలు చేయమని చెప్పటం పొరబాటు ప్రజలకు, రైతులకు, కార్మికులకు అవసరమైన అన్ని వస్తువులను కంట్రోలు చేయాలి. అతనికివచ్చే ఆదాయములో 60-80% ఆహా రము కోసమే ఖర్చుపెడితే మిగిలిన 40-20% ను ఇతర జీవితావసర వస్తువుల కోసం ఖర్చుచేసుకోవలసి వుంటుంది. 'మేము అధికారములోవున్నాము. మాకు మెజారిటివుంది. మాది భూస్వాములరాజ్యం. అందుచేత మేము భూస్వాముల కోసమే పనిచేస్తాము' అని సరిగ్గా ఈమాటలలో చెప్పకపోయినా దాదాపు అదేభావాన్ని తిమ్మారెడ్డిగారు వెలిబుచ్చారు. వారి ఆ అభిప్రాయాన్ని విని కాంగ్రెసులో చాలమంది, బైటప్రజలు, సభలోని సభ్యులు వారు భూస్వాముల ప్రతినిధి అని అనుకొంటున్నారు.

వారైతే కావచ్చు. ప్రభుత్వంకూడ భూస్వాముల ప్రభుత్వము అని చెప్ప వలసివస్తుంది. అందువల్ల చివరికి ఒక విషయం చెబుతున్నాను. వారి కాంగ్రెసు పార్టీకి చెందిన కల్లూరు సుబ్బారావుగారుకూడ చెప్పారు. వారు చాలకాలం నుంచి దేశంకోసం సేవ చేసినటువంటివారు. వారు నాకన్న చక్కని తెలుగు భాషలో మాట్లాడగలరు. ఎంతో శక్తియుతంగా హృదయ ఆవేదనతో చెప్పారు. ఆహార ధాన్యం ధరలు కంట్రోలుచేసి, ఒకటి రెండు కోట్లు ప్రభుత్వమునకు నష్టమువచ్చినాసరే, సబ్సిడీ ఇచ్చినాసరే రూపాయకు కొలత రెండుశేర్లు చొప్పున ప్రభుత్వ ఉద్యోగులకేకాదు, పట్టణప్రజానీకానికి, గ్రామ ప్రజానీకానికి అందజేసే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని వారు ఎంతో ఆవేదన పడుతూ చెప్పిన దానిని నేను బలపరుస్తున్నాను. ఈ ఆహార సమస్యను పరిష్కరించక పోతే వీరికి భవిష్యత్తులేదు. ప్రభుత్వం వేసుకొన్న ప్రణాళికలకు విలువలేదు. N. G. O. లకు ఈరోజున 4 కోట్లు రూపాయల వరకు ఎక్కువచేసినా చాలదని

అనేకమంది అంటున్నారు. నిజానికి ఈరోజు లెక్కల ప్రకారము చూస్తే చాలదు. మామూలు కార్మికుడు, బంట్రోతు ఈ రోజు ధరల ప్రకారం రెండు పూటలా తన బిడ్డలతో బ్రతకాలంటే నెలకు రు. 90 లు కావాలి. మధ్య తరగతి కుటుంబమునకు రు. 150 లు కావాలి. ఇది ప్రభుత్వ లెక్కలే ఒప్పుకొంటున్నాయి. ఈ ప్రకారం యివ్వడానికి యీ ప్రభుత్వ డబ్బుతో సాధ్యంకాదు. కేంద్రప్రభుత్వం యిస్తుందా లేదా అనేది వేరేసంగతి. కాని మూడింట రెండు వంతులైనా అనగా రు. 90 లు యివ్వవలసిన వారికి రు. 60 లు, రు. 150లు యివ్వవలసిన వారికి రు. 90లు కంటే ఎక్కువ యివ్వలేని పరిస్థితిలో మనం ఉన్నప్పుడు కనీసం ఈ ధరలైనా పెరగకుండా చూడాలి. హైదరాబాదులో రూపాయికి శేరుంబావు శేరున్నర చొప్పున అమ్ముతున్నారు. అలా కాకుండా కొలత అయితే రూపాయకు రెండుశేర్లు, తూకమయితే రెండున్నరశేర్లు అమ్మేటట్లుచేస్తే ప్రజానీకానికి ఎక్కువ కష్టంఉండదు, రైతుకు నష్టంఉండదు. భూస్వామికి నష్టమువస్తే వస్తుంది. ఈ రీతిగా చేయుటకు ప్రభుత్వం తయారు కావాలి. ప్రొక్యూర్ మెంటు చేయాలి. ధరలు గ్యారంటీ చేయాలి. అవసరమయితే యితర వస్తువులమీదకూడ కంట్రోలుపెట్టి కేంద్రప్రభుత్వముతో దెబ్బలాడి ఈ సమస్యను పరిష్కారం చేయాలి. అందుకు అన్ని పార్టీల సహకారం ఉంటుంది. కాని అన్ని పార్టీలతో కలసిన కమిటీలుపెట్టి యిది చేయదలచుకొనలేదని తిమ్మారెడ్డిగారు అన్నారు. ఇక్కడ శాసనసభలో ఘర్షణపడుతున్నాము, ఇంకా ఆహార కమిటీలలోకూడ కుస్తీపట్లు ఎందుకు అన్నారు. అందరి సహకారము కావాలంటే అన్ని పార్టీలవారితో కూడిన కమిటీ ఉంటే సాధ్యమవుతుందిగాని అది లేకుండ మాదారి మాది అంటే నెహ్రూగారు చెప్పిన ఆహార కమిటీలు నిరుపయోగమవుతాయి. ఆ దృక్పథం మారనంతకాలం తిమ్మారెడ్డిగారి యిష్టంవచ్చినట్లు పరిష్కారం చేస్తామంటే ఆహారసమస్య పరిష్కారంకాదు. అందుచేత వారి దృక్పథం మార్చుకోవాలి. ఆహార సమస్యా పరిష్కారానికి ఈ రీతిగా చేయుటతప్ప యింకొక మార్గము లేదని చెబుతూ ముగిస్తున్నాను.

*** వ్యవసాయశాఖామాత్రులు (శ్రీ పి. తిమ్మారెడ్డి)** : అధ్యక్షా, ఇంతవరకు 16 మంది గౌరవసభ్యులు ఈ చర్చలో పాల్గొని సలహాలుయిచ్చారు. ఈ చర్చల వలన నేను కొంత లాభపడినానని చెప్పకతప్పదు. ప్రతిపక్ష నుంచి నాయకులు సుందరయ్యగారు, రత్నసభాపతిగారు చేసిన ఉపన్యాసాలు చాల బాగున్నవి. మరీ సంతోషవిషయం ఏమంటే — భూస్వాములమంత్రి అని సుందరయ్యగారు నాకిచ్చిన టైటిలు.

**శ్రీ పి. సుందరయ్య** : టైటిలు కాదు, నామధేయం.

శ్రీ పి. తిమ్మారెడ్డి : నామధేయమే కావచ్చు. సుందరయ్యగారు మంత్రి అయితే, స్వాములమంత్రి అవుతారు. భూస్వాములు, స్వాములు అని రెండు రకాలుంటారు. భూములు ఉన్నవారు భూస్వాములక్రిందకు, లేనివారు స్వాములక్రిందకు వస్తారు. నేను ఈదినం భూస్వాములకు మంత్రినయితే, సుందరయ్యగారు మంత్రిఅయేపరిస్థితి వచ్చినప్పుడు స్వాములకు మంత్రి కావలసి వస్తుంది. ఎందుకంటే వారి దృక్పథంలో స్వంతంగా భూమిఉండటమనేది లేదు. మాదృక్పథంలో స్వంత భూమి అనేది 1 ఎకరం కావచ్చు, 10 ఎకరాలు కావచ్చు, వారునాకు ఆపాదించినట్లు వెయ్యి ఎకరాలు కావచ్చు. భూమి ఉండాలనేది మాఉద్దేశం. అందువల్ల వారుయిచ్చిన నామధేయానికి సంతోషం.

* శ్రీ పి. సుందరయ్య : మాపార్టీ కార్యక్రమంలో భూమిని పేద ప్రజలకు, భూమిని చేసుకొనే వారిపేరనే వ్రాయాలి. భూమిచేయని వారిపేర, భూమి ఉండకూడదని మాపార్టీ కార్యక్రమం.

శ్రీ పి. తిమ్మారెడ్డి : అది అధికారానికి వచ్చేవరకు. అధికారానికి వచ్చిన తరువాత భూమి అంతా ప్రభుత్వానిదే.

శ్రీ పి. సుందరయ్య : అంతా వారిదే (చేసుకొనే ప్రజలది).

శ్రీ పి. తిమ్మారెడ్డి : భూమి, దేశం, ప్రజలది కాదు. కమ్యూనిస్టుపార్టీది. ప్రజల సంపత్తు, దేశం, అధికారం సర్వమూ కమ్యూనిస్టుపార్టీదే. వెయ్యి రూపాయల ఎద్దులకంటె, రెండువేలరూపాయల ఎద్దుల మాదిరి చక్కగా ప్రజలను పోషణచేసి ఉంచుకోవచ్చు. అంతకంటే భేదముఉండదు. కమ్యూనిస్టు పార్టీకే ప్రమేయంగా ఉంటుంది.

శ్రీ పి. సుందరయ్య : అది కాంగ్రెసు రాజ్యములో జరుగుతున్నపని. కమ్యూనిస్టు రాజ్యములో జరుగదు.

శ్రీ పి. తిమ్మారెడ్డి : చూస్తే తెలుస్తుంది—ఏదేశంలో జరిగేదీ.

మిస్టర్ స్పీకర్ : అసలు విషయానికిరండి.

శ్రీ పి. సుందరయ్య : కనబడుతూనే ఉన్నది–ఏదేశములో ఏపని జరుగుతున్నదీ.

*శ్రీ పి. తిమ్మారెడ్డి : అధ్యక్షా, ప్రతిపక్షనాయకులు చివరికి కల్లూరి సుబ్బారావుగారి ఉపన్యాసమును బలపరచినందుకు సంతోషం. దేశంలో కొంత మందికి కూడులేకుండా చేయాలనిగాని అత్యవసరమైన తిండిధరలు పెరిగి పోవాలనిగాని, కోరేవారు ఎవరూలేరు. కొంతమంది విమర్శఅని చెప్పవచ్చు.

It is criticism as well as compliment. దానికి సంబంధించినవారిని అడిగితే తెలుస్తుంది — దేశంలో వ్యవసాయమంత్రి రైతులకు కీడుకోరేవాడా, మేలుకోరేవాడా అని వ్యవసాయానికి సంబంధించినవారిని అడగాలి. కొంత మంది అన్నారు— "You are not a Minister for agriculture but you are a Minister for agriculturists." — ఇటువంటి విమర్శలు వస్తూంటాయి. కాదనుటకులేదు. నేను గిట్టుబాటుధర కావాలంటే, అది ఒక బస్తా పండించి అమ్ముకొనేవారికీ పనికివస్తుంది, వెయ్యిబస్తాలు పండించి అమ్ముకొనేవారికీ పనికివస్తుంది. హెచ్చుగా లాభం తీసేవారుంటే, అటువంటి వారిమీద ఈనాడు అనేకమైన పన్నులు ఉన్నవి. పన్నులువేసి ప్రభుత్వం తీసు కొంటుంది. హెచ్చుగా పండించాలంటే, హెచ్చుగా పెట్టుబడి పెట్టాలి. హెచ్చుగా పన్నులు రాష్ట్రప్రభుత్వాలుగాని, కేంద్రప్రభుత్వంగాని వేస్తే, హెచ్చుపన్నులు వేస్తున్నారు అంటారు. దాన్నికూడ విమర్శిస్తున్నారు. కాని, ధర రైతుకు అవసరం. యుద్ధంవచ్చిన తరువాత రైతుసంగతి అందరిదృష్టికీ వచ్చింది. అంతకుముందు రైతువిషయం ప్రత్యేకంగా గమనించాలని అను కొన్నవారేలేరు. యమ్. వి. కృష్ణప్ప చెబుతూంటాడు. యుద్ధము రాక ముందు ఎవరైనా తనబిడ్డను ఎవరికైనా యిచ్చి పెళ్ళి చేయాలనుకుంటే టౌనులో ఉండే గుమాస్తాకో, టీచరుకో యిస్తే ఏనలభై, యాభై రూపాయలలో తెచ్చుకొని పోషిస్తాడని, తనబిడ్డ క్షేమంగా ఉంటుందని ఆలో చించి టౌనులోవానికి యిచ్చి పెండ్లిచేసేవాడు. యుద్ధమువచ్చిన తరువాత ప్రొక్యూర్‌మెంటు, కంట్రోల్సు పెట్టుటవలన టౌన్సులో కష్టమయిపోయినది. రేషనింగ్ పెట్టినప్పుడు టౌనులో కాపరంచేస్తున్న తనబిడ్డ చిన్నపిల్లలను ఇంటి వద్ద వదిలిపెట్టి రేషనింగుషాపువద్ద క్యూలో నిలబడి తగువులాడుకొనుట చూచి పెండ్లికి ఎదిగిన తన రెండవబిడ్డను పల్లెలలోయిచ్చి పెండ్లిచేస్తేనే క్షేమంగా ఉంటుందని, పట్టణాలలో యిస్తే క్షేమంలేదని ఆతండ్రి అనుకొన్నాడు. యుద్ధముయొక్క దుష్ఫలితాలతోబాటు ఒక సత్ఫలితంకూడా కనపడింది. పల్లెలలోకూడ జనం ఉన్నారని, వ్యవసాయం ఉన్నదని, అధికారం చేసేవారికి గాని, పెత్తనాలు చేసేవారికిగాని, టౌన్సులో ఉండేవారికిగాని కొంచెము తెలిసివచ్చినది. అయితే ఇప్పుడు కోతలసమయంలో పంటలధరలు తగ్గు తున్నాయి. ఆ సమయంలో అమ్ముకొనేవారు సన్నకారు రైతులు, ఇబ్బందు లలో ఉన్నరైతులు. సాధారణంగా డిసెంబరునుంచి మార్చివరకు ధరలు తగ్గులోఉండి సెప్టెంబరు వచ్చేసరికి హెచ్చుతున్నాయి. తక్కువధరకు అమ్ము కొన్న రైతులు నష్టపడుతున్నారు. వారికికూడ సరైనధర వచ్చేట్లు చేయాలని, అంటున్నారు. అక్కడ కౌన్సిలు చర్చలలోను, యిక్కడ అసెంబ్లీచర్చలలోను

ఈ మాట వచ్చింది. అది చేతనయితే ఈ ప్రభుత్వంగాని, లేక కేంద్ర ప్రభుత్వం సహాయం తీసుకొని గాని ప్రయత్నం చేస్తాము. ఇతర వస్తువులకు కూడ ఎందుకు ధరలు నిర్ణయించకూడదు అని కొందరు అన్నారు. ఆవిషయమే నేనుకూడ అడుగుతున్నాను. ప్రతివస్తువుకు ధర నిర్ణయించమని నేను అడుగుతున్నాను. ప్రత్యేకించి వ్యవసాయానికి సంబంధించిన ప్రతి వస్తువుకు ధర నిర్ణయించ మంటున్నాను ఫ్యాక్టరీలలో తయారై వస్తున్న వస్తువులధరలు నిర్ణయించటము సులభము. ఉత్పత్తికి సంబంధించిన ఐటమ్స్ 20, 30 ఉన్నవి. ఇన్‌కమ్‌టాక్స్‌బట్టి, ఇతర టాక్స్‌లుబట్టి వాటి ఉత్పత్తి యొక్క లెక్కలన్నీ సులభంగా దొరుకుతున్నవి. కాని వ్యవసాయానికి సంబంధించిన లెక్కలు దొరకటంలేదు. వ్యవసాయంలో పెట్టుబడిక్రింద ఇంటరెస్ట్ ఎందుకు కేలిక్యులేట్ చేయాలి అని ఒక పెద్దమనిషి అంటాడు. స్వంతంగా వ్యవసాయం చేసుకొంటే కూలి ఎందుకు ఇచ్చుకోవలసిఉంటుంది అని ఇంకొక పెద్ద మనిషి అంటాడు. సుందరయ్యగారుఇచ్చిన లెక్కలు చాలా బాగాఉన్నట్లుగా ఉన్నవి. దయచేసి ఆ లెక్కలు వారు నాకుయిస్తే నాలెక్కలలో ఏమైనా పొర పాట్లుఉంటే వాటిని సరిదిద్దుకోటానికి నేను సంసిద్ధంగాఉన్నాను. కౌన్సిల్‌లో గురవారెడ్డిగారు కొన్నిలెక్కలు చెప్పారు. గురవారెడ్డిగారు ధాన్యంధర మణుగు 5 రు. లు ఉండాలని చెప్పారు. ఇక్కడ సుందరయ్యగారు బస్తా 20 రు. ల వరకు ఉండవచ్చని చెప్పారు. సుందరయ్యగారు కొంతమెరుగ్గా, బస్తా 20 రు. ల వరకు ఉండవచ్చని చెప్పినందుకు సంతోషము. నేనుఇచ్చిన లెక్కలు నేను తయారుచేసినవి కావు. అవి ఉద్యోగస్థులు అనేక జిల్లాలనుండి సేకరించిన లెక్కలు. స్టేటిస్టికల్ డిపార్టుమెంట్‌వారు తయారుచేసి ఇచ్చిన లెక్కలు అవి. కాని రైతులుచెప్పే లెక్కలు ఇంకోరకంగా ఉన్నవి. "ఎవరినైనా కూలీలను పనికిపిలిస్తే, ఆకూలీలు ఎనిమిదిగంటలకాలం పనిచేస్తే, వారికి కూలి రెండు రూపాయలు ఇస్తున్నాము; అది గంటకులెక్కవేస్తే నాలుగణాలు పడుతోంది: ఆలెక్కప్రకారం, పొలంలో కష్టపడేరైతుకు, అతనిభార్యకు, బిడ్డలకు, ముసలి తండ్రికి కూలి లెక్కవేసినట్లయితే, ఎంతడబ్బు ఖర్చు అవుతుంతో చూడండి. కాబట్టి 'మీరుఇచ్చిన లెక్కలు తప్పు" అని కొంతమంది చెబుతున్నారు. ఈశాసన సభలో నేనుఇచ్చిన లెక్కలు తప్పుఅనేనారు కొంతమంది, ఇంకా చాలవనేవారు కొంతమంది ఉన్నారు. నేను పొలంలో పనిచేసేవారిని కొంతమందిని అడగగా వారు "మీలెక్కలు తప్పు; ఇంకా ఎక్కువ ఖర్చు వుంది'' అని చెప్పారు. దేశంలో కరువువచ్చినపుడు, అంతో ఇంతో కాపాడుతున్న సర్కార్‌జిల్లాలలో, యీ సంవత్సరం, సరిగా పంటలుకోసి, పొలంమీద వాలేసినప్పుడు వర్షాలు కురిసినవి. కోసినపంట కాస్తా మునిగిపోయింది. పంటంతా కుళ్ళిపోయింది.

శ్రీకాకుళం, విశాఖజిల్లాలలో 50 వేల ఎకరాలభూమిలో మెట్టవేసిపోయింది. అక్కడ కొంతమంది భూస్వాములు "స్వాములు" అయ్యారు. ఆమెట్ట తీసు కోవాలంటే, అఇసుక తీసుకోవాలంటే వాళ్ళకు సాధ్యంకాదు. వారికి ఇప్పుడు కాంగ్రెసుపార్టీనుండి విడిపోయి ఇంకోపార్టీలో చేరటానికి అభ్యంతరంఉండదు. ఎందుకంటే, వాళ్ళభూమి పోయినతర్వాత, వాళ్ళు ఏపార్టీలోచేరినా వారికిఅట్టే అభ్యంతరం ఉండదు. భూములు పోయినటువంటి ఆమనుష్యులకు దిక్కేముంది? భూమిలో పంట సక్రమంగా ఉంటుందనేఆశ రైతుకు యీనాడు ఉన్నదా? ఎప్పుడు కృష్ణపొంగుతుందో, ఎప్పుడు గోదావరి పొంగుతుందో తెలియదు. "ఈ భూమి నాది; నాబిడ్డలు దీంతో బ్రతుకుతారు" అని అనుకొనేదానికి రైతుకు అవకాశంలేదు. గోదావరి పొంగినా, కృష్ణ పొంగినా, తన భూమి ఉంటుందనే ఆశలేదు. వ్యవసాయానికి సంబంధించిన చర్చ శాసనసభలో వచ్చినపుడు, గౌరవ సభ్యులు కొందరు చాలా దయతో పలుకుతూంటారు. మామూలుగా గొఱ్ఱెను మేపేవాడికంటే, గొఱ్ఱెను కోసేవాడికి ఆ గొఱ్ఱెమీద ఎక్కువ అభిమానం ఉంటుంది. గొఱ్ఱెలను మేపేవాడికంటే, గొఱ్ఱెలను కోసేవాడు ఎంతో దయగా మాట్లాడుతాడు. గొఱ్ఱెలను మేపేవాడు, ఆ గొఱ్ఱెలు ఎక్కడకు పోతాయో యని, కర్రపెట్టి వాటిని కొడుతూంటాడు. కాని గొఱ్ఱెలు కోసే కసాయివాడు మాత్రం దానిని నిమురుతూ ఉంటాడు. ఆ రకమైన మాటలు శాసనసభలో వస్తూంటాయి. సంతోషమే. ఈ దినమున దురుద్దేశంతోనైనా అభిమానమైన మాటలు మాట్లాడినందుకు వారిని నేను అభినందిస్తాను. రైతుయొక్క అభివృద్ధిని కోరేవారిని నేను అభినందిస్తాను. కొందరు సభ్యులు దీనికొక కమిటీని వేయమన్నారు. కమిటీ వేసినంతమాత్రమున ఏమైనా ప్రయోజనం ఉంటుందా అని అడుగుతున్నాను దీనివల్ల ప్రయోజనం ఉంటుందంటే, కమిటీలు వేయ డానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఈనాడు నాలుగు ఎకరాలున్న రైతు ఎక్కువ పంట పండిద్దామంటే, అతనికి పెట్టుబడి లేదు. కాలవలోకి నీరు రాకముందు, అక్కడ ఫిల్టర్‌పాయింట్ గాని, బావిగాని త్రవ్వుకొని నీరు పంప్ చేసుకొని పైరుమళ్ళు పోసుకొందామంటే, రైతులకు దిక్కులేకుండా ఉంది. రాజకీయ పార్టీల, రాజకీయనాయకుల ధర్మమా అని, పల్లెటూళ్ళలో రైతులకు చదువు రాకపోయినా, యోచనచేసే సత్తా, శక్తి, సామర్థ్యం వచ్చింది. భూస్వాము లనిపించుకొనే యీ రైతుకు నలుగురు పిల్లలు పుడితే, ఒక పిల్లవాడినిమాత్రమే చదివించుకొంటున్నాడు. ఇంతో అంతో స్వాములుగా ఉండి, ఉద్యోగాలలో ఉండేవాళ్ళే ఎక్కువగా తమ బిడ్డలను చదివించుకోటానికి అవకాశం దొరుకు తోంది. పది ఎకరాలకన్న పైన భూమి ఉన్న వారిని ఎవరినైతే మనం షావుకారు రైతులని చిత్రిస్తున్నామో, ఆ రైతులు తమ బిడ్డలను ఎందుకు

చదివించుకోవటంలేదు? వాళ్ళ భూములు చూడండి. వాళ్ళ వ్యవసాయ పరికరాలు చూడండి. వాళ్ళ కొంపలు చూడండి. వాళ్ళు తినే తిండి చూడండి వారు అనుభవిస్తున్నది షావుకారు జీవితమేనా? ఒకరిని దోచుకొనే బ్రతుకేనా వారిది? అనేది మనకు తెలుస్తుంది. ఊరికే మాట్లాడటము సులభము, ఊరికే వ్రాయటము సులభము, పత్రికలలో వేయటము సులభము. పశువు ఎంత మూగో, రైతుకూడ అంతమూగ. రైతుకు నోరు తెరవటం చేతకాదు. రైతు నోరు తెరిచేందుకు వ్యవధిలేదు రైతు వాదించటానికి అవకాశంలేదు. కాని బ్రహ్మాండమైన నిర్ణయాలు జరిగిపోతున్నాయి. "సీలింగుకు యీ మంత్రిగారు వ్యతిరేక"మని వావిలాల గోపాలకృష్ణయ్యగారు అన్నారు నేను వ్యతిరేకినే. ఏదైతే వ్యవసాయముయొక్క అభివృద్ధికి అడ్డంవస్తుందో, దానికంతటికీ కూడ నేను వ్యతిరేకినే. సీలింగ్సు వ్యవసాయం అభివృద్ధికి తోడ్పడతాయని కొంత మంది అంటున్నారు. సీలింగ్సు వ్యవసాయం అభివృద్ధికి తోడ్పడితే, నేను సీలింగ్సుకు అనుకూలుడను. కాని సీలింగ్సు కావచ్చును, ధరలు కావచ్చును, మరియొకటి కావచ్చును. ఏదైతే వ్యవసాయాన్ని కుంటుపరచి, వ్యవసాయ దారుడ్ని అధైర్యపరచి, వ్యవసాయం గిట్టుబాటువృత్తికాదని వ్యవసాయాన్ని వదలి పట్టణాలకువచ్చి రిక్షా లాగుకొనేదుస్థితి రైతుకుకలిగిస్తుందో, దానికంతటికీ నేనువ్యతిరేకిని. వ్యవసాయం గిట్టుబాటువృత్తికాదని అనుకొని, వ్యవసాయాన్ని వదలిపెట్టి, టౌన్‌లకువచ్చి, రిక్షాలు ఈడ్చుకోవటం, బంకులు పెట్టుకొని బీడీలు అమ్ముకోవటం, లేదా నాలుగు అక్షరాలు నేర్చుకొని, చాలీచాలని జీతంతో ఉద్యోగంచేసుకోవటం మంచిది అని అనిపించే ఏ పాలసీకయినా ఏ చట్టానికైనా నేను వ్యతిరేకిని. వ్యవసాయంతో నేను కొంతకాలం బ్రతికినాను. ఇంటికిపోయి నపుడల్లా, నేను వ్యవసాయదారుడినే. భూమిమీద బ్రతికేవారి పరిస్థితిచూస్తే తెలుస్తుంది. ఈ భూమిని మనం ఇంత ఎందుకు నిర్లక్ష్యం చేశాం?—అని అనిపిస్తుంది. మొన్న పంజాబ్‌రావ్ దేశ్‌ముఖ్ చైనా వెళ్ళినపుడు అక్కడ ఎకరాకు 3,500 బస్తాలు బ్రహ్మాండంగా పండుతుందని వారితో చెప్పారు. 3,500 బస్తాలు పంట నేలమీద పరిస్తే ఎంతభూమి అక్రమించుకొంటుంది అని నేను లెక్కవేశాను. ఆ పంట అడుగుఎత్తు వస్తుందా? ఎంతఎత్తు వస్తుందనేది లెక్క వేశాను. చైనావాళ్ళు చెప్పినంతమాత్రాన, మనకు చెవులు ఉండి విన్నంత మాత్రాన నమ్మేదానికి ఎట్లా వీలవుతుంది? వారు చెప్పింది నిజమేనని చెప్పేవారు దేశంలో ఉన్నారు. "మీ కాంగ్రెసు నాయకుడే చెప్పాడు" అని అంటున్నారు. కాని "ఈ మాదిరిగా నాకు చెప్పిరి; నేను వింటిని. దీనిసంగతి తెలుసుకోవాలి"అని పంజాబ్‌రావ్ దేశ్‌ముఖ్‌గారు చెప్పారు. కాని కొందరు "మీ పంజాబ్‌రావ్ దేశ్‌ముఖ్‌గారు చెప్పారు కాబట్టి, చైనాలో ఎంత బ్రహ్మాండ

మైనపంట పండుతోందో చూడండి" అని అంటున్నారు. చైనాలో బ్రహ్మాండంగా పండిఉండవచ్చు. రష్యాలో బ్రహ్మాండంగా పండిఉండవచ్చు. సోవియట్ రాజ్యాన్ని గురించి ఇన్‌ఫర్మేషన్ ఆగస్టునెల ఇస్యూలో వచ్చింది. దాంట్లో వ్యవసాయాన్ని గురించి కలెక్టివ్స్ గురించి ఇన్‌ఫర్మేషన్ ఇచ్చినారు. చాలా కలెక్టివ్స్ వైండప్ చేయవలసి వచ్చింది అని అందులో వ్రాశారు.

శ్రీ పి. సుందరయ్య : ఏ దేశంలో ? ఎక్కడ ?

శ్రీ పి. తిమ్మారెడ్డి : రష్యాదేశంలో కలెక్టివ్స్‌ను తీసివేసినారు. దయచేసి గౌరవసభ్యులు ఆ ఇస్యూ చూస్తే తెలుస్తుంది.

శ్రీ పి. సుందరయ్య : ఏ పత్రికలోనండి ?

శ్రీ పి. తిమ్మారెడ్డి : "సోవియట్ న్యూస్" తెలుగు పత్రికలో ఉన్నది. దయచేసి సప్లిమెంట్‌ను చూడండి. కలెక్టివ్స్‌ను మూసేసినారని అందులో ఉన్నది.

శ్రీ పి. సుందరయ్య : అంటే, మంత్రిగారికి కలెక్టివ్స్ అంటే అర్థమే కాదన్నమాట.

శ్రీ పి. తిమ్మారెడ్డి : పోనీ, నాకు అర్థంకాదు. అది గౌరవసభ్యులకు అర్థం కావలసిందే గాని, నాకు అర్థంకాదు. నేను చదివినంతవరకు, నాకు అర్థమైనది ఏమిటంటే- ఎంత ప్రయత్నం చేసినా అక్కడ గిట్టుబాటు కాలేదు కాబట్టి కలెక్టివ్స్‌ను క్లోజ్ చేసినామన్నారు. దయచేసి ఆ ఇస్యూ చూడండి. ఆ సప్లిమెంట్ చూడండి. తరువాత, నాకు చదువురాకపోతే, నాకు అర్థం కాకపోతే, గౌరవసభ్యులు చెబితే నేర్చుకొంటాను......

శ్రీ పి. సుందరయ్య : మేము చెబితే మీరు (మంత్రులు) నేర్చుకొనేది లేదు, మీరుచెబితే మేము నేర్చుకొనేదిలేదు. కాబట్టే మీరక్కడ, మేము ఇక్కడ ఉన్నాము. "మీరుచెబితే మేము నేర్చుకొంటా" మని చెప్పటం ఎందుకు ? ఆ మర్యాద ఎందుకు ?

శ్రీ పి. తిమ్మారెడ్డి : అది చాలా సరసమైన పని. నేను ఒకవిషయం మనవిచేస్తాను. మొన్న ఢిల్లీలో సదరన్ ఫుడ్‌మినిస్టర్స్ కాన్ఫరెన్స్ జరిగినపుడు, కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ కేలిక్యులేట్ చేయవలసిందిగా టి. టి. కృష్ణమాచారిగారికి, ప్రత్యేకంగా జైన్‌గారికి చెప్పినాను. ఆయన చేతులెత్తారు. అది చేసేటట్లుగా ఉంటే ఎక్కడ వీలవుతుంది ? రైతుకే ఇంకా మనం సహాయం చేయవలసి ఉంటుంది అన్నారు.

To-day in India agriculture has to be subsidised. వినియోగదాదార్ల పరిస్థితులు ఎలా ఉన్నాయి అనేది వేరేవిషయం. వ్యవసాయం ఈనాడు దేశంలో un-economic గా ఉంది. అట్లాగైతే రైతులు దివాళా ఎత్తవలసిందే; ఎందుకు వ్యవసాయం చేస్తున్నారు అని కొందరు అడుగుతున్నారు. ఆవ్యవసాయం చేసుకొంటేనే కాని వారికి రోజుగడవదు. బయటకుపోతే కూలిచేసుకోవాలి. ఇప్పటికే బయట కూలిచేసేవారు చాలా మంది ఉన్నారు. ఈనాడు వ్యవసాయదార్ల తిండి, తీర్థం, బ్రతుకుచూస్తే, వారుచేసే వ్యవసాయం గిట్టుబాటు అయినదో కాదో తెలుస్తుంది. అంత గిట్టుబాటుకాని వ్యవసాయం ఎందుకు చేస్తున్నాడని అడిగితే, చేయక గంగలోపడి చస్తాడా లేక రైలుక్రిందపడి చస్తాడా? ముందుకాలంలో ఏమయినా ఉద్ధరిస్తారేమోనని చూస్తున్నారు. దేశంలో చాలా ప్రాజక్టులు తయారవుతున్నాయి విద్యుచ్ఛక్తి ఉత్పత్తి త్వరత్వరగా అభివృద్ధి చెందుతోంది. నీటిసౌకర్యాలు బాగాఏర్పడి, ఎరువులను వినియోగిస్తే, ఇంకా కొంచెం ఎక్కువపంట పండించడానికి అవకాశం ఉంది. ఈరోజు ఉదయం ముఖ్యమంత్రి గారితో మాట్లాడుతుండగా; రూ. 70 లక్షలు తుంగభద్ర ఎగువకాలువకు లభిస్తుందని చెప్పారు. ఈవిధంగా మనకు మంచి అవకాశాలు వస్తున్నాయి. ప్రకాశంపంతులుగారు ముఖ్యమంత్రిగావున్న సమయంలో ప్రారంభించిన 16 ప్రాజక్టులక్రింద భూమి ఇప్పుడు కొంత సాగులోకి వస్తోంది. ఈవిధంగా ప్రతి జిల్లాలోను కొన్నివేల ఎకరాలు ఉంటాయి. పరిస్థితులు బాగున్నాయి. ధరలు తగ్గుతున్నాయి. ఈమధ్యన కేరళరాష్ట్రంనుంచి శ్రీ జార్జివచ్చి రు 37-8-0 చొప్పున రెండుమణుగుల బియ్యం ఖరీదుచేశారు. క్రిందటిసారి వారే రు. 40-41 చెల్లించవలసి వచ్చింది. ధరలు ఇంకా తగ్గే పరిస్థితులున్నాయి. కేరళ రాష్ట్రంవారు ఇంకా ఎక్కువ సరుకు కావాలంటున్నారు. అక్కడిపరిస్థితులను గురించి వారు కొన్ని లెక్కలు చెప్పారు. వాటిని నేను ఎక్కడా వ్రాసుకోలేదు. నాకు లెక్కలు పెట్టుకోవడం చేతకాదు. చదువుకొనే రోజుల్లోకూడా నేను లెక్కలలో నిపుణుడను కాను ఇంతో అంతో ఇచ్చారు అని చెప్పుకోవడానికి అక్కడ ration shops లో వారానికి కుటుంబానికి రెండు తూకంశేర్లు ఇస్తున్నారు. కేరళలో రు. 28 లు అమ్మే బియ్యం ఆంధ్రరాష్ట్రంలో రు. 20 లకు అమ్ముతోంది. భారతదేశం మొత్తంపైన ఆంధ్రప్రదేశ్‌లోనే బియ్యంధర తక్కువ. మిగతా అన్ని రాష్ట్రాలలోనూ హెచ్చే. దేశంలో ఈ ధరలను గురించి పెద్దవాదం బయలుదేరింది. వారి వారి ఉద్దేశ్యాల ప్రకారం మాట్లాడటం జరుగుతోంది. తిండిగింజల ధరలు పెరిగితే, Planning ఖర్చులు పెరుగుతాయేమో! కనుక ఈ విషయంలో ఆలోచించమని కేంద్రం రాష్ట్రప్రభుత్వాలకు వ్రాసింది. ఇది రాజకీయపార్టీలకు మంచి అవకాశంగా దొరికింది.

హైద్రాబాద్ పట్టణంలో తక్కిన ప్రాంతాలకంటె, ధరలు కొంచెం హెచ్చుగా ఉంటాయి. అది ఈ పట్టణంయొక్క ప్రత్యేకత. Procurement సరిగా జరుగుతున్నా, నిజామాబాద్‌లో ధరలు తక్కువ. అక్కడనుంచి తీసుకొనివచ్చి ఇక్కడ పంపడానికి ఏర్పాటుచేస్తే, cards issue చేయడం ఒక పెద్దగొడవ. అన్నిఅవస్థలూ తయారవుతాయి. నేను నిన్న Council లో కూడా దీనికి ఒకపద్ధతి చెప్పాను. Madras లో ఉన్నట్లు co-operative basis మీద, Triplicane Urban Co-operative Society మాదిరిగా ఇక్కడకూడా పెట్టిన సౌకర్యంగా ఉంటుంది. దానికి ప్రభుత్వంనుంచి లక్షలు, కోట్లు కావలసినా ఇవ్వవచ్చు. ధాన్యం కొని Banks లో పెడితే ఇంకాడబ్బు వస్తుంది. అందువల్ల rotate చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. దేశంలో గింజలు తక్కువ పండితే కేంద్రప్రభుత్వం ఇతరదేశాలనుంచి తెప్పిస్తోంది. రాష్ట్రంలో లేకపోతే ఇతరప్రాంతాలనుంచి తెప్పిస్తున్నాము. దానిని ప్రభుత్వమే పంచే ఏర్పాట్లు చేయాలంటే, అప్పారావుగారు చెప్పిన సంగతి పూర్తి అవుతుంది. ఎందువల్లననగా ప్రభుత్వోద్యోగుల ద్వారా ప్రభుత్వమేకొని shortages & demurrages మొదలైనవన్నీ చూసినచో 1951-52 సంవత్సరాలు జ్ఞాపకం వస్తున్నాయి. ఆనాడు ration shops లో బియ్యం తెస్తే, ఇండ్లలోని ఆడవారు ఎందుకు తెచ్చావని దెబ్బలాడేవారు. ఒక రూక ఎక్కువైనా బయట తెమ్మనేవారు. Ration shop గింజలంటే ఒక ప్రత్యేక quality గా తయారయ్యాయి. దీనికి బాధ్యులు ఎవరు? ఆ తిండి దొంగలను కాల్చివేయాలని చెప్పవచ్చు ఈ రకంగా కాల్చవలసివస్తే వివిధ విషయాలలో శిక్షణాభాను కాల్చవలసి వస్తుందేమో. అలా కాకుండా దీనిని సర్దుబాటు చేసుకోవడానికి కొంత ప్రయత్నం కావాలి. ధరలు పడిపోతుంటే వాటిని నిలబెట్టడానికికూడా ప్రయత్నాలు కావాలి. ఇది ఒక్క రాష్ట్ర ప్రభుత్వం చేయగలిగిన పనికాదు కేంద్రప్రభుత్వం lead తీసుకోవాలి. కేంద్రం సేకరించే ధాన్యంనుంచి మారాష్ట్రానికి కొంత ఇవ్వండి: హైద్రాబాద్ పట్టణానికి, నిజాంసాగర్ ప్రాజక్టుకు, విశాఖపట్టణం హార్బరు area కు, బెల్లంపల్లి ప్రాంతంలో కావాలని మేము అడిగాము. కాని వారు అందుకు అంగీకరించలేదు. ఇది ఒక్కనాటి సమస్యకాదు. చిన్న సమస్య కాదు. కోట్లకు సంబంధించిన సమస్య. రాష్ట్రాల, కేంద్రప్రభుత్వ మొత్తం ఆదాయాలను ఖర్చుచేసినా తీరనిసమస్యగా ఉన్నది. కేంద్రప్రభుత్వం ఏదో lead తీసుకుని పనిచేస్తున్నది. ఇంతో, అంతో పనిచేస్తోంది. నేను ఇచ్చిన లెక్కలు పొరబాటుగా ఉంటే, మరోసారి వేయించవచ్చు. సుందరయ్యగారు తయారుచేసిన లెక్కలు నాకు ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

రెండున్నర లక్షల కుటుంబాలను కాపాడటంకోసం, అరవై లక్షల కుటుంబాలను అహుతిచేస్తూన్నామని చెప్పారు. ఈ మాటలు ప్రజలకు వదలి పెడదాము. రాజకీయ ప్రయోజనాలకోసం హత్యలు, కజ్జాలు, కొట్టుకోవడాలు వస్తాయి. ఎక్కడా ఏమీలేకపోతే వారికీ, వీరికీ మధ్య నిప్పు పెట్టవలసివస్తుంది. రైతులందరూ ఒకవర్గమని మనవి చేస్తున్నాను.

శ్రీ పి. సుందరయ్య : మేము నిప్పు పెడుతుంటే ప్రభుత్వ పక్షంవారు నీళ్ళల్లో ముంచడానికి ఉన్నారు కదా ?

శ్రీ పి. తిమ్మారెడ్డి : (సుందరయ్యగారు) అన్నట్లు నేను భూస్వాముల మంత్రిని అయ్యేటట్లుగాఉంటే; ఈభూస్వాములకు కొంచెం ఇంగితజ్ఞానం ఉండే టట్లయితె; ఈ millers కు కొంచెం చలనం ఉండేటట్లయితే, ప్రతిపక్ష మనేది ఉండదు.

శ్రీ పి. సుందరయ్య : అలా చేసినప్పటికీ ప్రతిపక్షంగా ఉన్నాము.

శ్రీ పి. తిమ్మారెడ్డి : ఉండలేరు. ఎందువల్ల ఉండరో నాకు తెలుసు. వాళ్ళను కూడా ఎంచుకోవడం తెలుసు; చేతనవును. గ్రామాలలోని ఈ భూస్వాములను ఈ వర్గాలనుకూడా ఉపయోగించుకోవడం మీకు (ప్రతిపక్షా నికి తెలుసు. మాకు ఏరకంగా వారు ఉపయోగపడుతున్నారో; కూడా అదే రకంగా ఉపయోగపడుతున్నారు. మాకంటె మీకు ఎక్కువ ఉపయోగపడ తారేమోనని, అనిపిస్తోంది. తెలిసి మాకు ఉపయోగపడతారు. తెలియకుండా మీకు కనిపిస్తూ ఉంటుంది వారియొక్క ఉపయోగం. నా ఉద్దేశ్యంలో, ఈ ప్రభుత్వ ఉద్దేశ్యంలో, కాంగ్రెస్‌సంస్థ ఉద్దేశ్యంలో, భూమిపైన ఆధారపడే వారందరు—పెద్ద రైతులు, చిన్నరైతులు, వ్యవసాయకూలీలు—ఒక వర్గం. వ్యవసాయదారులకు సరియైనధరలు, వ్యవసాయ కూలీలకు సరియైన కూలిని లభింపచేయడానికి ప్రభుత్వాలు కొద్దో, గొప్పో ప్రయత్నం చేస్తున్నాయి. రాబోయే కాలంలో వీరందరినీ ఒకవర్గంగా ఏర్పాటుచేయాలని మా ఉద్దేశ్యం.

Commercial crops ధరలు సమయానికి రావడంలేదని చిదంబరరెడ్డి గారు చెప్పారు. Export quotas చాలా ఆలశ్యంగా నిర్ణయిస్తున్నారు. ఢిల్లీ ప్రభుత్వం మనకు కొంచెందూరంగా ఉంది. మనకంటె కొంచెం పెద్దప్రభుత్వం. వారికి సమయానికి చెబితే మనస్సుకు తోస్తుందో, లేక తెలిసి ఎంచుకోలేకుండా ఉన్నారో తెలియకుండా ఉంది. ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే ground-nut మొదలైనవి ఉన్నాయి. వీటిని సకాలంలో ఎగుమతి చేయించడం లేదు. ఇది సదుద్దేశ్యమో. లేక దురుద్దేశ్యమో నేను చెప్పలేకుండా ఉన్నాను. ఆంధ్ర

దేశంనుంచి పొగాకు, ప్రసుపు, జనపనార, మిరపకాయలు మొదలైన ఇతర దేశాలకు పంపేవి ఉన్నాయి. సమయానికి crop forecast లేకనో మరేకారణంవల్లనో సమయానికి - export quotas declare చేయకపోవడంవల్ల మన రైతాంగానికి సరియైన ధరలు రావడంలేదు.

ఈ లెక్కలనుగురించి రత్నసభాపతిగారు చెప్పారు. వీటిని ఎక్కువ శ్రద్ధ చేయడానికి నేను సంసిద్ధంగానే ఉన్నాను. ధరలు తగ్గిపోతే ఈ ప్రభుత్వం ఏమి చేయదలుస్తోందని అడిగారు. అది పెద్దగొడవగా ఉంది. గడచిన 10-20 సంవత్సరాలలో, మామూలుగా critics అనుకొనేవారి లెక్కలలోకూడా, ధరలు ఎన్నాళ్ళు పెరిగాయి, ఎన్నాళ్ళు తగ్గాయిఅని చెప్పినారేమోననిచూస్తే, ఈ రాజకీయ ఉద్యమాలతో మిశితమైన ధరలు ఇప్పుడు కొంచెం తగ్గినట్లు కనిపిస్తోంది. మిగిలిన సమయాలలో ఎప్పుడూ ఈ ధరలు పెరిగినట్లు లేదు.

1953-54 వ సంవత్సరంలో ఉన్నధరల కంటే, ఈనాడు ఎంతవరకు పెరిగాయి ? అనేది నేను చాలా కాలం నుంచి అడుగుతున్నాను. దీనికి ఈనాటి వరకు సమాధానం లేకుండా ఉంది. చిదంబరరెడ్డిగారు చెప్పినట్లు ఎంతడబ్బు అదనముగా circulation లోకి pump అయింది ? 1952 నాటికి రు. 11 వందల కోట్ల చిల్లర circulation లో ఉంటే, ఈనాడు అది రు. 20 వందల కోట్ల దగ్గర దగ్గరకు పోయినట్లు ఉంది. ఇంత డబ్బు circulation లోకి వచ్చిన తరువాత, ధరలమీదదాని impact ఏమిటి ? ఇంతో అంతో economics చదువుకొన్న వారు; ప్రవీణులు కూడా ఇక్కడ ఉన్నారు. డబ్బు హెచ్చుగా circulation లోకివస్తే దాని impact ఎట్లా ఉంటుందో యోచన చేయలేమి ?

దీనిగురించి మనం యోచనచేయాలి. ఈరోజున మార్కెట్టులో ఉన్న వస్తువుల ధరలు బాగా పెరిగిపోయాయి. ఆ వస్తువులను, కొనే స్థోమతు ఈ నాడు రైతుకు ఉన్నదా ? రైతుకు ఈరోజున building activity ఎక్కడ ఉన్నది ? Repairing activity ఎక్కడ ఉన్నది ? Education activity ఎక్కడ ఉన్నది ? రైతులుదగ్గరే డబ్బు ఉన్నట్లయితే, వాటికోసం ఖర్చుపెట్టుకోరా ? ఈ కవులు, ఒకచోట కూర్చుని తిట్టు, తిట్టుకు, మాటకు- మాట వ్రాస్తుంటారు. ఆవిధంగానే ఉన్నాయి మనంచేసే ఆర్గ్యుమెంట్సు. మరిపిరివిగాఉండి, బ్రహ్మాండంగా బల్లగుద్ది ఉపన్యాసంయిస్తే, 'మహాబాగుంది' అని అంటున్నారు గాని వారు చెప్పే విషయాలలో, ఎంతవరకు వాస్తవికం కనపడుతున్నది గ్రహించాలి. వ్యవసాయమంత్రిగా, సుందరయ్యగారు చెప్పినట్లుగా భూస్వాముల మంత్రిగా నేను ఈరోజున సిద్ధంగాఉన్నాను. నాలో ఏమైన లోపాలు

ఉన్నట్లయితే చెప్పండి సరిజేసుకొంటాము. ఇంతవరకు వ్యవసాయానికి సంబంధించిన సమస్యలమీద గాని, రైతులయొక్క సమస్యలమీద ఎవరిదృష్టి పడలేదు, ఎవరూ వారిగురించి ఆలోచించలేదు. అసలు ఎవరికి అక్కరలేకపోయినది. రేపు ధరలు పడిపోయినట్లయితే వారిగురించి మాట్లాడేవారు ఉండరు. అప్పుడు ఇంకోరకమైన ఆర్గ్యుమెంట్సు చేస్తారు. బస్తీలలోగాని, రాజకీయ పార్టీలుగాని, ధరలుపడిపోయినట్లయితే, ఇప్పుడుమాట్లాడే ధోరణిలో మాట్లాడరు. అనేకమంది సభ్యులు అనేకవిషయాలు చెప్పారు. అప్పారావుగారు మార్కెటింగు గురించి చెప్పారు. కృష్ణాజిల్లా, చాల అనుకూలమైనజిల్లా. అక్కడ నీటివనరులు చాలాఉన్నాయి; తుంగభద్రనుంచి ఇంకా అదనంగా నీటిసౌకర్యం వచ్చేది ఉన్నది. దానివల్ల 30, 40 వేల ఎకరాలభూమి అదనంగా సాగులోకివస్తుంది. అందుచేతనే ప్రభుత్వంకూడ ఎక్కడైతే ఎక్కువ పండించడానికి అవకాశం ఉన్నదో, అక్కడే ఎక్కువడబ్బు ఖర్చుపెడుతోంది. వావిలాల గోపాలకృష్ణయ్యగారు చెప్పినట్లుగా గుంటూరుకాలవను **take up** చేయడానికి వీలులేదు. అందులో రాజకీయాలు ఉన్నాయి. ఎందుచేతనంటే నాగార్జునసాగర్ కాలవల నీటి పారుదలలో ఆ ప్రాంతంలేదు. అందుచేత ముందు కావాలని అంటున్నారు. ఒకప్లానుప్రకారం ఆనీళ్లు అందించడానికి ప్రభుత్వం పూనుకొన్నది. ఆ విధంగా జరుగుతున్నది.

అధ్యక్షా ! గౌరవసభ్యులు చాలా విషయాలు చెప్పారు సంతోషము. కాని సుందరయ్యగారు, కొంతమంది మిత్రులు చేసినట్లుగా, ఈ చర్చలు ఇక్కడికిక్కడే విడిచిపెట్టి పోవటంలేదు ప్రభుత్వానికి సంబంధించినంతవరకు ఉన్న విషయాలను ప్రభుత్వం ఎప్పుడూ గమనిస్తూనే ఉన్నది. ఇది ఒక్క రాష్ట్రానికి సంబంధించిన సమస్యకాదు. అన్నిరాష్ట్రాలకు ఇందులో సంబంధం ఉన్నది. మొన్న భక్తవత్సలంగారు ఢిల్లీలో మాట్లాడుతూ మదరాసు రాష్ట్రంలో ప్రతి జిల్లాకూడ **self-sufficient** అయినది ఒక్క మదరాసు సిటీతప్పితే అని అన్నారు. ఇక్కడ సిటీలో ఉండేవారికి కష్టంలేకుండా మనం ఏదైనా ప్రయత్నం చేయాలి. ఈ సందర్భంలో ఒక్కటిమాత్రం ఖచ్చితంగా చెప్పదలచుకొన్నాను. కాంగ్రెసుపార్టీ **unpopular** కావాలని అనుకొంటే ఈ కాంగ్రెసు ప్రభుత్వాలను గద్దెనుంచి దింపాలి అనుకొంటే **total procurement, total distribution** పెడతారు. 1951-52 లో కాంగ్రెసుపార్టీ దెబ్బతినడానికి ఈ **procurement** కారణమని మనవి చేస్తున్నాను. కొంతమంది తమపార్టీని అధికారంలోకి తీసుకొని రావడానికి ఈ విధంగా వాదం లేవదీస్తే తీయవచ్చు.

**ఒక గౌరవ సభ్యుడు : అధ్యక్షా, ... ...**

శ్రీ పి. తిమ్మారెడ్డి: నేను వారిని అనలేదు. అప్పటికి వారిపార్టీ యింకా pictureలోకి రాలేదు వచ్చే ఎన్నికలలో ఆంధ్రరాష్ట్రాన్ని కూడ పట్టుకొంటాము. అని అంటున్నారు. మన అగ్రికల్చర్ మెంటు వారికి ఉపయోగ పడుతోంది. అటువంటి పొరబాటును మేము చేయదలచుకోలేదు. State trading పెట్టాలనిఅంటున్నారు. అది ఎప్పుడు పెట్టాలి; ఎంతెంత కూలి యివ్వాలి; రైతుకు, కన్స్యూమర్సుకు యిబ్బందిలేకుండా ఏవిధంగా చేయాలి అనే విషయాలపై ఆలోచిస్తున్నాము. అందరిసహకారంతో ఆ సమస్యలను పరిష్కరించవలసియున్నది. మొన్న కౌన్సిలులో శ్రీ మొఖ్దూమ్ మొహిద్దీన్ గారు మాట్లాడుతూ, "హైదరాబాదు సిటీలో ట్రిప్లికేన్ అర్బన్ కోపరేటివ్ సెంటర్సు వంటివి పెట్టడానికి ప్రభుత్వం సహాయం చేస్తారా" అని అడిగారు. తప్పకుండా సహాయం చేస్తామని చెప్పాను. అలాగే యిక్కడ సుందరయ్యగారు కూడ కోఆపరేటివ్ పద్ధతిమీద ధాన్యాలుఅమ్మడానికి పూనుకొన్నట్లయితే, తప్పకుండా ఎంతసహాయం కావాలో అంతా చేస్తాను. గౌరవ సభ్యులు యిచ్చిన సలహాలు అన్నీ ప్రభుత్వం పరిశీలించింది. అధ్యక్షా! ఈ చర్చలలో పాల్గొన్న సభ్యులందరికిని, రెండు గంటలపైగా అయినప్పటికిని ఓపికతో కూర్చున్న మీకు ధన్యవాదాలు అర్పిస్తూ సెలవుతీసుకొంటున్నాను

## MESSAGE FROM THE COUNCIL

*The Hyderabad Municipal Corporations (Andhra Pradesh Amendment) Bill, 1958.*

*The Andhra Pradesh State Legislature (Vacation of Seat on Simultaneous Membership) Bill,* 1958 *and*

*The Andhra Essential Articles Control and Requisitioning (Temporary Powers) (Andhra Pradesh Extension and Amendment) Bill,* 1958

*(as passed and agreed to by the Legislative Council.)*

*Mr. Speaker :* I have to announce to the House that I have received the following message dated 20th December, 1958 from the hon. Chairman of the Legislative Council :

"In accordance with Rule 111 of the Andhra Pradesh Legislative Council Rules as adopted under clause (2) of Article 208 of the Constitution of India, I transmit a copy of the Hyderabad Municipal Corpo-

rations (Andhra Pradesh Amendment) Bill, 1958 (L. A. Bill No. 49 of 1958), of the Andhra Pradesh State Legislature (Vacation of Seat on Simultaneous Membership) Bill, 1958 (L.A. Bill No. 50 of 1958) and of the Andhra Essential Articles Control and Requisitioning (Temporary Powers) (Andhra Pradesh Extension and Amendment) Bill, 1958 (L. A. Bill No. 52 of 1958) as passed and agreed to by the Legislative Council on the 20th December, 1958 without any amendment and signed by me."

## *The Indian Stamp (Andhra Pradesh Extension and Amendment) Bill,* 1958.

*Mr. Speaker :* I have also to announce to the House that I have received the following message dated 20th December, 1958 from the Hon. Chairman of the Legislative Council :

"In accordance with Rule 111 of the Andhra Pradesh Legislative Council Rules as adopted under clause (2) of Article 208 of the Constitution of India, I return herewith a copy of the Indian Stamp (Andhra Pradesh Extension and Amendment) Bill, 1958, (L. A. Bill No. 51 of 1958) which was passed by the Legislative Assembly at its sitting held on 18th December 1958 and transmitted to the Legislative Council for its recommendations, duly signed by me and state that this House has no recommendations to make to the Legislative Assembly in regard to the said Bill."

ఇంతవరకు మనం ఎన్నో sensational విషయాలపై చక్కటి చర్చలు కొనసాగించాము. మొత్తంమీద అన్ని విషయాలను జయప్రదంగా కొనసాగించాము.

ఇప్పుడు యిక శాసనసభను తేదీ నిర్ణయంలేకుండా వాయిదా వేయడమైనది. మరల ఫిబ్రవరిలో పదోతేదీన మనం సమావేశము అవుతాము.

*(The House then adjourned sine die.)*

★